వీక్షణం

ఆర్థిక, సామాజిక పత్రిక

47

మే/జూన్ 2005

రూ. 12

* వై ఎస్ ఏడాది పాలన పనితీరుపై సమీక్ష
* జయతీ ఘోష్ నివేదిక
* ఉమ్మడి మార్కెట్ కోసమే వ్యాట్
* భారత విదేశాంగ విధానం
* వ్యవసాయ సంస్కరణలు

వీక్షణం

ఆర్థిక, సామాజిక పత్రిక

47

మే/జూన్ 2005

రూ. 12

* వై ఎస్ ఏడాది పాలన పనితీరుపై సమీక్ష

* జయతీ ఘోష్ నివేదిక

* ఉమ్మడి మార్కెట్ కోసమే వ్యాట్

* భారత విదేశాంగ విధానం

* వ్యవసాయ సంస్కరణలు

మీ సాయం...
చిన్ని గుండెకు ప్రాణదానం!



రాష్ట్రంలో ప్రస్తుత అంచనాల ప్రకారం హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారులు దాదాపుగా రెండు లక్షల మంది వరకు ఉన్నారు. ఈ పసిపిల్లలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వైద్యసదుపాయం అందించే ఏర్పాట్లు చేసింది.

పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రవాసాంధ్రులు, కనికరం ఉన్న ప్రతి ఒక్కరూ స్పందించి హృద్రోగులైన చిన్నారులను ఆదుకోవడానికి ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందించవలసిందిగా విజ్ఞప్తి.


మీ విరాళాలను చెక్కు/డి.డి. రూపంలో **"ముఖ్యమంత్రి బాలల సహాయ నిధి"** కి పంపించండి

ఇతర వివరాల కోసం :
ఎస్. వెంకట సుబ్బయ్య
డిప్యూటీ సెక్రటరీ,
రెవెన్యూ డిపార్ట్‌మెంట్, సెక్రటేరియట్, హైదరాబాదు వారిని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించవచ్చు
ఫోన్: 040-2345 4656 (ఆఫీసు) 040-2360 8457 (రెసిడెన్స్) సెల్: 98499 05203

పసిపిల్లల హృదయ సంరక్షణ

పసిపిల్లల హృదయ సంరక్షణకు మీరు అందించే ప్రతి రూపాయికి రశీదు అందజేయబడుతుంది. మరియు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

జారీ చేసినవారు : సమాచార పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్





పసిపిల్లలు మన ఇంటి దీపాలు. చిరునవ్వుల వెలుగులు చిందించే చిన్నారులు ఎందరో గుండెజబ్బులకు గురై భవిష్యత్తుతో పోరాటం చేస్తున్నారు. ఆ చిరునవ్వుల గుండెలకు భద్రత కల్పించాలి. నిండు నూరేళ్ల జీవితాన్ని వారికి అందించాలి. మానవత్వం పరిమళించినచోట మాటకందని భావాలు వ్యక్తం అవుతాయంటారు. ఈ చిన్నారులు మన చుట్టూనే ఉన్నారు. సాయంకోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతి హృదయం కదలాలి. మీరందించే సాయం వేలాది పసిహృదయాలకు ప్రాణం పోయాలి. ఈ ప్రయత్నంలో మీరంతా మాకు అండగా ఉండాలని **"ముఖ్యమంత్రి బాలల సహాయ నిధి"** కి విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మీ ఔదార్యం పసిహృదయాలకు నిండు జీవితాన్ని అందించాలని ఆశిస్తున్నాను.

డా॥ వై. ఎస్. రాజశేఖర రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి బాలల సహాయ నిధికి విరాళాలు అందిద్దాం - పసిహృదయాలను ఆదుకుందాం!

R.O. No.114/Sou/Advt.I/2005

విడి ప్రతి: రు. 12
వార్షిక చందా: రు.150

వీక్షణం
ఆర్థిక, సామాజిక పత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్
47 మే - జూన్ 2005

సంపాదకీయం

పాఠకులతో సంభాషణ

'వీక్షణం' గౌరవ సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు ఎబికె ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులుగా మే 4 న ప్రమాణస్వీకారం చేశారు. తెలుగులో సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై విరివిగా రచనలు చేస్తూ, రచనలు రావాలని ఆశిస్తూ, అటువంటి రచనల వేదికగా 'వీక్షణం' ను ప్రారంభించిన బృందానికి నాయకత్వం వహిస్తూ వచ్చిన ఎబికె ప్రసాద్ ఈ బాధ్యతలను చేపట్టడం 'వీక్షణం' బృందానికి గర్వకారణం. అధికార పదవిలో ఉంటూ, గౌరవ సంపాదకుడిగా తన బాధ్యతలు నెరవేర్చడం సాధ్యం కాకపోవచ్చునని, కనుక 'వీక్షణం' నుంచి తాత్కాలికంగా తప్పకుంటానని ఎబికె అన్నారు. కాని 'వీక్షణం' నిర్వాహక బృందం అందుకు అంగీకరించలేదు. అధికార భాషా సంఘం ఎబికె నేతృత్వంలో నిజమైన విజయాలు సాధించగలదని, తెలుగుకు అన్నిరంగాలలోను ఇతోధిక ప్రాధాన్యత దక్కేటందుకు కృషిచేస్తుందని 'వీక్షణం' విశ్వసిస్తోంది. ఆయనకు, ఇతర అధికార భాషా సంఘం సభ్యులకు 'వీక్షణం' శుభాభినందనలు తెలియజేస్తోంది.

* * *

'వీక్షణం' వస్తువులో, రూపంలో గత నాలుగైదు నెలలుగా చోటు చేసుకుంటున్న మార్పులను పాఠకులు గమనిస్తూనే ఉంటారు. పాఠకులతో నిత్యం సంభాషించదలచుకున్న పత్రికగా 'వీక్షణం' ఈ మార్పుల గురించిన వివరా లన్నింటినీ, ఆకాంక్షలన్నిటినీ పాఠకులతో పంచుకోదలచింది. ప్రచురితమవుతున్న వ్యాసాల ఇతివృత్తాల గురించి,శైలి గురించి, ముద్రణగురించి, కాలవ్యవధి గురించి, సమీక్ష జరిపి తగిన సవరణలు చేయడం ఈ మార్పులలో భాగం.

ఎన్నో సంవత్సరాలుగా ప్రజాపక్ష వైఖరితో సామాజిక, ఆర్థిక,రాజకీయ వ్యవహారాలను పరిశీలిస్తూ, వ్యాఖ్యానిస్తూ వచ్చిన పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు ఆ వ్యాఖ్యలకు ఒక వేదిక కావాలని ఆకాంక్షించిన ఫలితంగా 2003 జనవరి 1న 'ప్రజాపక్ష సమీక్ష' పేరుతో పక్షపత్రికగా ఈ పత్రిక ప్రారంభమయింది. రిజిస్ట్రేషన్ కారణాల వల్ల 2003 సెప్టెంబర్‌లో పత్రికపేరును 'వీక్షణం' గా మార్చవలసి వచ్చింది. మొత్తం మీద పక్షపత్రికగా 42 సంచికలు వెలువరించిన తర్వాత, ఇటువంటి పత్రికను పక్షపత్రికగా కన్న మాసపత్రికగా నడపడం ఉచితమని భావించాము. జనవరి 2005 నుంచి మాసపత్రికగా నడుపుతున్నాము.

ప్రజాపక్ష సమీక్ష, వీక్షణం రెండు పేర్లతో పత్రిక రావడం వల్ల సంపుటి, సంచిక సంఖ్య క్రమబద్ధంగా లేకుండా పోయింది. అందువల్ల ఇక నుండి క్రమబద్ధంగా ఉండడం కొరకు ప్రతి సంచికకూ వరుస సంఖ్య ఇస్తున్నాము. (సోషల్ సైంటిస్ట్, సెమినార్, న్యూ లెఫ్ట్ రివ్యూ పత్రికలలాగ). ఇకనుంచి ఈ పద్ధతే కొనసాగుతుంది. గతంలో కొన్ని సంచికలు ఆలస్యంగా రావడం వల్ల పత్రిక మార్కెట్‌లోకి నెల ఆలస్యంగా వస్తోంది. ఈ ఆలస్యాన్ని సరి చేయడం కొరకు ఈ సంచికను ఎక్కువ పేజీలతో మే-జూన్ ప్రత్యేక సంచికగా తెస్తున్నాము.

'వీక్షణం' శ్రేయోభిలాషులు, మిత్రులు పత్రిక అభివృద్ధి కోసం చాల సూచనలు చేస్తున్నారు. ఇది తెలుగు 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' లా ఉండాలనే సూచనల నుంచి గ్రామీణ, స్థానిక పరిణామాల నివేదికగా, విశ్లేషణగా ఉండాలనే సూచనల వరకు చాల సూచనలు మాకందుతున్నాయి. ఇది కేవలం పై నుంచి చెప్పే పత్రిక గానో, కింది నుంచి వినే పత్రికగానో మాత్రమే ఉండాలని మేం అనుకోవడం లేదు. ఈ రెండు వాహికల మేలు కలయికగా, తెలుగు సమాజం తన గురించీ, తన ఇరుగు పొరుగు పరిణామాల గురించీ చేసుకునే అన్వేషణకు అద్దం పట్టేదిగా ఉండాలని మా కోరిక. 'వీక్షణం' ను అలా తీర్చిదిద్దే బాధ్యత మీదే. 'వీక్షణం' మీ పత్రిక.

లోపలి పేజీల్లో...

వీక్షణం

ఆర్థిక, సామాజిక పత్రిక

సమతా పబ్లికేషన్స్
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 025.
ఫోన్ : 040 - 55843495

ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

ఉత్తరాలు:

ఏప్రిల్ 1-30 సంచికలో పునరుక్తిగా మీరు ప్రచురించిన "ధనస్వామ్య సంస్కృతి" ప్రేమ్‌చంద్ గారి వ్యాసం చాలా బాగుంది. ప్రేమ్‌చంద్ ఈ వ్యాసాన్ని సెప్టెంబర్ 1936లో రాసినప్పటికీ విషయం సమకాలీనత ఇప్పటికీ చెక్కు చెదరలేదు. అధిక సంఖ్యాకులైన ప్రజలు "యజమానుల కోసం చెమటోడ్చేందుకూ, రక్తం చిందించేందుకూ ఆ తర్వాత ఏదో ఒక రోజున ఈ లోకాన్ని విడిచి వెళ్ళేందుకూ అన్న మాటలు" ఎంతటి అక్షర సత్యాలో మారని ప్రజా జీవితం నుంచి మనం గ్రహించ వచ్చు. వ్యాసం స్వాతంత్ర్యానికి ముందు కాలం నాటిదైనా స్వాతంత్ర్యం తరువాత కూడా మారని పరిస్థితికి అద్దం పడుతోంది.

అదే వ్యాసంలో ప్రేమ్‌చంద్ చాలా చక్కగా ధనస్వామ్య సంస్కృతి గురించి చేసిన సూత్రీకరణ "ఇప్పుడు కాలం అంటే ధనం. ఒకప్పుడు కాలం అంటే జీవితం" అన్న మాటలు ధనార్జనలో పడిపోయి విలువలను వదిలేసిన నేటి మనిషినీ మనకు పట్టి చూపుతాయి. వ్యాసం ముగింపులో "అంతిమ విజయం మాత్రం నూతన వ్యవస్థదే" అన్న మాటలు భవిష్యత్తుపై అతని కున్న గతి తార్కిక దృక్పథాన్ని తెలియజేస్తాయి. ఇలాంటి ఆలోచింపచేసే, మానవ విలువలను పెంపొందించే మరిన్ని వ్యాసాలు 'వీక్షణం' లో పునరుక్తిగా ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

'నక్సలైటు ఉద్యమం - మరికొన్ని ఆలోచనలు జన్ను చిన్నాలు వ్యాసం మంచి చర్చను ముందుకు తెచ్చింది. భూ కమతాల గణాంకాలు వ్యాసం చాలా ఇన్ఫర్మేటివ్‌గా ఉంది. "నల్లపిల్లిని ఉతికి ఆరేసినా తెల్లపిల్లి కాబోదు"-లాంటి వ్యక్తీకరణ అభ్యంతర కరంగా ఉంది బహుశా కుక్కతోక వంకర లాంటివి బాగుంటా యేమో. పక్కనే ఉన్న నేపాల్ పరిస్థితిని తెలియజేసే వ్యాసం ఆసక్తికరంగా ఉంది.

ఉమాశంకర్,
హైదరాబాద్

వీక్షణం రెగ్యులర్‌గా చదువుతున్నాను. సమాజంలో అక్కడక్కడా జరుగుతున్న మంచి పనుల గురించీ, విజయాలను గురించి కూడా వ్రాయండి. ప్రస్తుతం కొంచెం నెగెటివ్ టోన్ ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఇంకొంచెం బాలెన్స్ చేస్తే బావుంటుంది. ఇస్తున్న వ్యాసాలు మాత్రం సమగ్రంగా ఉన్నాయి. ఇదే ఒరవడి కంటిన్యూ చేయండి.

- కాంచన
వరంగల్

నేలవైపు చూస్తున్న సంక్షేమ పథకాల కేటాయింపులు

- వి. హనుమంతరావు

ఏ బడ్జెట్‌నైనా రెండు విధాలుగా విశ్లేషించుకోవచ్చు. విశ్లేషించే వారు ఆర్థిక శాస్త్రవేత్తలు, బడ్జెట్ విశ్లేషకులు అయితే మిగులు, లోటు, ఆదాయం, వ్యయం, కేటాయింపులు, ఖర్చు, శాతం పెరుగుదల, తరుగుదల-ఇలా సాగుతుంది వారి పరిశీలన. విశ్లేషణ చేసేవారు సామాన్యులయితే ఈ బడ్జెట్ నాకేమి ఇస్తుంది, కొత్త పన్నులు విధించారా, ధరలు పెరుగుతాయా, నా ఉద్యోగం వూడుతుందా, నాకు జాబ్ దొరుకుతుందా, అనే ధోరణిలో వారి పరిశీలన సాగుతుంది.

ఈ రెండూ రెండు పెడ ధోరణులేమోనని పిస్తుంది. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే మహాకవి గురజాడ పద్యం గుర్తుకు వస్తోంది. సామాన్యుల చేతిలో కొనుగోలు శక్తి వుంటేనే, వారు బావుంటేనే దేశం బావుంటుంది. అలాగే రాష్ట్రం ఇనప్పెట్టెలో నిధులుంటేనే సామాన్యునికి పని దొరుకుతుంది; చేతిలో నాలుగు డబ్బులాడుతాయి. ఈ రెండూ పరస్పరాధారాలు. దీనినే బడ్జెట్‌కు అన్వయించుకొంటే తలసరి ఆదాయం పెరుగుతూంటే ఎకానమీ బాగున్నట్లు విశ్లేషిస్తాడు ఆర్థిక నిపుణుడు. కాని పూరిగుడిసెలో వారి ఆదాయాలను, బంగళాల్లో నివసించే వారి ఆదాయాలను కలిపి ఆర్థిక శాస్త్రవేత్తలు లెక్క వేస్తారు కాని సామాన్యుడనైన నాకు తలసరి ఆదాయం పెరిగితే నా కొరిగేదేమిటని ప్రశ్నిస్తాడు. ఆ ప్రశ్నకు అతనికి సంతృప్తినిచ్చే జవాబు చెప్పగలమా?

ఉదాహరణకు రాష్ట్రంలో రెవెన్యూ పద్దుకింద గత ప్రభుత్వ హయాంలో ఇరవై ఏడువేల కోట్లు ఖర్చు చేస్తే మా ప్రభుత్వం వచ్చే ఏడాది ముప్పది ఏడు వేలకోట్లు ఖర్చు చేయబోతుంది అని ఆర్థికమంత్రి చెబితే, ఆర్థిక విశ్లేషకుడు ఇది 25 శాతం అధికంగా ఖర్చు చేయబోతుందని అంటే అది సామాన్యుడికి గ్రీక్ అండ్ లాటిన్. ఆ అంకెలకు అతని జీవితానికి ఎటువంటి పొంతనా లేదు. తాగడానికి నీళ్లిస్తుందా అని చూసుకొంటాడు. ఈ విషయంలో అతనికి జవాబు చెప్పాలని బడ్జెట్‌లో గణాంకాలు చూస్తే మొత్తం రెవెన్యూ ఖర్చులో ప్రతీ నూరు రూపాయల్లో మంచినీరు, పారిశుభ్రతకు గత ప్రభుత్వం 03-04లో రు.2.19లు ఖర్చు చేస్తే, ఈ ప్రభుత్వం వచ్చే సంవత్సరంలో కూడా అంతే ఖర్చు చేయబోతోంది. అలాగే సామాన్యుడి ఇంట్లో ఎవరికైనా రోగం, రొస్టు వస్తే, ఇంటి యజమాని జేబుకు పెద్ద చిల్లే పడుతుంది. అందుచేత ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయింపులు ఎలా చేసిందో చూడబోతే, గత ప్రభుత్వం మొత్తం రెవెన్యూ ఖర్చులో 4.94 శాతం ఖర్చు చేస్తే, ఈ ప్రభుత్వం వచ్చే ఏడాదిలో 4.75 శాతం మాత్రమే ఖర్చు చేయబోతుంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల ఖర్చు అదే కాలంలో 4.64 శాతం నుండి 4.20 శాతానికి తగ్గింది. విద్య పద్దుకింద మాత్రం 14.72 శాతం నుంచి 15 శాతానికి పెరిగింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

రాష్ట్రంలో 70 శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తుంటారు. వారిలో అత్యధికులు సామాన్య ప్రజలు, పేదలు, నిరుపేదలు, రెక్కాడితేనేగాని డొక్కాడనివారు. ప్రణాళికలో ఈ పద్దుకు చేసిన కేటాయింపుకు కూడా కోత పెట్టడం అన్యాయం. సంపూర్ణ రోజ్‌గార్ యోజన, గ్రామాల్లో పాఠశాల భవనాలు, సర్వే విభాగం, గ్రామీణ యువత, డ్వాక్రాలాంటి అనేక పథకాలకు చేసే కేటాయింపులు ఈ పద్దుకిందకు వస్తాయి. మొత్తం ప్రణాళికలో ఈ పద్దుకు 04-05 లో సవరించిన అంచనా ప్రకారం రు. 800 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయగా, వచ్చే ఏడాది రు. 773 కోట్లకు తగ్గించారు. మరో రకంగా చెప్పాలంటే 6.24 శాతం నుంచి 4.94 శాతానికి తగ్గించారు. ఈ ఏడాది రు. 800 కోట్లు ఖర్చు పెట్టాలనుకొన్నా, ఇందులో రాష్ట్రం పెట్టే ఖర్చు నూరుకోట్లు మాత్రమే. మిగతా దానిలో రు. 427 కోట్లు విదేశీ సహాయం వుంది.

మన గ్రామాలను అభివృద్ధి చేయడానికి కూడా విదేశీ సహాయం కావాల్సి రావటం అత్యంత దురదృష్టకరమైన విషయం. మరో రు. 152 కోట్లు కేంద్ర పథకాలకు ఢిల్లీ నుంచి వస్తుంది; ఈ పద్దుకింద కూడా కోత విధించాలా అని పత్రికా విలేకరుల డిగితే, ఏవో కొన్ని పథకాలు పూర్తి అయిపోయాయి కాబట్టి, ఆ మేరకు కోత పడిందని జవాబు. ఏ పద్దుకింద ఈ కోతలు విధించారో అని చూస్తే గ్రామాల్లో పాఠశాల భవనాల నిర్మాణానికి ఈ ఏడాది రెండున్నర కోట్లు వచ్చే

సంవత్సరం కేటాయింపును పూర్తిగా కత్తిరించారు. అలాగే వాటర్‌షెడ్ పథకాలకు రు. 97 కోట్లనుంచి రు. 76 కోట్లకు, పేదలకిచ్చే వడ్డీ సబ్సిడీని పదికోట్ల నుంచి ఎనిమిది కోట్లకు తగ్గించారు. 28 వేల గ్రామాల అభివృద్ధికి ఎనిమిది వందల కోట్లు మాత్రమే కేటాయించడమేమిటి? మళ్లీ అందులో కోత విధించడమేమిటి?

మానవాభివృద్ధి నివేదిక

ప్రజలు ఎంతవరకు అభివృద్ధి చెందారు అనే దానికి విద్య, వైద్యం, ఆరోగ్యం, వారు ఎంతకాలం జీవిస్తున్నారు, జనాభా పెరుగుదల లాంటి విషయాలన్నిటినీ గమనంలో వుంచుకొని ఒక మానవాభివృద్ధి సూచిక తయారు చేస్తారు. దేశంలో వివిధ రాష్ట్రాలు ఏ స్థాయిలో వున్నాయి అనేది ఈ సూచిక నుండి తెలుసుకోవచ్చు.

ప్రణాళికా సంఘం మొదటిసారిగా 2002లో ఇలాంటి సూచికను తయారు చేయగా వివిధ రాష్ట్రాల్లో మన రాష్ట్రం స్థానం 1991లో తొమ్మిదవ స్థానం నుండి 2001లో పదవస్థానానికి పడిపోయింది. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చిచూస్తే కేరళ మొదటిస్థానం, తమిళనాడు మూడవస్థానం, కర్నాటక ఏడవస్థానంలో వున్నాయి.

ఈ సూచికలో ముఖ్యమైన మూడు కొలబద్దలున్నాయి: అవి -అక్షరాస్యత, మనిషి జీవితకాలం పెరుగుదల, చిన్న పిల్లల మరణాలు. 2001 నాటికి మన అక్షరాస్యత (2001 జనాభా లెక్కలు) 61.11 శాతం. అయితే కేరళ 90.92 శాతం, తమిళనాడు 69.68 శాతం, కర్నాటక, 67.04 శాతంతో మనకన్నా మెరుగైన స్థానాల్లో వున్నాయి. అఖిలభారతస్థాయి 65.38 శాతం కన్నా మనం తక్కువ స్థానంలో వున్నాం. మానవుని సగటు జీవితకాలం రాష్ట్రంలో 62.4 సంవత్సరాలయితే, కేరళలో 73.3, తమిళనాడు 64.1, కర్నాటకలో 62.4 సంవత్సరాలు. పుట్టిన పిల్లల్లో వెంటనే లేదా నెలల్లోనే చనిపోయేవారి సంఖ్య ప్రతీ వెయ్యి జననాలకు కేరళలో 14 మంది మాత్రమే మరణిస్తే, తమిళనాడులో 52, కర్నాటకలో 58, ఆంధ్రప్రదేశ్‌లో 66 మంది చనిపోతున్నారు.

1999లో దేశ వ్యాపితంగా ప్రజల ఆరోగ్యం ఎలావుంది అని గణాంకాలు సేకరించగా, రాష్ట్రంలో సగంమంది స్త్రీలు, 70 శాతం పిల్లలు రక్తహీనతతో అనారోగ్యంగా వున్నారని తేలింది. దక్షిణాది రాష్ట్రాల్లో స్త్రీల విషయంలో మూడవస్థానంలో, పిల్లల విషయంలో ఆఖరు స్థానంలో వున్నాం. గత ఏడాది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటికి దానికి అందిన వారసత్వం ఇది.

సంక్షేమం, గ్రామీణాభివృద్ధి

ఈ పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు స్థూల రాష్ట్ర ఆదాయంలో భాగంగా చూస్తే ప్రతి నూరు రూపాయల్లో 7.21 శాతం మాత్రమే ఖర్చు అయింది. 1980-91 నుండి ఈ ఖర్చుల గణాంకాలు పరిశీలిస్తే, సంస్కరణలు ప్రవేశపెట్టకముందు దశాబ్దంలో కన్నా తర్వాత దశాబ్దంలో తక్కువ శాతం ఖర్చు అయిందని వెల్లడైంది. అయితే ఈ పద్దుల కింద తలసరి ఖర్చు బాగా పెరిగిన మాట వాస్తవం.

	80-81	90-91	04-05 (బ.అం)
విద్య, కళలు, సంస్కృతి	16.38	17.02	13.65
ఇందులో ప్రాథమిక విద్య	7.20	7.05	4.81 (02-03)
వైద్యం, ఆరోగ్యం	5.49	4.50	3.89
ఇందులో ప్రాథమిక ఆరోగ్యం	0.00	0.58	0.00
కుటుంబ సంక్షేమం, పట్టణాభివృద్ధి	0.88	1.03	0.98
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	6.39	5.53	4.09
మంచినీరు, పారిశుభ్రత	2.33	1.75	0.52
ఇతర సేవలు	12.15	10.63	8.37
సామాజిక సేవలు	38.17	36.17	30.87
గ్రామీణాభివృద్ధి	6.42	7.94	4.33
మొత్తం సామాజిక రంగం	44.59	44.11	35.20

	1995-96	2001-02 (స.అం)
విద్య, సంస్కృతి, కళలు		
ఆంధ్రప్రదేశ్	4	4
కర్నాటక	2	2
కేరళ	1	1
తమిళనాడు	3	3
వైద్యం, ఆరోగ్యం		
ఆంధ్రప్రదేశ్	4	2
కర్నాటక	3	1
కేరళ	1	3
తమిళనాడు	2	4
నీరు, పారిశుభ్రత		
ఆంధ్రప్రదేశ్	3	2
కర్నాటక	1	3
కేరళ	4	4
తమిళనాడు	3	1
గ్రామీణాభివృద్ధి		
ఆంధ్రప్రదేశ్	1	1
కర్నాటక	2	3
కేరళ	3	2
తమిళనాడు	4	4

ఇక్కడ కొంచెం వివరాల్లోకి పోయి చూస్తే, ప్రభుత్వం మొత్తం ఖర్చులో సామాజిక సంక్షేమ పథకాల ఖర్చు 1980-81లో 38.17 శాతం నుంచి 89-90లో 38.48 శాతానికి చేరుకోగా 04-05 (బ.అం) ప్రకారం 30.87 శాతానికి దిగజారిపోయింది. అవే సంవత్సరాల్లో గ్రామీణాభివృద్ధి ఖర్చు 6.42 శాతం నుంచి 7.94 శాతానికి (90-91) పెరిగి అక్కడనుంచి కేవలం 4.33 శాతానికి పడిపోయింది. ఈ రెండు రంగాల ఖర్చు శాతం మొత్తం ఖర్చులో 44.59 శాతం నుంచి 44.11కు, అక్కడనుంచి 35.20 శాతానికి నేలచూపు చూచింది.

సామాజిక సేవల ఖర్చు శాతం మొత్తం ఖర్చులో (రెవెన్యూ+ పెట్టుబడి) ఎలా పడిపోతూ వచ్చిందో పట్టిక తెలియజేస్తుంది

ఈ పద్దుల కింద ఖర్చులు స్థూల రాష్ట్రాదాయంలో భాగంగా ఎంత అని చూడబోతే పై తిరోగమన ధోరణులే కనిపించాయి. సామాజిక, సంక్షేమ రంగాల్లో విద్యకే పెద్దపీట వేయటం జరుగుతుంది. 89-90లో విద్యారంగానికి సామాజిక సేవల రంగం ఖర్చులో 45 శాతం అయితే, అది 98-99లో 33 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత సంవత్సరాల్లో పెరుగుదల కనిపించినా 89-90 స్థాయికి చేరుకోలేకపోయింది.

కోట్లాదిమంది ప్రజల బతుకులను ప్రభావితం చేసే వైద్యరంగానికి సంస్కరణల ముందు, తర్వాత కూడా 13 శాతానికి మించలేదు. గ్రామీణాభివృద్ధి కేటాయింపు 90వ దశకం ఉత్తరార్థంలో తగ్గి, తర్వాత సంవత్సరంలో ఒడిదుడుకులకు లోనైంది.

పైన పేర్కొన్న గణాంకాలన్నీ బడ్జెట్ కేటాయింపుల గురించినవి. బడ్జెట్ కేటాయింపులంటే అందులో రెవెన్యూ, పెట్టుబడి పద్దులకింద ఖర్చు, ప్రణాళిక ఖర్చు అన్నీ కలిసి వుంటాయి. కేవలం ప్రణాళిక ఖర్చే ప్రధానంగా అభివృద్ధికి పెట్టిన ఖర్చును ప్రతిబింబిస్తుంది. 1986-87 వరకూ సామాజికరంగంపై ఖర్చు స్థూల రాష్ట్రాదాయంగా పెరుగుతూ వచ్చి, అప్పటినుంచి తరుగుతూనే వచ్చింది. మొత్తం ప్రణాళిక ఖర్చులో సామాజిక సేవలపై ఖర్చు 80-81లో 27.68 శాతం నుంచి 90-91లో 36.22కు, 96-97లో 60.14 శాతం వరకు పెరిగి ఆ తర్వాత 04-05 (బ.అం)లో 35.82కు దిగజారింది.

అలాగే గ్రామీణాభివృద్ధికి ఖర్చు అదే కాలంలో 20.48 శాతానికి, ఆ తర్వాత 18.27 శాతానికి తగ్గి, చివరకు 9.03 శాతానికి పడిపోయింది. సామాజిక సేవల రంగంపై ఖర్చు దక్షిణాది రాష్ట్రాల్లో ఎలా వుందోనని పరిశీలన జరిగింది. 2001-02 (సం.అం) ప్రకారం స్థూల రాష్ట్రాదాయంలో సామాజిక రంగంలపై ఖర్చు విషయంలో దక్షిణాది రాష్ట్రాల్లోనే మన రాష్ట్రం ఏ స్థానంలో వుందో పక్కన పట్టిక తెలియ చేస్తుంది.

ఇంటిపేరు కస్తూరి వారు, ఇంటి నిండ గబ్బిలంబుల పెంట కంపు అన్నట్లు ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, చంద్రబాబు పేరు దేశ వ్యాపితంగా, ముఖ్యంగా సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల అధిపతుల నోట్లో నానుతుంది. కాని రాష్ట్రంలోకి ఊరికే అలా తొంగి చూస్తే ఏం కనపడుతుందో పైన ఒకే ఒక రంగాన్ని పరిశీలిస్తే పరిపాలన ఎంత హీనంగా వుందో, కాంగ్రెస్ పార్టీకి అందించిన వారసత్వం ఎలాంటిదో, ఈ ఊబినుంచి బయటపడడానికి ఎన్నేళ్ళు పడుతుందో ఊహించుకోవచ్చు. ❑

సామాజిక సేవలకు కేటాయింపులు ఘనం కాని అభివృద్ధిలో తిరోగమనం!

- జె. శివరాం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు సజావుగా మనుగడ సాధించాలంటే ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అభ్యున్నతి కోసం విశేష కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. రాష్ట్రంలో కాంగ్రెసుపార్టీ గత సంవత్సరం శాసన సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయం సాధించి, డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వంలో అధికార పగ్గాలు చేపట్టటం జరిగింది.

రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దటం జరుగుతుందని, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను రానున్న సంవత్సరాలలో రు.46 వేల కోట్ల నిధులతో సత్వరం పూర్తిచేయటం జరుగుతుందని, ప్రజల అభివృద్ధి కోసం 'రాజీవ్ నగరబాట', 'రాజీవ్ పల్లెబాట,' 'ప్రజాపథం' లాంటి పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి విస్తృతంగా రాష్ట్రంలో పర్యటనలు జరపటం, అనేక వాగ్దానాలు ప్రజలకు చేయటం పరిపాటయింది. పదవిలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా ఉత్సవాలు చేయటం జరుగుతోంది. మరి ఈ బడ్జెట్‌లో సామాజిక సేవలకు కేటాయింపులు ఏమాత్రం చేసింది, ఈ కేటాయింపులవల్ల అభివృద్ధి ఏమాత్రం జరిగింది అధికారగణాంకాల ప్రకారమే విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

సామాజిక సేవలు ప్రధానంగా ఆరు విభాగాలు. అవి విద్య, ఆరోగ్యం - కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, పారిశుధ్యం, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, షెడ్యూల్డ్ కులాల, తెగల, ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమం, కార్మిక సంక్షేమం, సాంఘిక సంక్షేమం-పోషకాహారం.

విద్య

ఏ జాతి స్థితిగతులైనా తీర్చిదిద్దగల సాధనం విద్య. అక్షర క్రమంలో దేశంలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో మొత్తం మీద 28 వస్థానంలో వుంది. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద అక్షరాస్యత 64.84 వుండగా మన రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 60.47. గతంలో రాష్ట్రంలో అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు అక్షర జ్యోతి, అక్షర సంక్రాంతి, మళ్ళీ బడికి, చదువుల పండుగ లాంటి పథకాలు చేపట్టినా ప్రయోజనం అంతంత మాత్రంగానే వుంది. రాష్ట్రం ఇటీవల విడుదల చేసిన 2004-05 ఆర్థిక సర్వేప్రకారం I-X క్లాసుల మధ్య చదువు వదిలేసినవారు మొత్తం మీద 66.70 శాతం (బాలురలో 65.28 శాతం, బాలికలు 68.53 శాతం). అంటే రాష్ట్రంలో విద్య ఎంత దయనీయపరిస్థితిలో వుందో అవగత మవుతుంది. మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో విద్య మీద చేసిన వ్యయం చంద్రబాబు హయాంలో 2003-04 సంవత్సరంలో 15.6 శాతం వాటావుండగా వై.ఎస్. హయాంలోకూడా అంతే వాటా వుంది.

2005-06 సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం గమనించదగ్గ దేమంటే మొత్తం సామాజికసేవల కింద చేసిన వ్యయంలో విద్య మీద చేసిన వ్యయం 2003-04 సం.లో 45.4శాతం వుండగా 2005-06 సంవత్సరంలో కేటాయింపు 45 శాతానికి పడి పోనున్నట్లు బడ్జెట్ అంచనా. కొఠారీ కమీషన్ నివేదిక ప్రకారం స్థూల రాష్ట్రాదాయంలో విద్యమీద చేయవలసిన వ్యయం 6 శాతం వుండాలని నిర్దేశించినా మన రాష్ట్రంలో విద్యమీద చేసే వ్యయం స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో 2.7 శాతంగా వుంది. అనగా విద్యారంగంలో వెనుకబడే వున్నట్లు కానవస్తోంది.

వైద్యం

ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య సదుపాయాల కల్పన ఎంతైనా అవశ్యకం. సామాజిక సేవలకు సంబంధించిన వైద్య- ఆరోగ్య సర్వీసులకు రాష్ట్ర బడ్జెట్‌లో ఇతోధికంగా కేటాయింపులు జరుగుతున్నా ప్రజల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడుతున్నట్లుగా కానరావటం లేదు. రాష్ట్రంలో జననాల రేటు రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం ప్రతి వెయ్యి జనాభాకు 20.7, మరణాల రేటు 8.1, శిశు మరణాల రేటు 62గా వుంది. మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో ఆరోగ్యం - కుటుంబ సంక్షేమం రంగం మీద చేసిన వ్యయం 2003-04 సంవత్సరంలో 4.9 శాతంగా వుండగా, 2005-06 సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం 4.7 శాతానికి పడిపోతున్నట్లు అంచనా. సామాజిక సేవల కింద చేసిన వ్యయంలో ఆరోగ్యం కుటుంబ సంక్షేమం కింద చేసిన వ్యయం 2003-04లో 14.3 శాతం వుండగా, 2005-06 సంవత్సరపు సంవత్సరం బడ్జెట్

అంచనాల ప్రకారం 13.7 శాతం వాటాకు పడిపోతున్నట్లు అంచనా. కాగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కింద చేసిన తలసరి వ్యయం 2003-04 సం॥లో రు.188 వుండగా 2005-06 సం.లో రు.221కి పెరగబోతోంది. ఎయిడ్స్ రోగులు దేశంలో మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి.

నీటి సరఫరా, పారిశుధ్యం :

సంక్షేమ పథకాలలో నీటి సరఫరా, పారిశుధ్యం, గృహ, పట్టణాభివృద్ధి రంగాలు ప్రాధాన్యత సంతరించుకొన్నాయి. తాగునీరు లేక ప్రజలు ఇటీవల కాలంలో ఇబ్బందులు పడుతున్నట్లు, గ్రామాల నుంచి ప్రజలు వలసపోతున్నట్లు పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశలో సత్వరం చలించి తాగునీటి సమస్యకు పరిష్కారం చేస్తున్నట్లు కానవస్తోంది. 2003-04సం.లో నీటి సరఫరా, పారిశుధ్యం రంగం మీద చేసిన వ్యయం మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో 0.8 శాతం వుండగా 2005-06 సం.లో బడ్జెట్ అంచనా ప్రకారం 2.1 శాతానికి పెరుగుతుందని అంచనా. గృహ రంగం మీద చేసిన రెవెన్యూ వ్యయం 2003-04 సం.లో మొత్తం రెవెన్యూ వ్యయంలో దాదాపు 1 శాతం వుండగా 2005-06 సం. బడ్జెట్ అంచనాల ప్రకారం కూడ 1 శాతం వుంటుందని అంచనా. 2004-05 సం.లో బలహీన వర్గాలకు 6.30 లక్షల గృహాలు నిర్మించాలని సంకల్పించగా అవి 30 మే 2005 నాటికి పూర్తి అవుతాయని గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు డి.శ్రీనివాస్ చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమం సఫలం అవుతుందో లేదో కాలమే నిర్ణయిస్తుంది. దీన్ని బట్టే ప్రభుత్వ వాగ్దానాలు ఏ మాత్రం సఫలీకృతమవుతాయో తేటతెల్లమవుతుంది.

బడుగు వర్గాల అభ్యున్నతి :

సామాన్య ప్రజానీకం అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అట్టడుగువర్గాల అభ్యున్నతికోసం పథకాలు రూపొందించటం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలకు పరిపాటయింది. షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనుకబడ్డ తరగతుల వారి సంక్షేమం కోసం 2003-04 సం.లో చేసిన వ్యయం మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో 4.6 శాతం వుండగా 2005-06 సం. బడ్జెట్ అంచనాల ప్రకారం 4.2 శాతానికి పడిపోతుందని అంచనా. దీన్నిబట్టి బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వ చిత్తశుద్ధి ఏ పాటిదో తేటతెల్లమవుతోంది.

కార్మిక సంక్షేమం :

పారిశ్రామికంగా రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలంటే కార్మిక సంక్షేమం ఎంతైనా ఆవశ్యకం. సమ్మెలు, లాకౌట్లవల్ల పనిదినాలు నష్టపోవటమే కాకుండా పరిశ్రమలలో ఉత్పత్తి కుంటుబడుతుంది. దీనివల్ల రాష్ట్రానికి పారిశ్రామిక రంగం నుంచి లభించే ఆదాయం తగ్గుతుంది. ప్రభుత్వాలు కార్మిక ఉద్యమాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కార్మిక సంక్షేమంకోసం సత్వర చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారమే సమ్మెలు - లాకౌట్లలో నష్టపోయిన పని దినాలు 2003 సంవత్సరంలో 6.13 లక్షలు వుండగా 2004 సం.లో 7.67 లక్షలకు పెరిగాయి. అనగా పారిశ్రామిక రంగా

సామాజిక సేవల కింద రెవెన్యూ వ్యయం

(రు.కోట్లు)

రంగం	2003-04	2004-05 (స.అం)	2005-06 (బ.అం)
విద్య, క్రీడలు, కళలు	4665.77	5384.45	5858.69
ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం	1476.08	1625.72	1775.68
నీటిసరఫరా, పారిశుధ్యం, గృహ పట్టణాభివృద్ధి	1098.82	1364.65	2002.55
షె.కులాలు, తెగలు, ఇతర వెనుకబడ్డ తరగతుల సంక్షేమం	1383.52	1424.91	1570.50
కార్మిక సంక్షేమం	114.11	110.47	84.41
సాంఘిక సంక్షేమశాఖ, పోషకాహారం	1380.48	1417.70	1618.99
ఇతరాలు	148.50	59.60	63.22
మొత్తం సామాజిక సేవలు	10267.20	11437.50	12974.04
మొత్తం రెవెన్యూ వ్యయం	29830.14	33455.47	37377.91

ఆధారం: బడ్జెట్ సంగ్రహం 2005-06 సంపుటి VI

లలో అశాంతి వున్నట్లు గోచరిస్తోంది. అధికార గణాంకాల ప్రకారం మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో కార్మిక సంక్షేమం కోసం చేసిన వ్యయం వాటా 2003-04సం.లో 0.3 శాతం వుండగా 2005-06 సం.బడ్జెట్ అంచనాల ప్రకారం 0.2 శాతానికి తగ్గుతుందని అంచనా.

పోషకాహారం :

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ప్రధానంగా సాంఘిక సంక్షేమం, పోషకాహారం రంగానికి ప్రాముఖ్యత ఇవ్వాల్సి వుంటుంది. ఆహారం మన నిత్యజీవితంలో ఒక ముఖ్యాంశం. ఆరోగ్యం పోషకాహారంతో ముడి పడిందని మనలో చాలామందికి తెలియకపోవటానికి కారణాలు అనేకం. వాటిలో ముఖ్యమైనవి మూడు. అవి 1) ఆర్థిక పరిస్థితి, 2) ఆహారపు అలవాట్లు, మూఢ నమ్మకాలు, 3) పోషక పదార్థ పరిజ్ఞానం లేకపోవటం. వీటి ఫలితం గా నేడు మన దేశ జనాభాలో సుమారు 70శాతం ఏదో ఒక పోషక పదార్థలోపానికి గురియైనవారే. సాంఘిక సంక్షేమం- పోషకాహార పద్దుకింద చేసిన రెవెన్యూ వ్యయం మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయం లో 2003-04 సంవత్సరంలో 4.6శాతం వుండగా 2005-06 సం.లో బడ్జెట్ అంచనాల ప్రకారం 4.3 శాతానికి తగ్గ బోతున్నట్లు అంచనా.

కేంద్రప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో జీవన పరిస్థితులు చూస్తే శాశ్వత గృహ వసతిగల కుటుంబాలలో మన రాష్ట్రం దేశం మొత్తంమీద 18వ స్థానంలో, ఆచరణలో తాగునీటి సదుపాయాలున్న కుటుంబాలలో 24వస్థానంలో, ఎల్.పి.జి. కనెక్షన్లు వున్న కుటుంబాలలో 19వ స్థానంలో, సొంతంగా టెలివిజన్‌వున్న కుటుంబాలలో 18వస్థానంలో, సొంతంగా టెలిఫోన్ వున్న కుటుంబాలలో 20వ స్థానంలో వున్నదంటే మన రాష్ట్రం ఏమాత్రం ప్రగతి సాధించిందీ అవగతమవుతుంది.

పై విశ్లేషణ ప్రకారం మన రాష్ట్రంలో కాంగ్రెసుపార్టీ అధికార పగ్గాలు చేపట్టిన సంవత్సరకాలంలో సామాజిక సేవలకు చేసే వ్యయ గణాంకాలు అధికంగా వున్నా నిశితంగా పరిశీలిస్తే మసిపూసి మారేడుకాయ చందంగా వుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం గణాంక విన్యాసాలకు తావివ్వకుండా నిష్కల్మషంగా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ❑

వీక్షణం చందాదారులుగా చేరండి!
వీక్షణం ను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం' ను రెండు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాల అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం' కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించుకోవడంతో పాటు, కనీస మరొక ముగ్గురు మిత్రులకు 'వీక్షణం' ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం' చందాదారులుగా చేరండి!
మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్చండి!
ఇది వీక్షణం కు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను
తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

వీక్షణం విడిప్రతి రు. 12, సంవత్సర చందా రు. 150, దశాబ్ది చందా రు. 1,000
చందాలు కింది చిరునామాకు ఎం.ఓ./డి.డి. ద్వారా పంపవచ్చు.

వీక్షణం, సిడిఆర్‌సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

రాష్ట్రంలో జలయజ్ఞం

- బత్తుల పున్నయ్య
(రిటైర్డ్ సివిల్ ఇంజనీర్, నీటిపారుదల శాఖ)

1850 దశకంలో గోదావరి నది కిరువైపుల ఉభయగోదావరి జిల్లాల దుర్భిక్షానికి ఎండిన పైరులు, పండిన పైరులు వరదపాలు - సజీవ దృశ్యాలు. వట్టిపోయిన పొలాలమధ్య గలగలా గోదావరి కదిలి కడలి కడుపులో కలుస్తూ తీరప్రజలకు కడుపుకోతను మిగిల్చిన రోజులవి. 1854లో ప్రపంచంలోనే అతిభయంకరమైన 'డొక్కల కరువు'కు ఉభయగోదావరి ప్రజలు ప్రతి నలుగురికి ఒకరు బలైనారు.

ఆ సమయంలో హెన్రీ మౌంట్ మద్రాస్ గవర్నరుగా ఉన్నాడు. 1836లో కావేరీ నదిపై కోలనూర్ ఆనకట్ట అద్భుత సృష్టికర్త, అతనికి 1846 నుండి విశాఖపట్నంలో పనిచేస్తున్న ఆర్థర్ కాటన్ గుర్తు కొచ్చాడు. వెంటనే గోదావరి ప్రజలను కరువు నుండి కాపాడే గోదావరి ఆనకట్ట నిర్మాణ బాధ్యతను అప్పగించాడు. అయితే కాటన్ భారతీయుడు కాదు. ప్రపంచ దేశాలను దోచుకొనే ఆనాటి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపౌరుడు. సివిల్ యింజనీరింగ్ అభివృద్ధి చెందని నాటి రోజుల్లో ఆయన అద్భుత తెలివితేటలతో బ్రిటిష్ రాయల్ యింజనీర్స్ కమిషన్ సభ్యత్వం పొందాడు.

తన కప్పగించిన ఆనకట్ట నిర్మాణాన్ని దైవకార్యంగా భావించి ఆర్థిక అంశాలలోను, సాంకేతికంగాను ఎన్ని అవరోధాలు కలిగినా అన్నింటిని తట్టుకొని అకుంఠిత దీక్షతో ఆనకట్ట నిర్మాణానికి పూనుకున్నాడు కాటన్.

రాజమండ్రి సమీపంలో గోదావరి, ధవళేశ్వరం, ర్యాలీ, మదూర్, విజ్జేశ్వరం అనే నాలుగు పాయలుగా చీలి మరల దిగువన గౌతమి వశిష్ఠలు రెండు పాయలుగా కలిసినచోట, ఆనకట్ట 11,495 అడుగుల పొడవు నదీగర్భంలో ఆరడుగుల లోతున, పునాది ఇటుక బావులను కట్టి, వాటిల్లో డాం, 1845లో ప్రారంభించి, 1852 మార్చిలో పూర్తి చేసాడు. సాంకేతిక టెక్నిక్‌లు అభివృద్ధి కాని రోజుల్లో నిర్మాణ మెటీరియల్ దొరకని రోజుల్లో, ఈ అద్భుతాన్ని చేసి చూపిన ఘనుడు కాటన్. ఆయనకు తోడు ఒకే ఒక స్థానికుడు వీణెం వీరన్న, ధన్యుడు. ఆయనలో సేవాయిజమేగాని స్వాహా యిజం లేనేలేదు. ఇవాళ్టికీ కాటనాయనమః స్తోత్ర మంత్రాలను జపిస్తూ ప్రజలు కాటన్‌కు కృతజ్ఞతలు పలుకుతూ ఆనందిస్తున్నారు. ఆయన ధన్యజీవి.

నేటి జలయజ్ఞంలో స్వాహాయనమః జపం

గత ప్రభుత్వ హైటెక్ మాయనుండి బయటపడి నేటి రాష్ట్ర ప్రభుత్వం సాగునీటికి అగ్రతాంబూలమిస్తూ ఏకంగా ప్రాజెక్టులను అయిదేళ్ళలో (2004-2009) పూర్తి చేస్తామని ప్రకటన చాల ముదావహం. అయితే నేటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞ భగీరథ పర్వం ప్రాజెక్టుల ఊసెత్తే దశలోనే చర్చల్లో రచ్చకెక్కింది.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమాలక్రమంలో ముఖ్యమైన అంశాలు నాలుగు:

1. రాష్ట్రంలో నీటి లభ్యత - అంతర్రాష్ట్ర నదీజలాల ట్రిబ్యునల్ అవార్డులతో సహా మొత్తం నీటి వివరాలు
2. పర్యావరణ అనుమతులు
3. ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమం - నిర్వహణ
4. ప్రాజెక్టుల వల్ల ముంపు అంశాల వివరణ, పునరావాస కార్యక్రమాలు

1. నీరులభ్యత

రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులకు సాగునీరు, తాగునీరు కలిసి కావలసింది 2028.24 టి.ఎం.సి.లు (వందకోట్ల ఘనపుటడుగులు). అయితే ప్రస్తుతం అంతలేకపోయినా, ముందు ముందు అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రిబ్యునల్ అవార్డుల ద్వారా, గోదావరి నీటిని కృష్ణానదికి తరలింపు తదితర చర్యలవల్ల సమస్యను పూరించవచ్చని ఆశాభావం. బచావత్ ట్రిబ్యునల్ పునరాలోచనకై కృష్ణాజలాల వివాద ట్రిబ్యునల్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన 2004 ఏప్రిల్ 2న ఏర్పడింది. అవార్డు రావలసివుంది. అలానే ఒరిస్సా సరిహద్దులో వంశధార నది మీద 1962లోను, జంఝావతి ప్రాజెక్టుకు 1976లో శంఖుస్థాపనలు జరిగినా వివాదాల వలయంలో నాగావళితో సహా చిక్కుకుపోయాయి. తెలుగుగంగకు నీటి సమస్య గూడా వుంది. అయితే గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు నీటిని తరలించే స్వేచ్ఛ మన రాష్ట్రానికుందని గోదావరి జల వివాద ట్రిబ్యునల్ స్పష్టం చేయటం రాష్ట్రానికొక వరం.

2. పర్యావరణం

పర్యావరణ సమతుల్యానికి అడవులు ప్రధానం. 1950 దశకంలో దేశంలో 33 శాతం అడవులుండగా. నేడు 20 శాతానికి పడిపోయి పర్యావరణ సమతుల్యం తలకిందులై జాతిజీవనం అనేక దుస్థితుల్లో కూరుకుపోయింది. జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో అడవులు 40,435 చ. కిలోమీటర్లు. ఇది రాష్ట్ర వైశాల్యంలో కేవలం 14.61 శాతం. జాతీయ సరాసరి కంటే చాలా తక్కువ.

కాబట్టి ముంపు గురయ్యే అడవుల విస్తీర్ణంలో సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ముంపు వైశాల్యంలో కొంత వరకైనా అడవుల పెంపకం, ఉన్న అడవుల అభివృద్ధికార్యక్రమం, ప్రాజెక్టుల నిర్మాణ అనంతరం మురుగు నీరు, దోమల సమస్యల పరిష్కారానికి ముందుగా ప్రభుత్వం ఒక విధాన ప్రకటన చేయాలి.

3. ప్రాజెక్టుల నిర్మాణ - నిర్వహణ క్రమం

ప్రభుత్వం తలపెట్టిన 26 ప్రాజెక్టులు ఐదు ఏండ్లలో పూర్తి చేయటం ఆషామాషికాదు. రాష్ట్రంలో ఏనాడూ లేని ఈ మహత్తర 26 భగీరథ ప్రాజెక్టులను కట్టటానికి ప్రభుత్వం నిష్ణాతులైన యింజనీర్లతో ఒక కమిటీని ఏర్పరచాల్సి వుంది. అట్లాగాక కేవలం టెండర్ల మానస పుత్రులైన కాంట్రాక్టర్ల మీద ఆధారపడటం, వాళ్ళు చెప్పేదేవేదం - చేసేదే నైవేద్యం అని నమ్మి పనులను టెండర్లు పాకేజీలతో సహా స్వాహాయ పర్వ శ్రేష్టులకు అప్పగించటం దురదృష్టం. ఈనాడు ప్రాజెక్టు విఫలమయ్యే సాంకేతిక వివరాలను బేరీజువేసి తదనుగుణంగా నిర్మాణం చేయాలి. అలాకాని పక్షంలో నిర్మాణ సమయంలో ఏదైనా అవాంఛనీయ ఉపద్రవం జరిగితే ఆర్బిట్రేషన్ సాకుతో యింకా కోట్లు స్వాహా చేసే ప్రమాదం వుంది. ఇంజనీర్ల నిపుణుల నిర్మాణ కమిటీ ఈ విషయంలో కొంత మేలు చేయగలదు.

1956లో ప్రారంభమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు డాం ఎత్తు సగానికి పైగా వచ్చాక స్కాఫోల్డింగు కూలిపోయి పలువురు ఇంజనీర్లతో సహా చాలామంది మరణించారు. డాం నిర్మాణం బ్లాకుల వారీగా క్రమక్రమంగా సమాన ఎత్తులో నిర్మించక రెండు బ్లాకుల ఎత్తుగా కట్టడం చేసి, వాటి మధ్యలోని బ్లాకు తక్కువ ఎత్తులో వున్నందున, ఎగువ నుండి సమంగా కిందికి వరదనీరు రావటానికి బదులు తక్కువ ఎత్తు బ్లాకు మీద సందునుంచి వరద నీరు దూసుకొచ్చి కేవలం సెకండుకు 9 లక్షల ఘనపుటడుగుల వరద ప్రవాహం వల్ల డాం దిగువ బ్రిడ్జి పిల్లర్ కూలిపోయింది. బ్రిడ్జి సెకండుకు 13 లక్షల ఘనపుటడుగుల ప్రవాహానికి డిజైన్ చేసి నిర్మాణ క్రమం సమలెవెల్‌లో సాగనందున ఈ ప్రమాదం జరిగింది. డాం, నిర్మాణదశలోగాని తరువాత గాని విఫలం, భయంకరం. 1940లో ఇటలీలో పంచెట్‌డాం, ఈ మధ్య 2005 ఫిబ్రవరిలో పాకిస్తాన్‌లో ఒకటి, గతంలో మంజీరాతాలూకు కడెం డాంలు కూలిపోయాయి. వాటి అనుభవంతో డిజైన్ పకడ్బందీగా చేయాలి.

ముఖ్యంగా డాం రిజర్వాయర్‌లో వర్షపాతం, తద్వారా రిజర్వాయర్‌కు చేరే నీరు దాని ప్రవాహం పరీవాహక ప్రదేశంలోని ఉపరితల మట్టి రిజర్వాయర్‌కు రాగానే పూడికగా మారి రిజర్వాయర్‌లో ఉపయోగపడే నీటి పరిమాణాన్ని తగ్గిస్తుంది.

ఆ పూడికను తొలగించడానికి, అడుగున లైవ్‌స్టోరేజి లెవెల్‌కు దిగువన స్పిల్‌గేట్లు, ఎల్లకాలం పనిచేసేటట్లు డిజైన్ చేసి అమర్చాలి. స్పిల్ గేట్లను, సకాలంలో ఉపయోగించనందున నిజాం సాగర్ (మంజీరానదిపై) 1923-1930లో నిర్మించిన రిజర్వాయర్ సగానికి పైగా పూడిపోయి నీటి నిల్వ 25.6 టి.ఎం.సి.ల నుండి 11.89 టి.ఎం.సి.లకు పడిపోయింది. నేడు తలపెట్టిన రిజర్వాయర్లకు అటువంటి గతి పట్టకుండా నిర్మించాలి. వీటిని స్కవర్ స్లూయిస్‌లంటారు.

ప్రాజెక్టుల నిర్మాణం వాటితాలూకు పారుదల కాలువలు తవ్వే క్రమంలో కాలువ సాగే మార్గం యిరువైపు చెరువులు, కుంటలు, చిన్న చిన్న సహజ వాగులు గుర్తించాలి. వాటిని నీటితో నింపాలి. గతంలో బ్రిటిష్ వారు అమలు జరిపినందున 'తెల్లదొరల సైకిల్ సిస్టం' అన్నారు. దీనినే 'ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగం అభివృద్ధి' అనే పుస్తకంలో పుచ్చలపల్లి సుందరయ్య గుర్తించి విపులంగా క్రోడీకరించారు. కాబట్టి కాలువల డిజైన్‌ల నడకలో తెల్లదొరల సిస్టం అమలు జరుపగల పద్ధతుల్లో కాలువలను డిజైన్ చేసుకొని అమలు జరపాలి.

4. ప్రాజెక్టు రిజర్వాయరు వల్ల ముంపు వివరాలు- నిర్వాసితులు - పునరావాసం

నీటిపారుదల ప్రాజెక్టులపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రపంచ జలవనరుల సమితి, సాగునీటి ప్రాజెక్టుల వల్ల ప్రథమ లబ్ధిదారుడు నిర్వాసితుడు అని తీర్మానించింది. ఆ విధంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది. అయితే యిప్పటి వరకు జరిగిన చరిత్ర - 1956 సం॥ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితి ఒక దుస్థితి. ముందు అడవుల్లో రారాజుల్లాగా బతికిన గిరిజనుల అడవి భూములతో పాటు వారి జీవితాలు గూడా మునిగిపోయాయి.

గత కొన్ని సంవత్సరాలుగా నలుగుతున్న నర్మదా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యలను వెంటనే పరిష్కరించాలని

సుప్రీంకోర్టు 2005 మార్చిలో సంబంధిత రాష్ట్రాలకు వార్నింగ్ ఇవ్వటం జరిగింది. ఎప్పుడో 1970 దశకం శ్రీరాంసాగర్ నిర్వాసితుల పునరావాసానికి 35 ఏండ్ల తరువాత 11-4-2005న కొంత (బిక్షం) నిధులను విడుదలచేశారు. ఈనాడు ఆ సమస్య ఎంత తీవ్రమైందో ఎంత ప్రాముఖ్యమయిందో తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్నే ఉద్యమరంగస్థలంగా ఎంచుకొని నిర్వాసితులు తమ న్యాయమైన కోర్కెలను ముందు పరిష్కరించాలని ఉద్యమిస్తున్న వారిపై కాల్పులు జరపటంతో అర్థమవుతుంది. గతంలో కరెంటు ఛార్జీల విషయంలో బషీర్‌బాగ్ వద్ద కాల్పులు గుర్తుకొచ్చే ఘటన యిది. ఒకసారి మొదలయ్యాక ఈ 26 ప్రాజెక్టుల నిర్వాసితులు ఊరుకోరు. ఉద్యమిస్తారు. కాబట్టి దీనిపై పునరావాస క్రమ టైంటేబుల్/కాలెండర్ ఒక విధాన ప్రకటన ద్వారా ప్రజలముందుంచి ఆ ప్రకారం పరిష్కరించాలి. దీనికై ఒక కమిటీ 'స్వతంత్ర ప్రతిపత్తి'తో ఏర్పడాలి. అప్పుడే ఈ అంశానికి న్యాయం జరుగుతుంది.

నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల ఆర్థికాభివృద్ధి కలిగి బీదరికం మాయమవుతుందని ఒక భావన. అది పాక్షికమే. ఉదాహరణలుగా కృష్ణాగోదావరి డెల్టా ప్రాంతం వ్యవసాయ కూలీల గతుకుల బతుకులే సాక్ష్యం. అంచేత యితరత్రా ఉద్యోగ ఉపాధి కార్యక్రమాలను, చేపల పెంపకం, భూప్రాంత కాలువ రవాణా వగైరాలను అభివృద్ధి చేయాలి. అసలు బాగుపడేది భూస్వాములే. నీటి పారుదల తాలూకు స్కీములన్నీ కబ్జా చేసుకొని సబ్సిడీలను అనుభవిస్తూ అత్యధిక ఆదాయాన్ని పొంది దానితో పట్టణాలలో పరిశ్రమలు, ఏజన్సీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో కోట్లకు పడగలెత్తి తమ ప్రాంత గ్రామాలను శాసిస్తూ మొత్తం రాజకీయరంగాన్నే ప్రభావితం చేస్తూ పంచాయతీ మొదలు పార్లమెంటు వరకు వైకుంఠ పాళి నిచ్చెన లెక్కుతున్నారు.

ఈ వాస్తవాలను గుర్తించి ప్రాజెక్టులవల్ల భూకామందులేకాక సామాన్య జనానికి గూడా ఉపాధి వసతులను చేకూర్చాలని 2003 మార్చిలో క్యోటోలో జరిగిన ప్రపంచ జల సదస్సు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది. ఆ విధంగా నేటి ప్రభుత్వం ఒక ప్రణాళికను తయారు చేసుకొని అమలు జరపాలి.

1951లో ప్రారంభమైనప్పటినుండి యిప్పటివరకు 92 లక్షల 62 వేల ఎకరాలకు నీరందించాలని అంచనా. అయితే యిప్పటి వరకు వచ్చిన ప్రాజెక్టుల వల్ల 2004 జూన్ నాటికి కేవలం 41 లక్షల 40 వేల ఎకరాలకు (పాక్షిక సరఫరాతో సహా) నీటి పారుదల సదుపాయం సాధించాం. గతంలో ప్రారంభించిన 10 భారీ, 14 మధ్య తరగతి ప్రాజెక్టులు ఎప్పుడో పూర్తి కావలసి వుండగా 20 ఏండ్ల నుండి నడుస్తూనే ఉన్నాయి. ఈ నత్త నడకను ఎత్తి చూపుతూ 60 లక్షల 88 వేల ఎకరాలకు సాగునీరు యివ్వగల 11 ప్రాజెక్టులపై రూ 2,529 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఒక్కటంటే ఒక్క ఎకరానికి కూడా ప్రభుత్వం నీరివ్వలేకపోయిందని కాగ్ తన 2003-04 రిపోర్టులో విమర్శించింది. ఈ చురక 26 ప్రాజెక్టులను 2009 నాటికి పూర్తి చేస్తామని చెపుతున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరిక, కనువిప్పు కావాలి. అయితే ఒక సమగ్ర పథకం ద్వారా మొదలయితే అనుకున్న ఫలితాలను సాధించవచ్చు. పంజాబు ప్రభుత్వం సింధునది ఉపనదులు, సట్లెజ్, రావి, బియాస్ ఉపనదులతో సంధీకరించి భాక్రాడాం, తరువాత దిగువన నంగాల్ బేరేజిని నిర్మించి, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించింది. విద్యుత్తు ఉత్పత్తిలో రికార్డు సాధించింది. అలానే బియాస్ పై తల్వార్ గ్రామం వద్ద ప్రపంచంలోనే ఎత్తైన మట్టిడాం నిర్మించి అద్భుత ఫలితాలను సాధించి దేశంలో ఆదర్శప్రాయంగా నిలిచింది. అది మన రాష్ట్రానికి స్ఫూర్తి దాయకం కావాలి.

ఈ పోరు ప్రజాపోరుగాదు. 1956నుండి స్వాహా యజ్ఞంలోని సోమయాజుల యాగీ యిది. అప్పటినుండి యిరువర్గాలు టెండర్ వార్ చేస్తూ, ఆయా వర్గాలు రాజ్యాధికార వర్గాల పైరవీలతో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను విజయం సాధించి గుట్టుచప్పుడు లేకుండా ఒక వర్గం తరువాత ఒక వర్గం టెండర్ వార్ బలంతో ఓటర్ వార్‌లో గూడా జయం పొందటం పరిపాటయింది. ఒకనాడు సామాన్యులు 1956 నుండి రాష్ట్రంలో అధికారం చేపట్టిన వర్గంవారు యిరువర్గాలు సమాజాన్ని రాజకీయాన్ని శాసించే శక్తిమంతులయ్యారు. ఇది టెండర్ల మహిమ. ఒకే జిల్లా నుండి ఆరుగురు ఎం.పి.లు దీనికి సజీవ ఉదాహరణ. అసలు నీటి ప్రాజెక్టుల టెండర్లేకాదు ఏ డిపార్ట్‌మెంటులోనైనా ఏ రకం టెండర్లనయినా కబ్జా చేసేది ఈ రాజకీయనాయకులే. ఏదో కొద్దిమంది తప్పితే ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాని టెండర్ వాసనలు లేని ఎం.పి. గాని ఎం.ఎల్.ఎ. గాని ఉన్నారా? ఈ టెండరు మహిమవల్లనే ఒక్కరోజు కూడా పార్టీలో సభ్యత్వం లేకున్నా ఎన్నికల ముందు పార్టీ టిక్కెట్లు ఇచ్చిన ఘనత నేడు చర్చలో రచ్చకెక్కుతున్న యిరువర్గాలది కాదా?

టెండర్లను మామూలుగా పిలిచినప్పుడు తగిన అర్హతలు గల వారందరికీ అవకాశం యివ్వాలి. టెండర్లు కేటాయించబోయే ముందు తక్కువ ధర అయినా అర్హతలను పరిశీలించిగాని కేటాయించటం జరుగదు. అటువంటప్పుడు అర్హతకలిగిన అందరికిగాక ముందన్న అర్హత వేటువల్ల అనుమానం చోటుచేసుకుంటుంది. ఇది చాలా తప్పు. అదీగాక ప్యాకేజీలు చేసి ఎల్1, ఎల్2, ఎల్3 గారడీ చేసి టెండర్లను దాఖలు పరచటం అస్మదీయులకు ఆహ్వానం, తస్మదీయులకు తిరస్కారం అని

(మిగతా 57వ పేజీలో)

నీటిపారుదల ప్రాజెక్టులను ప్రభుత్వరంగంలోనే చేపట్టాలి!

- రామారావు, సివిల్ ఇంజనీర్

ఆంధ్రప్రదేశ్‌లో గత తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలకు పెద్ద పీట వేస్తూ వచ్చింది. ఆ తరువాత, అధికారంలోకి వచ్చేంత వరకు ఆర్థిక సంస్కరణలను, ప్రపంచబ్యాంకు విధానాలను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ బాటనే పయనిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేస్తామని, 5 సంవత్సరాలలో 46వేలకోట్లరూపాయల వ్యయంతో ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో 2005-06 సం.లో నీటి పారుదలకు రూ. 6000 కోట్లు కేటాయిస్తూ చర్యలు తీసుకుంది. భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం కొరకు ప్రపంచబ్యాంకు నమూనా ఇ.పి.సి.విధానాన్ని (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ నిర్మాణం)ప్రతిపాదిస్తూ ముందుకురావడం,టెండర్లకు వెళ్ళడంలో కాంట్రాక్టర్ల ఎంపిక వివాదాస్పదం కావటం,కోర్టు వివాదాలు తలెత్తాయి. వివిధ ప్రాజెక్టుల అంచనాలు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, పోలవరం తదితర ప్రాజెక్టు ప్యాకేజీలలో ఇష్టం వచ్చినట్లు పెంచడం వెలుగులోకి వచ్చింది.

అంతేగాకుండా, ప్రపంచబ్యాంకు నమూనా (ఇ.పి.సి.) విధానం అనేక అవకతవకలకు ఆస్కారమిస్తోంది. భారీ ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వరంగంలో కాకుండా ప్రైవేటు రంగంలో తలపెట్టడం, భవిష్యత్‌లో ప్రభుత్వ రంగాన్ని రద్దు చేసి కొద్దిమంది కాంట్రాక్టర్ల చేతుల్లో నీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణాలు అప్పగించడం గత అనుభవాల రీత్యా నష్టకరం. ఈవిధంగా చేయడం వలన వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగమయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

నీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణం అనేక ప్రక్రియలతో కూడుకొని ఉంటుంది. ప్రాథమిక పరిశీలన, వివరణాత్మక పరిశీలన, నీటి లభ్యత, ప్రాజెక్టుల క్రింద ముంపు భూముల సమస్య, నిర్వాసితుల సమస్య, డిజైన్, పరిశోధన, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి సమస్యలతో పాటు వేలకోట్ల రూపాయల వ్యయం వంటి క్లిష్టమైన అంశాలు కూడా ఉన్నాయి. అనేక సాంకేతిక, ఆర్థిక, సాంఘిక సమస్యల వలన ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వ రంగంలోనే భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. బ్రిటిష్ వారి కాలంలో రాయలసీమలో కె.సి. కెనాల్ నిర్మాణంలో వచ్చిన అనుభవాలు కూడా భారీ నీటి ప్రాజెక్టులు ప్రభుత్వ రంగంలోనే నిర్మించాల్సిన అవసరాన్ని తెలియచేస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం ఏభై సంవత్సరాల అనుభవంతో ప్రభుత్వ రంగంలో ఇన్వెస్టిగేషన్, డిజైన్, మెకానికల్ సర్కిల్స్, పరిశోధనారంగంలో పని చేసిన అత్యంత నిపుణులైన ఇంజనీరింగ్ వ్యవస్థ మనకు ఉంది. ఇటువంటి బృహత్ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవాలు, నైపుణ్యత గల వ్యవస్థ ప్రైవేటు రంగంలో లేదు.

ప్రాజెక్టుల నిర్మాణం-ప్రాథమిక పరిశీలన-15 రోజులు, వివరమైన పరిశీలన-4నెలలు, డిజైన్-2నె., పరిశోధన-2నె.,మొత్తం కలిపి 9నెలలు పడుతుంది. నిజంగా ప్రభుత్వానికి 5 సం.ల కాల పరిమితిలో ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, ఈ క్రింది చర్యలు చేపడితే త్వరితగతిన అభివృద్ధి సాధించే అవకాశముంటుంది.

1. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రాధాన్యతలు నిర్ణయించుకోవాలి. వెనుకబడిన కరువు ప్రాంతాలు, నికర జలాలపై ఆధారపడి ప్రాజెక్టులు చేపట్టాలి. ఒకేసారి పది ప్రాజెక్టులు చేపట్టి అన్నింటికి న్యాయం చేయాలనే పేరుతో దేనికీ న్యాయం చేయలేకపోవడం కన్నా కొన్నింటిపైనే కేంద్రీకరించి వాటిని సకాలంలో పూర్తి చేయాలి. నిధులు కాలపరిమితితో కచ్చితంగా కేటాయించాలి.

2. ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన నీటి లభ్యత, అటవీ, పర్యావరణ అనుమతులన్నింటిని నిర్మాణానికి ముందుగా లేదా ఆ క్రమంలో ప్రభుత్వమే సాధించాల్సి ఉంటుంది.

3. ప్రాథమిక పరిశీలన, వివరణాత్మక అంచనాల తయారీ, డిజైన్ పరిశోధన-వీటన్నిటిని ప్రభుత్వ రంగంలోని అనుభవజ్ఞులతో సరిపడ నిధులిచ్చి, అవసరమైతే ఇంకో సర్కిల్‌ను అదనంగా ఏర్పాటుచేసి కాలపరిమితిలో ప్రభుత్వశాఖలే తగిన సిబ్బందితో పూర్తి చేయాలి. దీనివలన కచ్చితంగా ఎంత వ్యయం అవుతుందో అంచనా వుంటుంది.

4. ప్రాజెక్టు నిర్మాణంకు ముందుగానే ముంపు స్థలాల నిర్వాసితులకు తగిన పునరావాసం, నష్టపరిహారం, ప్రాజెక్టుల కింద సాగు భూమి కేటాయింపు వంటి వాటిని పరిష్కరించడానికి ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పరచి, తగిన నిధులను కేటాయించి సకాలంలో పూర్తి చేసేటట్లుగా నిర్ణయించాలి.

పైన పేర్కొన్న విధంగా ప్రభుత్వం తగిన నిధులు, తగినంత సిబ్బందిని సక్రమంగా వినియోగిస్తే, సంవత్సరంకాలంలో ఈపనులు అన్నీ పూర్తి చేయవచ్చు. అనంతరం నిర్మాణంపనులు టెండర్లద్వారా నిర్వహించినా పనులు సకాలంలో పూర్తి అవుతాయి. అంచనా వ్యయం మన చేయిదాటి పోదు. ప్రభుత్వ రంగంలోని విభాగాలలో ఉద్యోగులకు పనిఇవ్వకుండా జీతాలిస్తూ,ఇంకోవైపు ప్రైవేటు రంగంలో ఈ పనులు ఇవ్వడం వలన వందల కోట్ల రూపాయలు అదనపు వ్యయం అవుతుంది.

(మిగతా 57వ పేజీలో)

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, పెట్టుబడులు

- బి.ఎస్.రాజు

రాష్ట్రముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన ఇచ్చిన ప్రకటన చూడండి -

"మా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నమాట నిజమే. అయితే పారిశ్రామిక రంగానికి సంపూర్ణమైన సహకారం అందించడానికి కూడా కట్టుబడి వున్నాం. పరిశ్రమలకు చౌకగా, పుష్కలంగా విద్యుత్తు, పారిశ్రామిక జలాలు సరఫరా చేయడానికి పథకాలు అమలు చేనస్తున్నాం. విద్యావంతులైన యువతీ యువకులకు ఉపాధి కల్పించడంలో పరిశ్రమల పాత్ర కీలకమైంది. వ్యవసాయం, మాన్యుఫాక్చరింగ్, సర్వీసు రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానానికి చేరుస్తాం".

15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీన ప్రకటించింది. ఇది ఏప్రిల్ 1, 2005 నుండి మార్చ్ 31, 2010 వరకు అంటే అయిదు సంవత్సరాలకి వర్తిస్తుంది. ఈ అయిదేళ్ళలో ప్రతి ఏడాదికి 20 శాతం చొప్పున 2010 నాటికి 15000 కోట్ల రూపాయల పెట్టుబడులు పారిశ్రామికరంగంలో చోటుచేసుకోవాలనే ఉద్దేశాన్ని ప్రకటించింది.

> **మొన్నటి ఇందిరమ్మ కాంగ్రెస్ అయినా, నిన్నటి చంద్రబాబు తెలుగుదేశమయినా, తిరిగి ఈరోజు రాజశేఖరరెడ్డి / సోనియాల కాంగ్రెస్ అయినా అబద్ధ ప్రచారాలు, డాంబికపు ప్రకటనలు చెయ్యడంలో ఆరితేరారు. అలా చెయ్యడం ద్వారా ఓట్లు రాబట్టుకుని ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోగల్గుతున్నారు కాబట్టి ఈ ఆర్భాటాలు కొనసాగుతూనే వుంటాయి.**

భారీ నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు సత్వర పారిశ్రామిక అభివృద్ధిని కాంక్షిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎన్నో రాయితీలు ప్రకటించారు. వాటి వివరాలు అన్ని దినపత్రికలు రాసాయి, ప్రభుత్వ ప్రకటనలూ వెలువడ్డాయి కాబట్టి వాటిని ఇక్కడ ఉదహరించడం అనవసరం. ఇంచుమించుగా ఇదే రకమయిన పారిశ్రామిక అభివృద్ధి విధానాన్ని దేశంలో అన్ని రాష్ట్రాలు ప్రకటించి ఉన్నాయి. కొత్తగా ఏర్పడ్డ ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరాంచల్ వంటి చిన్న రాష్ట్రాలు ఈ విషయంలో ఓ అడుగు ముందే ఉన్నాయి.

మన రాష్ట్ర పరిశ్రమల మంత్రి రాబోయే అయిదేళ్ళ కాలంలో రెండున్నర లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయని ప్రకటించారు. పేపర్లలో చూడటానికి, చదవటానికి ఇవన్నీ చాలా బాగుంటాయి. నోరూరించేవిగా ఉంటాయి. హేమా హేమీలయిన బడా పారాశ్రామిక వేత్తలకు బహుశా ఈ వరాల జల్లులు నిజంగానే వరప్రసాదాలు కావచ్చు.

ఎందుకంటే వాటిని ప్రభుత్వాల నుండి రాబట్టుకునే అంగబలం, అర్ధబలం, ప్రజ్ఞా పాటవాలు వారికి పుష్కలంగా ఉంటాయి. కాబట్టి రాయితీలను చురుకుగాను, త్వరితంగాను అంది పుచ్చుకుంటారు. వాటి నుండి మంచి లాభాలు గడించగల్గుతారు. ఎందుకనంటే వారు అప్పటికే మార్కెట్‌లో వేళ్ళూనికొని ఉంటారు కాబట్టి.

అయితే గత పదేళ్ళ కాలంలో రాష్ట్రాన్ని పరిపాలించిన తెలుగుదేశం పార్టీ, ప్రపంచ ప్రఖ్యాతినార్జించిన చంద్రబాబు పెట్టుబడుల ఆకర్షణకు ఎన్ని వేషాలెయ్యలేదు! ఎన్ని పిల్లిమొగ్గలెయ్యలేదు ! ఎన్ని సర్కస్ ఫీట్లు చెయ్యలేదు ! ప్రపంచ బడాబాబుల చుట్టూ ఎన్ని చక్కర్లు, ప్రదక్షిణలు చెయ్యలేదు! కంప్యూటర్ విన్యాసాలు చెయ్యలేదు! మరి ఇన్ని కథలునడిస్తే ఒక్క కథా తెరకెక్కలేదెందుకని?

మొన్నటి ఇందిరమ్మ కాంగ్రెస్ అయినా, నిన్నటి చంద్రబాబు తెలుగుదేశమయినా, తిరిగి ఈరోజు రాజశేఖర రెడ్డి / సోనియాల కాంగ్రెస్ అయినా అబద్ధ ప్రచారాలు, డాంబికపు ప్రకటనలు చెయ్యడంలో ఆరితేరారు. అలా చెయ్యడం ద్వారా ఓట్లు రాబట్టుకుని ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోగల్గుతున్నారు కాబట్టి ఈ ఆర్భాటాలు కొనసాగుతూనే వుంటాయి.

వీరి స్కీములు వారి వారి వంది మాగధులు, అనుయాయులు అనుచరులు, పార్టీ పెద్దలు, వారికి డబ్బు సంచులందించే సివిల్, సారా కాంట్రాక్టర్లు, బడా వ్యాపారవేత్తల ప్రయోజనాలు నెరవేర్చేవి గానే ఉంటాయి తప్ప విస్తృత ప్రజాబాహుళ్యపు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, నైతిక ఎదుగుదలకు ఉపయోగపడేవిగా ఉండవు.

చైనా కూడా విప్లవానంతరపు తొలిదశలో సాధించిన అమోఘమైన ప్రజా పంథాను విడనాడి సంస్కరణల బాటలో పయనించిన తీరుతెన్నులు, ప్రస్తుతం వీరంతా శ్లాఘిస్తున్న చైనా ఘన విజయాలకు పునాది ఏమిటనే నిజాలను మరుగు పరిచి, అటువంటి విశ్లేషణలనే పూర్తిగా కొట్టి పారేశి వినిపిస్తున్న, చూపిస్తున్న అభివృద్ధి కయినా మన దేశ ప్రజలను ఈయన గొప్ప ప్రజా ప్రభుత్వాలు, ఎంత దగ్గర చేశాయి? ఆ కొలమానాలతో నయినా పోలిస్తే మనం ఎక్కడున్నాం? వీటికి కారణాలేమిటి?

అంతేగాక ప్రస్తుతం నడుస్తున్న ఈ సంస్కరణల కాలంలో, ప్రపంచ బ్యాంకు ముద్రతో నడిచే అన్ని ప్రభుత్వాలు, స్వాతంత్ర్యం వచ్చిన మొదటి మూడు దశాబ్దాల కాలంలో ఉన్న ఎంతో కొంత స్వతంత్ర ఆర్థిక విధానాల్ని కూడా కోల్పోయి కేవలం కీలు బొమ్మలుగా మిగిలిపోవడం మూలంగా ఊకదంపుడు విన్యాసాలు ఎక్కువై, పారదర్శకత కరువై మభ్యపెట్టి పబ్బంగడుపుకునే పద్ధతిని ఓ స్పెషల్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌గా పెంపొందించుకున్నాయి.

ప్రణాళికలు-పరిశ్రమలు-పెట్టుబడులు ఎందుకు?

ప్రజా బాహుళ్యానికి పని కల్పించలేని, ఉపాధిని ఇవ్వలేని ప్రణాళికలు, పరిశ్రమలు, పెట్టుబడులు అసలెందుకు? మానవ వనరులను, శ్రమశక్తిని విస్మరించి ఎంతసేపూ విదేశీ పెట్టుబడు లకై, విదేశీ రుణాలకై దేబిరించే దౌర్భాగ్యపు విధానాల నెత్తుకున్న ప్రభుత్వాలు రచించే ప్రణాళికలు, పరిశ్రమలు ఎలా ఉంటాయో గత రెండు దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం.

రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ప్రభుత్వాలు నడిపే అన్ని పార్ల మెంటరీ పార్టీలు, సంస్థలు,మీడియా ఇవన్నీ చైనా అభివృద్ధి గురించి జపం చేయని రోజు అంటూ ఉండటంలేదంటే అతిశయోక్తి కాదు.

చైనా కూడా విప్లవానంతరపు తొలిదశలో సాధించిన అమోఘ మైన ప్రజా పంథాను విడనాడి సంస్కరణల బాటలో పయనించిన తీరుతెన్నులు, ప్రస్తుతం వీరంతా శ్లాఘిస్తున్న చైనా ఘన విజయాలకు పునాది ఏమిటనే నిజాలను మరుగు పరిచి, అటువంటి విశ్లేషణ లనే పూర్తిగా కొట్టి పారేసి వినిపిస్తున్న, చూపిస్తున్న అభివృద్ధి కయినా మన దేశ ప్రజలను ఈ మన గొప్ప ప్రజా ప్రభుత్వాలు, ఎంతదగ్గర చేశాయి? ఆ కొలమానాలతోనయినా పోలిస్తే మనం ఎక్కడున్నాం? వీటికి కారణాలేమిటి? ప్రణాళికలుగాని, ప్రాజెక్టులు గాని, పరి శ్రమలుగాని ప్రజాబాహుళ్యపు ఉపాధికోణం నుంచి, మానవ వన రులను పెట్టుబడులకు పెద్ద దిక్కుగా చేసుకుని ఉపయోగించు కునే కోణం నుంచి రచించి నిర్వహించకుండా ఎన్ని తంత్ర, కుతంత్రాలు చేసినా నిజమయిన అభివృద్ధి సాధించినట్టుకాదు.

పరిశ్రమల పునాది

చేతివృత్తులు, చేనేత రంగాలపై జీవనోపాధి పొందుతున్న గ్రామాలలో ప్రజల దగ్గర మొదలై వాటిని ఆధునీకరించడం, సహకార రంగంలో ఇమడ్చడం, ఆ సహకార రంగాలు అంచె లంచెలుగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలుగా అభివృద్ధి చేయడం, ఇటువంటి పరిశ్రమలకు, చేతి వృత్తులకు అవసరమయ్యే యంత్రాలు, సామగ్రి, పనిముట్లు, పరికరాలు తయారు చేసే పెద్ద పెద్ద పరిశ్రమలను స్థాపించడం, వీటినన్నిటినీ ప్రజల పూర్తి భాగస్వామ్యంతో సమర్థవంతంగా నిర్వహించడం అన్నది పరిశ్రమాభివృద్ధికి పునాది అవుతుంది.

సంఘీంభావ వ్యవసాయానికి కావలసిన పనిముట్లు, యంత్రాలు, ఇతర పరికరాలు, ఎరువులు ఇవన్నీ కూడా చిన్న, మధ్యతరగతి కర్మాగారాలలో తయారు చేయడానికి ప్రాముఖ్యత నిస్తూ వాటిలో తయారు చేయడానికి వీలుకాని వస్తూత్పత్తికి భారీ పరిశ్రమలు నెలకొల్పబడాలి. పశు, పాల ఉత్పత్తులు, కూరగాయలు, పళ్ళ ఉత్పత్తులు తదితర ఆహార పదార్థాలు ప్రజా బాహుళ్యానికి పట్టణాల్లోనయినా, కొండ ప్రాంతాల్లోనయినా ఎక్కడయినా గాని అందరికీ అందుబాటులో, వెసులుబాటులో అందేటట్టుగా పరిశ్రమలు, పంపిణీ వ్యవస్థ రూపుదిద్దుకోవాలి.

సామాజికంగా, ప్రకృతి వనరుల అందుబాటులో వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకుని, ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే సహజ సంపదను కొల్లగొట్టే దోపిడీ మార్కెట్ పద్ధతిలో గాక, సహాయ - సహకార - మానవీయతతో అభివృద్ధి కాంక్షించే పారిశ్రామికీకరణ చేయడమే పరిశ్రమల పరమావధి.

ప్రాథమిక అవసరాలయిన తిండి, బట్ట, గృహ వసతి, మొదలయినవాటి ఖర్చుకు పోగా మిగిలే కోట్లాది ప్రజలకు ఎన్నో? కొన్ని చిల్లర డబ్బులయినా పొదుపు రూపంలో పోగయితే, జనబలం ఉన్న భారతదేశంలో పెట్టుబడికి కరువేమిటి? చిప్ప పట్టుకు అడుక్కోవడమెందుకు? దేశాన్ని తాకట్టుపెట్టడమెందుకు?

ఈ అపారమయిన శక్తిని విస్మరించి, సమాజంలో పైన తేలి ఆడుతున్న పరాన్న భుక్కు వర్గానికే ప్రణాళికలు, పరిశ్రమలు, వనరులు కైంకర్యమయితే ఆ పరిస్థితికి విరుగుడేమిటో ఇటువంటి దగాకోరు ప్రణాళికల వల్ల నష్టపోతున్న ప్రజా బాహుళ్యమే ఆలోచించి ఓ నూతన మార్గాన్ని అన్వేషించాలి.

❑

వై.ఎస్. ఏడాది పాలనలో తెలంగాణ

యం. కోదండరామ్

ఏడాది పాలనలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి తెలంగాణకు తీరని అన్యాయం చేశాడు. తొమ్మిది సంవత్సరాల చంద్రబాబు పాలన కన్నా గత ఏడాది రాజశేఖరరెడ్డి పాలనలోనే తెలంగాణాకు ఎక్కువ నష్టం జరిగింది.

కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య తెలంగాణ విషయంలో మౌలికమైన తేడాలున్నాయి. తెలుగుదేశం పార్టీ విశాలాంధ్రను తప్ప అందులోని అంతర్గత ప్రాంతాలను ఎప్పుడూ గుర్తించలేదు. తెలుగు వాళ్ళంతా ఒక్కటేనని వారిమధ్య తేడాలు చూడడం సరికాదని తెలుగు దేశం ఇప్పటికీ బలంగా విశ్వసిస్తున్నది. కాంగ్రెస్ అందుకు భిన్నంగా ప్రాంతీయ అస్థిత్వాలను గుర్తిస్తున్నది. తెలంగాణ విషయానికొస్తే ఈ ప్రాంతం వెనుకబడిందని అంగీకరించింది. అంతే కాదు తెలంగాణ ప్రజల ఆకాంక్షను పరిపూర్తి చేస్తానని, ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తానని కూడా ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడానికి అంగీకరించడం వల్లనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు.

గెలిపించిన తరువాత కాంగ్రెస్ పార్టీ మాట మార్చింది. అసలు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ఏనాడూ అనలేదని కేవలం తెలంగాణ రాష్ట్ర డిమాండు పరిశీలనకు రెండవ పునర్వ్యవస్థీకరణ కమీషన్ను వేస్తామని హామీ ఇచ్చామని అంటున్నారు. పోనీ ఆ కమీషన్ను వారిచ్చిన మాట ప్రకారమే నియమించవచ్చు కదా. రెండవ పునర్వ్యవస్థీకరణ కమీషన్ను ఎప్పుడు వేస్తారో చెప్పండి అని నిలదీస్తే, సోనియా గాంధీ గారికి ఇష్టమున్నప్పుడు వేస్తారని జవాబు చెప్తున్నారు. ఇప్పుడు తెలంగాణ భవితవ్యం సోనియా ఇష్టాయిష్టాలపైన ఆధారపడి వున్నది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును విస్మరించినా తెలంగాణ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారా అంటే అదీ జరగడం లేదు. తెలంగాణ వనరుల తరలింపు మరింత తీవ్ర తరమైంది. నీళ్ళు, నిధులు, నియామకాలలో తెలంగాణపట్ల వివక్ష మరింత పెరిగింది.

నీళ్ళ విషయమే తీసుకుంటే తెలంగాణ పట్ల కొనసాగుతున్న అన్యాయాన్ని స్పష్టంగా చూడవచ్చు. తెలంగాణలో సుమారు 40 లక్షల హెక్టార్లు సాగవుతుండగా కేవలం 15 లక్షల హెక్టార్లకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉన్నది. సుమారు 37 శాతం సాగు భూమికి సాగునీటి సౌకర్యం ఉందన్న మాట. కోస్తాఆంధ్రలో 49 శాతం భూమికి సాగునీటి సౌకర్యం ఉన్నది. కానీ ఈ గణాంకాలు చెప్పని విషయమొకటున్నది. తెలంగాణలో సాగునీటి సౌకర్యం కల 15 లక్షల హెక్టార్లలో 10 లక్షల హెక్టార్లు బావుల కింద సాగవుతున్నది. బావుల కింద నికరంగా నీరందుతున్న గ్యారంటీ లేదు. గత మూడేళ్ళుగా వానలు లేక సగానికి పైగా బావులు ఎండి పోయాయి. అంతంత మాత్రంగా సాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్న బావులు తవ్వుకోవాలంటే రైతు ఖర్చు భరించాలి. బావి తవ్వగానే సమస్యలు తీరవు. కొత్త సమస్యలు మొదలవుతాయి. కరెంటు సరిగా ఉండదు కాబట్టి కరెంటు కొరకు ఎదురు చూసుకుంటూ బావి దగ్గరనే ఉండవలసి వస్తుంది. వచ్చినా సగం పారేసరికి మళ్ళీ కరెంటు పోతుంది. కరెంటు మళ్ళీ వచ్చేసరికి అదీ ఎండిపోతుంది. మరోసారి కరెంటు వచ్చిన తరువాత నీళ్ళు పెడితే ఆ భాగం తడిచి కిందికి నీళ్ళు పోతాయన్న గ్యారంటీ లేదు. మరి నీటి పారకంలో వచ్చే అంతరాయాల వలన వచ్చిన నీటిని పొలానికంతటికి సర్దుబాటు చేసుకోవడం ఒక సమస్య. నీటిని సర్దుబాటు చేసే పని వలన రైతు ఇంకొక పని చేసుకోలేడు. ఇక మరొక సమస్య మోటార్ల నిర్వహణ. సీజనుకొకసారైనా మోటారు కాలి పోతుంటుంది. దాన్ని సరి చేసుకోవడానికి బోలెడు ఖర్చు. ఈ విషయాలను పరిశీలిస్తే బావి కింద సాగు చేసుకునే రైతు కాలువల కింద సాగు చేసుకునే రైతు కన్నా అదనంగా ఖర్చు చేయవలసి వస్తుంది. బావుల కింద సాగు చేసే రైతుల ఖర్చులు 20-25 శాతం అధికంగా ఉంటాయి. కోస్తాంధ్రలో 20లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం ఉండగా అందులో 15లక్షల హెక్టార్లు కాలువలకింద, చెరువుల కింద సాగవుతున్నది. ఈ వ్యత్యాసాలను అధిగమించవలసిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతులసంక్షేమంపైన వేసిన జయతీఘోష్ కమిటీ సూచించింది. కమిటీ ఉపరితల నీటి వనరులను సమానంగా పంపిణీ చేయాలని, కొత్త సాగునీటి వసతులను నిర్మాణంలో సాగునీటికొరత ఉండి, తక్కువ వర్షపాతం కల ప్రాంతాలకు ప్రాధాన్యత నివ్వాలని చెరువుల మరమ్మత్తుకు అత్యంత ప్రాముఖ్యత నివ్వాలని సూచించింది. కమిటీ సూచనలను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రభుత్వం బడ్జెట్‌లోనే 'గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో సక్రమంగా వినియోగపర్చడం ద్వారా కృష్ణా బేసిన్‌లోని కొన్ని ప్రాజెక్టులను పరిరక్షించడం" తన లక్ష్యంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగా కేటాయింపులు చేసింది. ప్రభుత్వం రెండు సంవత్సరాలలో పూర్తిచేయ తలపెట్టిన 8 ప్రాజెక్టులలో 3 మాత్రమే తెలంగాణకు నీళ్ళందిస్తాయి. అందులో రెండు గుత్ప, అలీ సాగర్-నిజాం సాగర్ అయకట్టును స్థిరీకరిస్తాయి. ఇక మిగిలింది చొక్కారావు ఎత్తిపోతల పథకం. దీనికింద 5 టిఎంసిల నీళ్ళు వస్తాయి. ఈవిధంగా మూడు ప్రాజెక్టుల కింద కలిపి 2.15 లక్షల

హెక్టార్లు సాగవుతుంది.. అయితే ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలి. చొక్కారావు ఎత్తిపోతల పథకం కింద 123000 ఎకరాలు సాగవుతుందని బడ్జెట్‌లో చూపుతున్నారు. ఈ పథకం ద్వారా పైన చెప్పినట్టు 5 టిఎంసిల నీళ్ళు వాడకం లోకి వస్తాయి.

ఒక్క టిఎంసికి 10,000 ఎకరాల కన్నా ఎక్కువ సాగు కాదు. అంటే 50,000 ఎకరాలు మాత్రమే చొక్కారావు పథకం కింద సాగు కాగలదు. దీన్ని సరిచేస్తే రెండేళ్ళలో పూర్తి కాగల ప్రాజెక్టుల కింద సాగయ్యే భూమి 1.65 లక్షల హెక్టార్లే ఉంటుంది. దీనికి భిన్నంగా ఇతర ప్రాంతాలకు సుమారు 11.23 లక్షల హెక్టార్ల సాగునీటి సౌకర్యం కల్పిస్తున్నది. ఇప్పటికే ఎక్కువ సాగునీటిని పొందుతున్న కోస్తాంధ్రలో మరో 6 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం లభించనున్నది.

ఇక 5 సంవత్సరాలలో మరో 18 ప్రాజెక్టులను నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇందులో తెలంగాణలో రానున్నవి ఐదు ప్రాజెక్టులు. వాటి కింద 13 లక్షల హెక్టార్లకు నీరందుతుంది. 17 లక్షల హెక్టార్లు ఇతర ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యం పెంపొందగలదు. అయితే రానున్న ఐదు సంవత్సరాలలో ప్రభుత్వం నిర్మించనున్న పులిచింతల కింద కానీ, కెసి కెనాల్ ఆధునికీకరణ వలన కానీ అదనంగా సాగునీటి సౌకర్యం పెంపొందదు. కానీ ఇప్పటికే 14 లక్షల హెక్టార్లకు అందుతున్న సాగునీటి సౌకర్యం స్థిరీకరించబడుతుంది.

ఈ ప్రాజెక్టుల గురించి ఒక్క విషయాన్ని ప్రస్తావించకపోతే ప్రభుత్వ విధానాల స్వభావం అర్థం కాదు. ప్రభుత్వం, తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పులిచింతల నిర్మాణం పట్ల, ఏ అనుమతులూ లేని పోలవరం పట్ల చూపుతున్న శ్రద్ధను శ్రీరామ్‌సాగర్ జూరాల, శ్రీరామ్ సాగర్ వరద కాలువ విషయంలో చూపడం లేదు. 30 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టుల పని పూర్తి కాలేదు. దీన్ని బట్టి ప్రభుత్వ ఆలోచనను గమనించవచ్చు.

ప్రభుత్వం గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు మళ్ళించి కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించాలని కోస్తాంధ్రలో ఆయకట్టును మరింత పెంపొందించాలని ఆలోచిస్తున్నది. ఆవిధంగా కృష్ణానదిలో మిగిలిన నీటిని శ్రీశైలం ప్రాజెక్టు నుండి రాయలసీమకు కేటాయించనున్నది. ఈ ఆలోచనకు కార్యరూపం ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. అందువలన తెలంగాణ కృష్ణా, గోదావరి నదుల్లో నీటిని శాశ్వతంగా కోల్పోతుంది. చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టకుండా తెలంగాణాలో కరువులకు కారణమైతే, ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణా నీటిని శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నది. అందుకే చంద్రబాబు ప్రభుత్వం కన్నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణాకు ఎక్కువ అన్యాయం చేస్తున్నదని అనవలసి వస్తున్నది.

ఉద్యోగాల విషయంలోనూ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్షను కొనసాగిస్తున్నది. 610 జివో అమలు విషయంలోనూ స్థానిక రిజర్వేషన్లపై గిర్‌గ్లానీ కమీషన్ నివేదిక అమలు విషయంలోనూ ఉదాసీనంగా వ్యవహిస్తున్నది. రెంటి అమలు విషయంలోనూ ఎటువంటి హామీ ఇవ్వడానికి నిరాకరించింది అంతేకాదు ఒకవేపు 610 జీవోను, గిరిగ్లానీ కమీషను నివేదికను అమలు చేయాలని డిమాండు తెలంగాణ విద్యార్థులు, ఉద్యోగుల నుండి బలంగా వస్తుండగా ప్రభుత్వం యధావిధిగా స్థానిక రిజర్వేషన్లను ఉల్లంఘిస్తున్నది. ఓపెన్ క్యాటగిరీ పోస్టులను స్థానికేతరులకు కేటాయిస్తున్నారు. డిప్యుటేషన్లు, బదిలీల పేరుతో వచ్చిన ప్రాంతేతరులతో ఉద్యోగాలన్నింటిని భర్తీ చేస్తున్నారు.

వ్యవసాయరంగానికొస్తే ఆత్మహత్యలు, ఆకలి చావులు జరుగుతున్నా ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికే కేటాయింపులు చేయలేదు. పామాయిలు అభివృద్ధికి, కుప్పం ప్రాజెక్టుకు చేసినన్ని కేటాయింపులు కూడా మెట్ట ప్రాంతాల వ్యవసాయాభివృద్ధికి జరుగలేదు. పై రెంటికీ కలిపి 15 కోట్ల దాకా కేటాయించారు. మెట్ట ప్రాంతాల పైర్లకు ఈ మాత్రం కూడా కేటాయించలేదంటే ప్రభుత్వ దృక్పథంను అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా మెట్ట ప్రాంతాలకు ఉపయోగపడే పథకం ఒకే ఒకటున్నది. అది మైక్రో ఇరిగేషన్ పథకం. ఈ పథకం కింద బిందు, తుంపర సేద్యాలకు 138 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకం వలన వాటిని తయారు చేసే కంపెనీలకే లాభం ఎక్కువ. ప్రభుత్వ సబ్సిడీతో ఇస్తున్న పరికరాలు నాసిరకంగా ఉంటున్నాయి. అంతేకాక సబ్సిడీ మొత్తానికే ఈ పరికరాలు అంగట్లో దొరుకుతున్నాయి. రైతు చెల్లించే మొత్తం కంపెనీలకు లాభం. చిన్న రైతులపై బిందు, తుంపర సేద్యాలు పెట్టుబడి భారాన్ని పెంచుతాయి. అయినా ఇది వారు పండించే పంటలకు పనికి రాదు. కేవలం ఫామ్ హౌజ్‌లకు బిందు, తుంపర సేద్యాల సాంకేతిక పరిజ్ఞానం పనికొస్తుంది. కాబట్టి మెట్ట ప్రంతాల రైతుల పట్ల ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమలోని అనంతపురం రైతులకు ఈ పథకం అసలు పనికి రాదు. కనుక వారు ఇంకో సంక్షోభంలోనే బతుకుతున్నారు.

ఏ రీతిన చూసినా తెలంగాణాను ఆదుకునే ఉద్దేశ్యం ప్రస్తుత ప్రభుత్వానికి లేదన్నది స్పష్టంగానే కనపడుతున్నది. అందుకే సంవత్సర పాలనపై జరిగిన సర్వేలో ప్రభుత్వం పట్ల ఇతర ప్రాంతాలకన్నా తెలంగాణాలోనే ఎక్కువ వ్యతిరేకత ఉన్నదని తేలింది. ఎందుకన్నది పై వివరణను బట్టి అర్థం చేసుకోవచ్చు. సర్వేను బట్టి ప్రభుత్వం తన విధానాలను మార్చుకుంటుందని నమ్మకం లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే విధానాలను ఎంచుకున్నది కాబట్టి అవి మారవు. ❑

విద్యుత్ రంగంలో ఒక అడుగు ముందుకు - నాలుగు అడుగులు వెనుకకు

యం.తిమ్మారెడ్డి,
పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటి రెగ్యులేషన్

విద్యుత్ రాష్ట్రంలోని జనాభానంతటినీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తూ వుంది. (ఇంకనూ రాష్ట్రంలో 40 శాతం గృహాలకు విద్యుత్ కనెక్షన్లు లేవు. అయినా వీరు కొద్దో గొప్పో విద్యుత్ వినియోగం ద్వారా ఉత్పత్తి చేసిన సరకులను వినియోగిస్తారు, మారుమూల గిరిజన ప్రాంతాలలోని ప్రజలు తప్ప). రాష్ట్రంలో సుమారు కోటి గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు 20 లక్షల వ్యవసాయ బావులకు విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. ఒక్కొక్క పంపు క్రింద సగటున అయిదుమందికి జీవనోపాధి కలుగుతుంది అనుకుంటే దాదాపు కోటి మంది బావుల క్రింద వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంలో తీసుకునే విధాన నిర్ణయాలు రాష్ట్ర ప్రగతి పైన, ప్రజల జీవనం పైన అధిక ప్రభావాన్ని చూపుతాయి.

చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో విద్యుత్ రంగ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టాన్ని 1998 లో తీసుకుని వచ్చారు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి బోర్డును ఆరు ముక్కలుగా విభజించారు. ఎపి జెన్‌కో, ఎపి ట్రాన్స్‌కో మరియు నాలుగు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు (డిస్కమ్‌లు) 2000 సంవత్సరం మే నెలలో విద్యుత్ ఛార్జీలను 15 శాతం పెంచారు. తరువాతి రెండు సంవత్సరాలలో ఈ ఛార్జీలను 12 శాతం పెంచవలసి వుండింది. ఈ మార్పులన్నీ ప్రపంచ బ్యాంకు విధించిన నిబంధనలలో భాగమే. 2000 సంవత్సరంలో పెంచిన ఛార్జీలకు వ్యతిరేకంగా మూడు నెలల పాటు ప్రజా ఉద్యమాలు ఉధృతంగా చెలరేగాయి. ఈ నూతన విధానాలలో భాగంగా ఛార్జీలను సరఫరా కయ్యే ఖర్చుకు సరిపోయేటట్టు నిర్ణయించవలసి వుంది. సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలను క్రమక్రమంగా తొలగించవలసి వుంది. వచ్చే సంవత్సరాలలో సబ్సిడీలు పొందుతున్న వ్యవసాయ మరియు గృహ వినియోగదారులపై విద్యుత్ ఛార్జీలను ఐదారు రెట్లు పెంచవలసి వుంది. వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడానికి జడిసిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ విధానాలను పూర్తిగా అమలు పరచడంలో వెనుకంజ వేసింది.

తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ప్రోద్బలంతో చేపట్టిన సంస్కరణలపై, ముఖ్యంగా ఛార్జీల విషయంలో ప్రజలలో వున్న వ్యతిరేకత నేపథ్యంలో, ఆ వ్యతిరేకతను ఓట్లగా మార్చుకొనడానికి 2004 సంవత్సరం ఏప్రిల్ - మే ఎన్నికలలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ వ్యవసాయదారులకు, ఒక బల్బు మాత్రమే వున్న గృహ వినియోగదారులకు, తాము అధికారంలోకి వస్తే, ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రచారం చేసింది. ఈ ఎన్నికలలో ఇదే వీరి ప్రధాన అస్త్రం. సంక్షోభంలో చిక్కుకున్న రైతులను గట్టెక్కించడానికి ఇదే ముఖ్యమైన కార్యక్రమమని రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్‌కు సంబంధించిన ఫైలు మీదనే మొదటి సంతకం చేస్తామని ప్రకటించుకున్నారు.

అయితే రాజశేఖరరెడ్డి గారు సంస్కరణలను అమలు పరచమని చెప్పలేదు. మానవతతో కూడిన సంస్కరణలను అమలు చేస్తామని చెప్పారు !

తెలుగుదేశం పార్టీవారు ఉచిత విద్యుత్ సాధ్యం కాదని, ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ చేస్తున్న శుష్క ప్రచారమేనని, ఉచిత విద్యుత్ అమలు చేస్తే ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి అప్పులు పుట్టవని, ముఖ్యంగా ప్రపంచ బ్యాంకు అప్పులు ఇవ్వదని, అసలు విద్యుత్ ఉత్పత్తే సాధ్యం కాదని, చివరకు కరెంటు తీగలు బట్టలు ఆరవేసుకోవడానికి మాత్రమే పనికి వస్తాయని వాదించారు.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ విజయానికి తెలుగుదేశం ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంత కారణమో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలూ అంతే కారణం. ఈ వాగ్దానాలలో అతి ముఖ్యమైనది ఉచిత విద్యుత్ 2004, మే 14వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాజశేఖరరెడ్డి వ్యవసాయ బావులకు ఉచిత విద్యుత్

ఫైలుపై సంతకం చేశారు. దీనితో పాటు వ్యవసాయదారుల నుండి రావలసిన సుమారు రూ. 1200 కోట్ల బకాయిలను మాఫీ చేశారు.

తర్జన భర్జనలు :

అయితే సంతకం చేసిన నిమిషం నుండి కూడా ఈ కార్యక్రమం ఎంతకాలం వుంటుందో కాంగ్రెస్ నాయకత్వానికే నమ్మకం లేదు. ఈ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని కాని, లేక దానిలో తగిన మార్పులు చేయాలని కాని వివిధ సంస్థలు / వ్యక్తుల నుండి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై వత్తిడి వస్తూనే వుంది. ఇందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గ వారు కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీ సాహి మరియు ప్రపంచ బ్యాంకు. శ్రీ సాహి కేంద్ర కార్యదర్శి పదవి చేపట్టక మునుపు దేశంలోని అతి పెద్ద పారిశ్రామిక సంస్థ రిలయన్సుకు చెందిన విద్యుత్ కంపెనీకి మేనేజింగ్ డైరక్టర్‌గా వ్యవహరించారు. అతను ప్రభుత్వంలో చేరిన తరువాత విద్యుత్ చట్టం, 2003 ను రూపొందించడంలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం, సబ్సిడీలను రద్దు చేసి వినియోగదారులపై ఛార్జీల భారాన్ని పెంచడం. ప్రపంచ బ్యాంకు బహిరంగంగా వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదంటూనే, ఈ విషయంపై తన వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వానికి ఇతరత్రా తెలియచేస్తూనే వుంది. ఇతర రంగాలలో సహాయానికి కూడా విద్యుత్ రంగంలో సంస్కరణలు వేగవంతం చేయాలని మెలిక పెడుతూనే వుంది. సంస్కరణలలో భాగంగా విద్యుత్ ఛార్జీలను విద్యుత్ సరఫరా అనుగుణంగా నిర్ణయించాలి. ఎవరికైనా విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడం సంస్కణల మూల సూత్రాన్నే ప్రశ్నించినట్లవుతుంది. ఈ సంస్కరణ వాదులు వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇవ్వడం జీర్ణించుకోలేక పోయారు.

దీనితో పాటు ముఖ్యమంత్రి రాజశేఖరెడ్డి మరియు అతని కేబినెట్ లోని పలువురు మంత్రులు పలు సందర్భాలలో ఉచిత విద్యుత్ అమలు చేయడం సరైనది కాదేమోనని, కొన్ని మార్పులు చేర్పులు అవసరమేమోనని తమ నిలకడ లేని స్థితిని కూడా వెల్లడించారు.

2004 సంవత్సరం నవంబరు 4 మరియు 10 తేదీలలో హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ ప్రమేయంతో రెండు సెమినార్‌లను వ్యవసాయదారులకు ఉచిత విద్యుత్‌ను అందించడంలోని ఉచితానుచితాలను చర్చించడం కోసం ఏర్పాటు చేశారు. ఇందులో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి నిపుణులు పాల్గొన్నారు. అయితే ఇందులో పాల్గొనడానికి రైతు ప్రతినిధులను ఆహ్వానించలేదనే చెప్పాలి. ఒక సెమినార్‌లో మాత్రం ఆహ్వానం లేకున్నా ఇద్దరు రైతు సంఘాల ప్రతినిధులు హాజరై రైతుల తరఫున తమ వాదనను వినిపించారు. ఈ సెమినార్‌లను అవకాశంగా తీసుకుని కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీ సాహి ఉచిత విద్యుత్‌ను విరమించుకోవలసిన అవసరాన్ని నొక్కుకుండా తెగేసి చెప్పారు. దాని తరువాత రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉచిత విద్యుత్ కొనసాగింపు గురించి చర్చించడానికి అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

సవరణలు :

దీనికి పరాకాష్టగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం 2005 సంవత్సరం జనవరిలో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ఉచిత విద్యుత్ విధానాన్ని సవరిస్తూ కొన్ని మార్పులు చేశారు. ఈ మార్పులు ఉచిత విద్యుత్‌ను మరింత బలోపేతంగా అమలు చేయడానికేనని వారు పేర్కొన్నారు. రైతులందరికీ ఉచిత విద్యుత్ స్థానే 'అర్హులైన రైతులకే ఉచిత విద్యుత్' ను ముందుకు తెచ్చారు.

ఈ సవరణలను అనుసరించి మూడు కన్న ఎక్కువ కనెక్షన్లు గల మెట్ట రైతులు, రెండవ పంటగా వరి పండించే మెట్ట రైతులు, భారీ మరియు మధ్య తరహా నీటి ప్రాజెక్టుల క్రింద 2.5 ఎకరాల కన్న ఎక్కువ సాగు వున్న రైతులు, కార్పొరేట్ రైతులు, సంస్థలు మరియు ఆదాయం మదింపు చేసే వ్యక్తులు ఉచిత విద్యుత్‌కు అర్హులు కారు. అర్హులైన రైతులు కూడా 2006 సంవత్సరం మార్చి నెలలోపల పంపు సెట్ల సామర్థ్యం పెంపు చర్యలు కొన్ని (ఫ్రిక్షన్‌లెస్ ఫుట్‌వాల్వ్ మరియు కెపాసిటర్) మరియు 2008 సంవత్సరం మార్చి నెల లోపల పంపుసెట్ల సామర్థ్యం పెంపు మరిన్ని చర్యలు (హెచ్‌డిపిఇ పైపులు మరియు ఐఎస్ఐ మార్కు గల పంపుసెట్లు) చేపట్టాలి. లేకపోతే వారు కూడా ఛార్జీలు చెల్లించవలసి వస్తుంది. అనర్హులైన రైతులు కూడా ఈ సామర్థ్యం పెంపు చర్యలు నిర్ణీత కాలంలో చేపడితే వారు చెల్లించే ఛార్జీలను సగం వరకు తగ్గిస్తారు.

ఈ సవరణలలో రెండు ముఖ్యాంశాలున్నాయి. ఒకటి సామర్థ్యపు పెంపు చర్యలు అమలు పరచడం. రెండవది అర్హులైన రైతులను గుర్తించడం. మూడు సంవత్సరాల క్రితమే ఆ.ప్ర. రెగ్యులేటరీ కమీషన్ సామర్థ్యము పెంపు చర్యలు చేపట్టిన రైతులకు ఇటువంటి రాయితీలను ప్రకటించింది. అయితే దానికి స్పందన కరువయింది. దీనికి ముఖ్య కారణం సామర్థ్యపు చర్యలు చేపట్టడానికి రైతులకు అయ్యే ఖర్చులకు, వాటి వలన వారికందే రాయితీలకు పొంతన లేకపోవడం. ఈ చర్యలు చేపట్టడానికి సగటున రైతుకు ఏటా రు. 7550 ఖర్చు అయితే అతనికి అందే రాయితీ రు. 3375 మాత్రమే. దీనివలన ఈ చర్యలు చేపట్టడానికి రైతులు ముందుకు రాలేదు. ఈ విషయాలను ప్రస్తుత సవరణలలో కూడా తగినంతగా పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు.

ఛార్జీలను చెల్లించగల కార్పొరేట్ రైతులను, భూస్వాములను ఉచిత విద్యుత్ నుండి మినహాయించవలసిన అవసరం వుంది. వీరితో పాటు ప్రభుత్వం ఇతర కేటగిరి రైతులను కూడా ఈ కార్యక్రమం నుండి మినహాయించవలసిన జాబితాలో చేర్చింది. అమలు జరిగే సమయంలో ఇది ఎటువంటి మలుపు తిరుగుతుందోనని పలువురికి అనుమానం వుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ, ఆర్థిక అండదండలు లేని రైతులే ఈ మినహాయింపుకు గురి అయ్యే అవకాశం వుంది.

ఈ సవరణలు చేసిన తరువాత మెదక్ జిల్లాలో ఇద్దరు పేద రైతులు వారి బావుల కనెక్షన్ తొలగించడం వలన అది తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఇటువంటివే పునరావృతమవుతాయేమోనన్న భయం కూడా లేకపోలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొత్తం బావుల క్రింద వ్యవసాయం కల రైతులలో 10.55 శాతం మంది మాత్రమే ఉచిత విద్యుత్ నుండి మినహాయింపబడతారు. అయితే ప్రభుత్వ గణాంకాలు సరియైనవి కావని, మినహాయింపుకు గురి అయ్యే రైతులు 30 శాతం వరకు వుంటారన్న వాదన కూడా వున్నది.

దీనితో పాటు రెండవ పంటగా వరి సాగు చేయకూడదన్న పరిమితి కూడా సమస్యలతో కూడుకున్నది. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు ఆలస్యంగా పడతాయి. దీనివలన ఇక్కడ వరిని చాలావరకు రబీలోనే సాగు చేస్తారు. దీనిని రెండవ పంటగా పరిగణించడం వలన ఈ ప్రాంతపు రైతులు ఉచిత విద్యుత్‌ను కోల్పోయే అవకాశం వుంది. వ్యవసాయానికి విద్యుత్‌ను 7 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. రైతు రెండవ పంటగా వరి సాగు చేసినా, లేక ఇతర పంటలువేసినా ఈ 7 గంటల విద్యుత్ వాడబడుతుంది. కాబట్టి ఈ నిబంధన వలన విద్యుత్ ఆదా కాదన్నది రైతుల అభిప్రాయం.

ఈ సవరణల ద్వారా కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామన్న తమ ఎన్నికల వాగ్ధానాన్ని భంగ పరచినట్లేనని భావిస్తున్నారు.

విద్యుత్ కొనుగోలు ఖర్చుల భారం :

ఉచిత విద్యుత్ భారాన్ని భరించడానికి ప్రైవేటు ఉత్పత్తి దారుల నుండి కొంటున్న విద్యుత్‌కు అయ్యే ఖర్చు తగ్గించుకొనడం చాలా అవసరం. దీనికై వాటితో ఏర్పరచుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సవరించవలసిన అవసరం వుంది. అయితే గత సంవత్సరకాలంలో రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన ఈ ఖర్చు తగ్గడం బదులు పెరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రైవేటు రంగంలోని నాలుగు విద్యుత్ ఉత్పత్తి సంస్థలు విద్యుత్‌ను అందచేస్తున్నాయి. ఇవి జివికె, స్పెక్ట్రమ్, ల్యాంకో మరియు రిలయన్స్. ఈ నాలుగింటి మొత్తం సామర్థ్యం 999 మెగావాట్లు. ప్రభుత్వరంగంలోని, ఎన్‌టిపిసి యొక్క విశాఖపట్నం వద్ద వున్న సింహాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సామర్థ్యం 1000 మె.వా. ఈ రెండింటినీ పోల్చితే ప్రైవేటు ఉత్పత్తిదారులకు ఎంత ఎక్కువగా చెల్లిస్తున్నామో తెలుస్తుంది.

2005 - 06 సంవత్సరపు గణాంకాలను అనుసరించి :

	సామర్థ్యం మెగావాట్లు	కొన్న విద్యుత్ మిలియన్ యూనిట్లు	స్థిర ఖర్చులు (రు/కోట్లలో)	మొత్తం ఖర్చు (రు/కోట్లలో)
ప్రైవేటు సంస్థలు	999	6130	807.8	1501.5
ఎన్‌టిపిసి సింహాద్రి	1000	6484	445.3	1010.5
భేదము		-354	362.5	491.0

పై పట్టికను బట్టి ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ సంస్థ కన్న 354 మిలియన్ యూనిట్లు తక్కువగా అందించినా, స్థిర ఛార్జీల రూపంలో రు. 362.5 కోట్లు అదనంగా పొందుతున్నారు. మొత్తం మీద రు. 490 కోట్లు అధికంగా పొందుతున్నారు. 2004-05 సంవత్సరంలో వ్యవసాయ కనెక్షన్ల నుండి వస్తుందనుకున్న ఆదాయం రు. 409 కోట్లు మాత్రమే. ఈ ప్రైవేటు సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తగిన రీతిలో సవరించడం ద్వారా ప్రభుత్వం మీద ఉచిత విద్యుత్ వలన పడే భారాన్ని సులువుగా భరించవచ్చు.

ఎన్నికల ప్రచార సమయంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రైవేటు సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను సవరిస్తామని రాజశేఖరరెడ్డి గారు ప్రకటించారు. ఎన్నికయిన తరువాత కూడా ఈ పిపిఎలను ఆ.ప్ర. గ్యాస్ పవర్ కార్పొరేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం రీతిలో సవరిస్తామని చెప్పారు. వీటిని పోల్చి చూద్దాం.

	కొన్న విద్యుత్ మిలియన్ యూనిట్లు	స్థిర ఖర్చులు (రు/కోట్లలో)	ఒక యూనిట్ కయ్యే ఖర్చు (రు/కోట్లలో)
గ్యాస్ పవర్ కార్పొరేషన్	424	22.2	0.52
ప్రైవేటు సంస్థలు	6130	807.8	1.32

దీనిని బట్టి చూస్తే ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు స్థిర ఖర్చుల రూపంలో రు. 318 కోట్లు మాత్రమే చెల్లించవలసి వుంది.కాని అంతకంటే దాదాపు రు. 500 కోట్లు అధికంగా వీటికి చెల్లిస్తున్నారు. స్పెక్ట్రమ్ వారి విద్యుత్ కేంద్రానికి సంబంధించిన ఇంతకు మునుపు బహిర్గతమైన విషయాలు కూడా ఈ ప్రైవేటు సంస్థలు తమ పెట్టుబడులను వాస్తవాని కంటె అధికంగా చూపించినట్లు తేటతెల్లమయింది.

కాంగ్రెస్ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తరువాత ఈ ఒప్పందాలను పున: పరిశీలించడానికి ఆర్థికమంత్రి శ్రీ. కె. రోశయ్య గారి అధ్యక్షతన త్రిసభ్య కమిటీని నియమించారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు శ్రీ పి. అబ్రహాం గారు. ఇతను మాజీ ఐఎఎస్ అధికారి. మునుపు మహారాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు ఛైర్మన్ గాను, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ కార్యదర్శిగాను పని చేశారు. ఈ కాలంలోనే ఎన్రాన్‌తో కుదుర్చుకున్న దభోల్ విద్యుత్ కేంద్రపు ఒప్పందాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఇందులోని అతని పాత్ర పత్రికల కెక్కడంతో శ్రీ అబ్రహం గారు ఈ కమిటీ నుండి తప్పుకున్నారు. ఇంకొక సభ్యుడు రాష్ట్ర అడ్వకేట్ జనరల్.

ఈ కమిటీ ఏర్పడిన తరువాత ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో ఒక దఫా చర్చలు జరిపారు. తరువాత ట్రాన్స్ కో ఈ నాలుగు ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు ఖర్చు రు. 182 కోట్లు తగ్గేటట్లు ఒప్పందాలు సవరించడానికి ప్రతిపాదనలు చేసింది. ఇది జరిగి అర్థ సంవత్సరం దాటింది. తరువాత ఈ కమిటీ ఉనికిలో ఉన్న సూచనలు లేవు.

ఈ నాలుగు ఒప్పందాలను సవరించడం ద్వారా ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేసి విద్యుచ్ఛక్తి ఖర్చు భారాన్ని తగ్గించుకోవాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన ప్రస్తుతానికి నెరవేరనట్టే. సమీప భవిష్యత్తులో అది నెరవేరుతుందన్న సూచనలు కూడా లేవు.

సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నుండి కొనుగోలు చేసే విద్యుత్ ఖర్చు వినియోగదారులపై భారంగా తయారయింది. ఈ యూనిట్లను ప్రోత్సహించాలనే కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం యూనిట్ రు. 3 కంటె ఎక్కువ పెట్టి వీటినుండి విద్యుత్‌ను కొంటున్నారు. ఈ యూనిట్లకు అధిక ధర లభ్యమవుతుండడంతో అనుమతించిన సామర్థ్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి చేసి ట్రాన్స్‌కోకు అమ్ముతున్నారు. దీనివలన వినియోగదారులపై ఛార్జీల భారం అధికం అవుతున్నది. దీనిని రెగ్యులేటరీ కమీషన్ దృష్టికి తీసుకువెళ్ళగా, కమీషన్ ఏ సమయంలోనైనా అనుమతించిన సామర్థ్యాన్ని మించి చేసిన విద్యుత్ ఉత్పత్తికై ట్రాన్స్‌కో ఎటువంటి చెల్లింపులు చేయకూడదని సూచించింది. దీనిని అమలుపరచడానికి ట్రాన్స్‌కో ఈ యూనిట్ల ఉత్పత్తిని ప్రతి 30 నిమిషాలకు కొలవడం ప్రారంభించింది. ఇది నచ్చని ఈ యూనిట్ల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసారు. ముఖ్యమంత్రి ఈ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 30 నిమిషాల కొకసారి కాక 30 రోజులకు ఒకసారి కొలవాలని సూచించారు. దీనివలన రాష్ట్రంలోని వినియోగ దారులపై రు. 22 కోట్ల అదనపు భారం పడింది. దీనికితోడు చాలా యూనిట్లు పర్యావరణ నిబంధనలను పాటించడం లేదు. చాలా బయోమాస్ యూనిట్లు అడవులలోని చెట్లు కొట్టి వేసి ఇంధనంగా వాడుకుంటున్నాయి. అటు వాతావరణానికి తూట్లు. ఇటు వినియోగదారుల జేబులకు తూట్లు.

ఈ కోవకు చెందినదే విశాఖపట్నం దగ్గర వున్న 37 మెగావాట్ల సామర్థ్యం గల లార్డ్ వెంకటేశ్వర స్వామి (LVS) మినీ పవర్ ప్లాంటు. ఇది కేంద్ర కేబినెట్ లోని ఒక కాంగ్రెస్ మంత్రి సమీప బంధువుది. ఈ ప్లాంటు నుండి ఒక్క విద్యుత్ యూనిట్ కూడా కొనకుండానే ప్రతి సంవత్సరం రు. 32 కోట్లు స్థిర ఖర్చుల రూపంలో చెల్లిస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించడానికి కూడా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేసిన సూచనలు లేవు.

రానున్న రోజులలో ముప్పు కొత్తగా ప్రైవేటు రంగంలో రాబో తున్న నాలుగు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల నుండి వాటిల్లబోతున్నది. ఇవి జివికె - ఎక్స్‌టెన్షన్, గౌతమి, వేమగిరి మరియు కోనసీమ. వీటి మొత్తం సామర్థ్యం 1600 మె.వా. ప్రస్తుత పరిస్థితులలో వాటి అవసరం లేకున్నా, వీటికి అవసరమయిన గ్యాస్ లభ్యత లేకున్నా, గ్యాస్ ధరలు ప్రభుత్వ ఆధీనం నుండి మార్కెట్ ఆధారితంగా మారి వీటిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ ధర ఎక్కువ కాబోతున్నా, వీటన్నింటిని ప్రక్కన పెట్టి రెగ్యులేటరీ కమీషన్ ఈ నాలుగు విద్యుత్ కేంద్రాలకు ఏప్రిల్ 2003 లో అనుమతి మంజూరు చేసింది. ఈ నాలుగింటికి అనుమతి ఇవ్వడానికి వీలుగా కమీషన్ అదనంగా అవసరమయ్యే విద్యుచ్ఛక్తికి సంబంధించిన లోడ్ ఫోర్‌కాస్ట్‌ను మూడు నెలల విరామంలోనే 3180 మె.వా. నుండి 5182 మె.వా.కు పెంచింది. ఇవి 2005 - 2007 మధ్య కాలంలో ఉత్పత్తి ప్రారంభించవలసి వుంది. రెండేళ్ళు గడిచేసరికి గ్యాస్ లభ్యత శూన్యమని మరింత స్పష్టంగా తేలింది. ఉత్పత్తి లేకున్నా వీటితో కుదుర్చుకున్న ఒప్పందాలను అనుసరించి స్థిర ఖర్చులు చెల్లించవలసి వుంది. ఈ స్థిర ఖర్చులు రు. 1020 కోట్లు.

ఈ ప్రమాదం నుండి తప్పించుకోవడానికి ట్రాన్స్ కో రెగ్యులేటరీ కమీషన్ ముందు గ్యాస్ తప్ప వేరే ఇతర ఇంధనాన్ని వాడకుండా

ఈ ఒప్పందాలను సవరించాలని ఒక పిటిషన్ వేసింది. ఇంతలో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి ప్రైవేటు సంస్థలను ఒప్పించి, ట్రాన్స్‌కోతో కలసి గ్యాస్ లభ్యత లేకపోవడం వలన డిసెంబరు 2006 వరకు స్థిర ఛార్జీలు చెల్లించనవసరం లేకుండా వుండేటట్లు కమీషన్ ముందు ప్రతిపాదన వుంచింది. కమీషన్ మూడు రోజుల వ్యవధిలోనే ఈ ప్రతిపాదనకు తన అంగీకారం తెలిపింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వం రు. 1020 కోట్లు ఆదా చేయగలిగామని గొప్పలు చెప్పుకుంటున్నది.

అయితే ఈ ప్రైవేటు కంపెనీలు ట్రాన్స్‌కో కమీషన్ ముందు, కోర్టులలో తమ మీద వేసిన పిటీషన్లను అన్నింటిని ఉపసంహరించుకుంటేనే ఈ సవరించిన ఒప్పందంపై సంతకం చేస్తామని మెలిక పెట్టాయి. 2008-09 వరకు కృష్ణా - గోదావరి బేసిన్‌లో కొత్తగా కనుగొన్న గ్యాస్ సరఫరా సాధ్యం కాదని తేలింది. 2008-09లో సరఫరా ప్రారంభమయినా, మొదట గ్యాస్ గుజరాత్‌లోని ఎన్.టి.పి.సి. విద్యుత్ కేంద్రానికి సరఫరా చేస్తారు. ఈ అవసరాలు తీరిన తరువాతనే మిగిలిన గ్యాస్ ఆంధ్రప్రదేశ్‌లోని క్రొత్త ప్రాజెక్టులకు అందుతుంది. ఈ నేపథ్యంలో జనవరి 2007 నుండి ఈ ప్రాజెక్టుల స్థిర ఛార్జీల మోత తప్పనిసరి అవుతుంది. కాంగ్రెస్ ఈ విషయంలో సాధించింది శూన్యమే.

దీనితో పాటు కొత్తగా లభ్యమవుతున్న గ్యాస్‌ను మార్కెట్ ధరలకు అనుగుణంగా సరఫరా చేస్తారు. దీనిలో గ్యాస్ ధర రెండింతలు, 1000 ఘనపు మీటర్లకు రు. 2800 నుండి రు. 5600 కు పెరగనుంది. తద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ చర ఖర్చు ఒక యూనిట్‌కు రు. 0.60 నుండి రు. 1.20 కు పెరగనుంది. దీనివలన వినియోగదారుల మీద రు. 2200 కోట్ల అదనపు భారం పడనుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యల మూలంగా ఈ సమస్యల నుండి బయట పడడానికి బదులుగా, ఇందులో మరింత లోతుగా కూరుకు పోయే ప్రమాదమున్నది. ఒప్పందాల పుణ్యమా అని ప్రైవేటు సంస్థల పెట్టుబడులకూ, వారి లాభాలకూ ఎటువంటి ఢోకా వుండదు. అయితే,ఈ భారాన్ని ప్రజలు కాని, ప్రభుత్వం కాని భరించవలసి వుంటుంది.

సరఫరా, పంపిణీ వ్యవస్థపై చేస్తున్న ఖర్చులు:

ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ట్రాన్స్‌కో మరియు డిస్కమ్‌లు సరఫరా మరియు పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేయడం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. ఈ ఖర్చుల వలన రాబడి ఎంత పెరుగుతున్న దాని మీద సరియైన విశ్లేషణ లేదు. ఈ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయే గాని వాటి నుండి తగినంత ఉపయోగమున్నట్లు లేదు. తాజాగా ఈ చిట్టాలో చేరింది హై ఓల్టేజి డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్. ఈ కార్యక్రమం క్రింద రాబోయే మూడు సంవత్సరాల కాలంలో రు. 5500 కోట్లు ఖర్చు పెట్టి పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో క్రొత్త ట్రాన్స్‌ఫార్మర్లు 6,65,000 ఏర్పాటు చేయాలని తలపెట్టారు. దీనివలన ఓల్టేజి పెరుగుతుందని, దొంగ కనెక్షన్లు సాధ్యం కావని, సరఫరా మరియు పంపిణీ నష్టాలు బాగా తగ్గుతాయని ప్రభుత్వం మరియు డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కాని ఈ ఖర్చులను నిశితంగా పరిశీలిస్తే ఈ స్కీము వలన ప్రజలపై భారం పడుతుందే గానీ, వారికి ఎటువంటి వెసులుబాటు వుండదు. ఈ స్కీము వలన ప్రతి సంవత్సరం రు. 657 కోట్ల భారం పడుతుంది. అయితే దీనివలన వచ్చే ఆదాయం రు. 385 కోట్లు మాత్రమే. అంటే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా వుండబోతూంది.

ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల వలన, విద్యుత్ సరఫరా మరియు పంపిణీ వ్యవస్థపై పెడుతున్న పొంతన లేని ఖర్చుల వలన రాష్ట్ర విద్యుత్ రంగం సంక్షోభంలో చిక్కుకునే రోజులు మరీ అంత దూరంగా లేవు. అయితే సంక్షోభానికి మూలకారణమైన ఈ రెండు ఖర్చులను ప్రక్కకు నెట్టి, ఉచిత విద్యుత్ ఈ సంక్షోభానికి కారణమని చూపి దానికి చరమగీతం పాడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి మహారాష్ట్ర ఒక ఉదాహరణ.

ఒక బల్బు ఉన్న కుటుంబాలకు ఉచిత విద్యుత్ :

కాంగ్రెస్ పార్టీ వారు ఎన్నికల సమయంలో వ్యవసాయ దారులకు ఉచిత విద్యుత్‌తో పాటు ఒక బల్బు మాత్రమే ఉపయోగించే గృహ వినియోగదారులకు కూడా ఉచిత విద్యుత్‌ను వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయదారులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు బకాయిలను (రు. 1200 కోట్లు) మాఫీ చేశారు. అయితే ఒక బల్బు వాడే గృహ వినియోగదారుల గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడలేదు. మునుపు తెలుగుదేశం పార్టీ వారు అధికారంలో వున్నప్పుడు హరిజన, గిరిజన కుటుంబాలు చెల్లించవలసిన బకాయిలు మాఫీ చేస్తామని ప్రకటించారు. కాని తదనుగుణంగా ఎటువంటి ఉత్తర్వు జారీ చేయలేదు. తరువాత కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి ఒక బల్బు వున్న కుటుంబాలు తాము వాడుకునే విద్యుత్ ఉచితంగా వస్తుందని బిల్లులు కట్టడం మానివేశారు. డిస్కమ్ సిబ్బంది కూడా వీరిని బిల్లులు కట్టవలసిందిగా వత్తిడి చేయలేదు. దీనితో వీరి బకాయిలు పేరుకుపోయాయి. తగిన సమయంలో బిల్లులు కట్టకపోవడం వలన సర్ ఛార్జీలతో కలిసి ఇవి వేల

రూపాయలకు చేరుకున్నాయి. కొన్ని కుటుంబాల బకాయిలు వారి ఆస్తులు అమ్ముకున్నా చాలని స్థాయికి చేరుకున్నాయి. ఇవి మొత్తం మీద రు. 124 కోట్లు వుంటాయి. కొన్నాళ్ళు మిన్నకుండిన కాంగ్రెస్ ప్రభుత్వం నవంబరు 2004లో ఈ బకాయిలను వసూలు చేయవలసిందిగా ఆదేశించింది. దీనితో చాలా హరిజనవాడలు, గిరిజన గూడెంలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి. మార్చి 2005లో కొన్ని దళిత సంఘాలు దీనికి నిరసనంగా ఉద్యమిస్తే వారితో సంభాషణలకు దిగక, వారిపై లాటీలను ప్రయోగించారు. ఇదీ వారు చూపిన మానవత. రైతులకు సంబంధించిన రు. 1200 కోట్ల బకాయిలను (ఈ రైతులలో బకాయిలను చెల్లించగల శక్తి ఉన్న వారు కూడా ఉన్నారు) మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు వర్గాలకు చెందిన రు. 124 కోట్ల బకాయిలను మాఫీ చేయడానికి మొరాయిస్తున్నది. తరువాత బకాయిలపై సర్‌ఛార్జీలను రద్దు చేసి, ఉన్న బకాయిలను వాయిదాల పద్ధతిలో కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది.

250 వాట్ల కన్న తక్కువ కనెక్టెడ్ లోడ్ వుండి, నెలకు 15 యూనిట్ల వరకు మాత్రమే వాడే ఒక బల్బు వున్న వినియోగ దారులకు నెలకు రు. 10 రాయితీని కల్పించారు. వారు వాగ్దానం చేసినట్లు ఉచిత విద్యుత్ అమలు చేయలేదు. అయితే ఒక బల్బు వుండి 250 వాట్ల కన్న తక్కువ కనెక్టెడ్ లోడ్ వున్న కుటుంబాలు తక్కువగా వుంటాయి. చాలామంది కనెక్టెడ్ లోడ్‌ను 250 వాట్ల కన్న ఎక్కువగా ప్రకటిస్తూ వుంటారు. దీనివలన ఈ రాయితీ వలన లాభపడే కుటుంబాలు చాలా తక్కువగా వుంటాయి.

ప్రపంచ బ్యాంకు జోక్యం :

ఆంధ్రప్రదేశ్ లోని విద్యుత్ రంగ సంస్కరణలు ప్రపంచ బ్యాంకు నమూనాను అనుసరించి చేపట్టారు. ఈ సంస్కరణల కార్యక్రమానికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో పాటు విధాన నిర్ణయాన్ని జోడించింది. ఈ సంస్కరణల టైమ్ టేబిల్‌ను కూడా ప్రపంచబ్యాంకే నిర్ధారించింది. దీని ప్రకారం 2000 సంవత్సరానికి ఎపిఎస్ఈబి ని ముక్కలుగా చేసి వాటిని కంపెనీలుగా మార్చాలి. 2003 సంవత్సరానికి కనీసం ఒక డిస్కమ్ నైనా ప్రవేటీకరించాలి. 2005 సంవత్సరానికి డిస్కమ్ లన్నింటిని ప్రైవేటీకరించి వాటిని షేర్లను స్టాక్ ఎక్స్ ఛేంజిలో లిస్టు చేయాలి.

అయితే 2000 సంవత్సరంలో మొదటి టారిఫ్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమం తరువాత తెలుగుదేశం ప్రభుత్వం డిస్కమ్‌లను ప్రయివేటీకరించే సాహసం చేయలేకపోయింది. మైక్రో ప్రైవేటైజేషన్ పేరుతో విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నించింది. దీనికి కూడా ప్రజా వ్యతిరేకత తెలుపడం వలన, ప్రయివేటు సంస్థల నుండి దీనికి తగిన స్పందన లేకపోవడం వలన తెలుగుదేశం ప్రభుత్వం దాని నుండి కూడ వెనుకకు తప్పుకున్నది. ప్రైవేటీకరణ చేపట్టాలన్న వత్తిడి ప్రపంచ బ్యాంకు నుండి వస్తూనే వుండింది.

ప్రపంచ బ్యాంకు నిధులు ట్రాన్స్‌కో మరియు డిస్కమ్‌లకు చేరేసరికి వాటిమీద వడ్డీ 13.5 శాతం వుండేది. జాతీయ ఆర్థిక విధానాలలో మార్పుల కారణంగా వడ్డీ రేట్లు పడిపోయి వీటికి ఓపెన్ మార్కెట్‌లోనే నిధులు 8 నుండి 9 శాతం వడ్డీకే లభించాయి. అట్టి తరుణంలో అప్పటి ప్రభుత్వం రెండేళ్ళ క్రింద ప్రపంచ బ్యాంకుతో విద్యుత్ రంగం సంబంధించి ఏర్పరచుకున్న ఒప్పందం నుండి వైదొలగింది. కాంగ్రెస్ ప్రభుత్వం లోకి వచ్చిన తరువాత ప్రపంచ బ్యాంకు తిరిగి ఈ రాష్ట్ర విద్యుత్ రంగంలో ప్రవేశించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. 2005 మే రెండవ వారంలో హైదరాబాద్ సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి తమను రాష్ట్ర ప్రభుత్వం మరియు రెగ్యులేటరీ కమీషన్ తిరిగి ఈ రాష్ట్రంలోని విద్యుత్ రంగంలో అడుగు పెట్టవలసిందిగా కోరు తున్నట్లు చెప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రపంచ బ్యాంకుకు ఇతర సందర్భాలలో సమర్పించిన పత్రాలలో కూడా విద్యుత్ రంగ సంస్కరణలను ముందుకు తీసుకువెళతామని పేర్కొంది. గత సంవత్సర కాలంలో కాంగ్రెస్ చేసిన మంచి పనుల లో బిపిఎల్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందంను రద్దు చేయడం.

ఆగస్ట్ 2004లో 2000 సంవత్సరం విద్యుత్ ఉద్యమంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు రు. 1 లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించారు. తరువాత మే 2005లో ఈ ఉద్యమంలో పాల్గొనిన వారిపై మోపిన 715 పోలీసు కేసులను ఎత్తి వేశారు. ఇంకా రెండు వేలకు పైగా కేసులు ఎత్తివేయవలసి వచ్చింది.

కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణ వాదానికి వ్యతిరేకమయిన రైతులకు ఉచిత విద్యుత్‌ను అమలు చేసినా, మిగిలిన విషయాలను ఈ సంస్కరణల ప్రాతిపదికనే కొనసాగిస్తున్నది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నది. ఒక బల్బు వున్న పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేక పోయింది.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరును కట్టడి చేస్తూ జూన్ 2004 నుండి కొత్త విద్యుత్ చట్టం, 2003 అమలులోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల వలన రాష్ట్ర విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోతూ వుంటే, ఈ రంగంలో పున: ప్రవేశించడానికి ప్రపంచ బ్యాంకు అదను కొరకై వేచి చూస్తున్నది. ❑

జెండా మారినా సంస్కరణల ఎజెండా మారలేదు!

- కొణతం దిలీప్

ప్రభుత్వ రంగ సంస్థల్ని మూసేసి ప్రైవేటుకు తలుపులు బార్లా తెరవాలన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలను ప్రస్తుత ముఖ్యమంత్రి తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. మన రాజకీయ నాయకులు రెండు నాలుకలతో మాట్లాడటంలో సిద్ధహస్తులని మరోసారి నిరూపితమైంది.

అందుకు తాజా ఉదాహరణే సంస్కరణల పేరిట ఆంధ్రప్రదేశ్ హౌజింగ్ బోర్డు గొంతు నొక్కేందుకు జరుగుతున్న ప్రయత్నం. మధ్యతరగతి వారికి నిలువనీడనిచ్చే సదుద్దేశ్యంతో స్థాపించబడి ఎంతోమంది సామాన్యుల సొంత ఇంటి కలను నెరవేర్చిన ఆంధ్ర ప్రదేశ్ హౌజింగ్ బోర్డ్ నేడు సంస్కరణల వధ్యశిలపై ఉంచబడింది.

8 ఏప్రిల్ 2005 నాడు 'మిగులుసిబ్బంది' నెపంతో 487 మంది వర్క్ చార్జ్డ్, ఎన్.ఎమ్.ఆర్. తరగతులకు చెందిన ఉద్యోగులను తొలగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తొలగించబడిన వారిలో డ్రైవర్లు, లిఫ్ట్‌బాయ్‌లు, తోటమాలీలు, అటెండర్ల వంటి 12 తరగతులకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వారి స్థానంలో ఇప్పుడు ప్రైవేటు కంపెనీల సేవలు వినియోగించుకోవాలని హౌజింగ్ బోర్డ్ యాజమాన్యం భావిస్తోంది.


ఇరవై ఏళ్ళకు పైబడి సంస్థలో పని చేస్తున్న ఈ ఉద్యోగులు ప్రభుత్వ అసంబద్ధమైన, ఏకపక్షమైన నిర్ణయం వలన రోడ్డున పడ్డారు.

ఘన చరిత్ర

నిజాం కాలంలో నగరంలో ఇళ్ళ నిర్మాణం కోసం స్థాపించబడ్డ హైదరాబాద్ సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, టౌన్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్‌ల విలీనంతో 1956లో హౌజింగ్ బోర్డు ఏర్పడింది. తదనంతరం 1986లో ఆంధ్రప్రదేశ్ హౌజింగ్ బోర్డ్‌గా రూపాంతరం చెందింది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అనేక పెద్ద, చిన్న పట్టణాలలో వేలాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ధరకు ఇళ్ళు నిర్మించి ఇచ్చి వారి మన్ననలు చూరగొన్నది హౌజింగ్ బోర్డ్.

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కె.పి.హెచ్.బి. కాలనీని, హైదరాబాద్‌లోనే ఎత్తైన భవం చంద్రవిహార్‌ని నిర్మించింది ఎ.పి.హెచ్.బి.నే.

దిన దిన ప్రవర్ధమానమైన బోర్డ్‌లో నేడు 1034 మంది ఉద్యోగులున్నారు. దాదాపు రెండువేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు



ఉన్నాయి. వెయ్యికోట్ల రూపాయల విలువైన బాండ్లు ఉన్నాయి. అయితే కొద్దిమంది లబ్దిదారుల నుండి రావలసిన మొండి బకాయిలను సాకుగా చూపి సంస్థ నష్టాల బారిన పడ్డట్టు చిత్రీకరిస్తుంది ప్రభుత్వం.

సమస్యకు మూలం

సరళీకరణ, సంస్కరణ, ప్రైవేటీకరణ అంటూ విదేశీ ద్రవ్య సంస్థలు పెట్టే షరతులలో భాగంగా హౌజింగ్ బోర్డ్‌ను కూడా ప్రైవేటుకు అప్పజెప్పాలన్న షరతు ఉంది. గృహ నిర్మాణ రంగంలో వేళ్ళూనుకుంటున్న ప్రైవేటు నిర్మాణ సంస్థల లాబీ కూడా బోర్డు మూత కోసం, గోతికాడి నక్కలా ఎదురుచూస్తోంది.

డి.ఎఫ్.ఐ.డి. నిధులతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే బృహత్కార్యం నెరవేర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం 'ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్' నొకదాన్ని ఏర్పాటు చేసింది. సదరు సెక్రటేరియట్ హౌజింగ్ బోర్డు పరిస్థితిని మదింపు చేయడానికి ఎ.ఎఫ్.ఫెర్గూసన్ అండ్ కంపెనీ అనే కన్సల్టెన్సీ సంస్థను పురమాయించింది. ఫెర్గూసన్ కంపెనీ ఇచ్చిన నివేదికలో 565 మంది శాశ్వత ఉద్యోగులలో 267 మంది, 405 మంది వర్క్ చార్జ్‌జ్ ఉద్యోగులలో 338 మంది, ఎన్.ఎం.ఆర్. ఉద్యోగులు 96 మందినీ మిగులు ఉద్యోగులని తేల్చి వారిని తీసివేయవచ్చునని సిఫారసు చేసింది. అంతేకాదు అప్పటికే బోర్డులో ఖాళీగా వున్న 400పై చిలుకు ఉద్యోగాలు రద్దు చేయాలనీ చెప్పింది.

ప్రైవేటు రంగంలో అవినీతి తక్కువ, నాణ్యత ఎక్కువ ఉంటుందని భ్రమ పడేవాళ్ళ కళ్ళు తెరిపించాయి సింగపూర్, మలేషియా టౌన్‌షిప్‌లు. అడ్డగోలుగా, నాసిరకం మెటీరియల్ ఉపయోగించి కడుతున్న ఈ 'విదేశీ' పనితనంపై వార్తా పత్రికలలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి.



అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వ చర్యలను తీవ్రంగా నిరసించారు. తాము అధికారంలోకి వస్తే హౌజింగ్ బోర్డును ఆదుకొంటామని హామీలు గుప్పించారు.

కానీ అధికారం చేపట్టగానే తద్విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో సంస్కరణలు కొనసాగించడానికి 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్'ను ఏర్పాటు చేశారు. బోర్డు పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగుల జాయింట్ ఆక్షన్ కమిటీ పలుమార్లు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌నూ, ముఖ్యమంత్రినీ కలిసి ఉద్యోగుల తొలగింపు నిర్ణయం మార్చుకోవాలని వినతి పత్రాన్ని సమర్పించారు. కానీ ఫలితం మాత్రం శూన్యం.

హౌజింగ్ బోర్డ్ విసి ఎస్.ఎన్.మహంతి 8 ఏప్రిల్ 2005న 487 మంది ఉద్యోగులపై వేటు వేస్తూ నోటీస్ జారీ చేశారు.

బోర్డ్ భవిష్యత్‌తో చెలగాటం

చంపేముందు కుక్కను పిచ్చిదని ప్రకటించమన్న నానుడిని నిజం చేసే ప్రయత్నం చేస్తుంది రాష్ట్ర ప్రభుత్వం.

హౌజింగ్ బోర్డ్‌ను 'సంస్కరించాల్సిన' జాబితాలో చేర్చి ఆపై దాని భవిష్యత్‌ను బలిపెట్టే అనేక చర్యలు చేపట్టింది.

ఇళ్ళకు ఎంతో డిమాండ్ ఉన్న హైదరాబాద్‌లో పెద్ద ప్రాజెక్టులు చేపట్టకుండా జాయింట్ వెంచర్లకు తెరతీశారు. పోచారంలో, కూకట్‌పల్లిలో సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన నిర్మాణ సంస్థలతో జాయింట్ వెంచర్ ప్రాజెక్టులు ప్రారంభించారు. సింగపూర్ సిటీలో పేరు మాత్రమే సింగపూర్, కట్టేదీ కట్టించేదీ హైదరాబాద్ కంపెనీలే! ఇందులో ఫ్లాట్లు కొనుక్కున్న వారికి తీరా రిజిస్ట్రేషన్ సమయంలో అమ్మకం కాదనీ లీజు మాత్రమే అనీ ప్లేటు ఫిరాయించి బోర్డును కోర్ట్ కేసుల ఊబిలో పడవేసారు.

ప్రైవేటు రంగంలో అవినీతి తక్కువ, నాణ్యత ఎక్కువ ఉంటుందని భ్రమ పడేవాళ్ళ కళ్ళు తెరిపించాయి సింగపూర్, మలేషియా టౌన్‌షిప్‌లు. అడ్డగోలుగా, నాసిరకం మెటీరియల్ ఉపయోగించి కడుతున్న ఈ 'విదేశీ' పనితనంపై వార్తా పత్రికలలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి.

మరోవేపు గచ్చిబౌలిలో హౌజింగ్ బోర్డుకు చెందిన కోట్ల విలువ చేసే భూములను తెగనమ్ముతోంది ప్రభుత్వం. సొంతంగా ఇళ్ళు కట్టే సంస్థ భూములు అమ్ముకునే వింత దృశ్యం ఇప్పుడు మన రాష్ట్రంలో వరల్డ్ బ్యాంక్ సౌజన్యంతో ఆవిష్కృతమవుతోంది.

విరామమెరుగని పోరాటం

హౌజింగ్ బోర్డ్‌పై సంస్కరణల కత్తివేటు పడబోతున్నదని తెలియగానే ఉద్యోగులు జాయింట్ ఆక్షన్ కమిటీ పేరిట ఆందోళనా పథం పట్టారు. వివిధ రూపాలలో తమ నిరసన తెలియజేశారు.

ప్రజా, విద్యార్థి, ఉద్యోగ సంఘాలతో కలిసి ఆక్షన్ కమిటీ చేపట్టిన పోరాటం, చెవులుండీ వినలేని, కళ్ళుండీ చూడలేని ప్రభుత్వ చేతగానితనాన్ని బయటపెట్టింది. జనసామాన్యంలో బోర్డ్‌పై సానుభూతి పెల్లుబికింది. కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు సంఘటితం అయి ఐక్యకార్యాచరణతో ముందుకు సాగి ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి మహత్తర పోరాటానికి హౌజింగ్ బోర్డ్ ఉద్యోగుల పోరాటం నాంది కావాలి. ❑

మొదటి ఏడాది ఫర్వాలేదంటారు, తరువాత ఫలితాలే గీటురాళ్లు

- వి. శ్రీహరి

ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది సంవత్సరాల తరువాత కాంగ్రెస్ నాయకత్వాన మిశ్రమ ప్రభుత్వం ఏర్పడింది. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయినారు. ఏడాది గడిచింది. ఐదేండ్ల పాలనకు ఎన్నికైన ప్రభుత్వం ఏడాదిపాటు కొనసాగడమే ఘనకార్యమన్నట్లు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ఏడాది అంతా ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల నాయకత్వాలకు జేజేలు చెప్పడం ముఖ్యమంత్రి కార్యకలాపాలలో నిత్యకృత్యమైంది. బహుశా వారికి పునరంకితం కావడాన్ని పునరుద్ఘాటిస్తూ పునరంకిత సభ జరుపుకుంటున్నట్లుంది.

ఇందిరాగాంధీ అనగానే అత్యవసర పరిస్థితిలో నేను గడిపిన జైలు జీవితం ముందుగా గుర్తొస్తుంది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బ్యాంకులు సొంతలాభంకోసం దుర్వినియోగ మౌతున్నాయని జాతీయం చేసిన ప్రధాని గుర్తొస్తుంది. గరీబీ హటావో అని, విదేశీ సంపన్నులతో పోలిస్తే తాతా-బిర్లాలు మొదటి దరిద్రులని భావించి వారి దారిద్ర్యం బాపే కృషికి అంకితమైన రాజకీయ వేత్త గుర్తొస్తుంది. రామ రాజ్యం సాధిస్తానని అయోధ్య నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించి, మతానికి రాజకీయాలలో ఒకస్థానం కల్పించిన 'లౌకిక వాది' దర్శనమిస్తుంది. అంతకు మించి నానా గోత్రీకులను కలిపి కేరళలో నంబూద్రి ప్రభుత్వాన్ని కూల్చడంలో ఆమె పాత్ర, బెంగాల్‌లో ఎన్నికలంటే తుపాకి మోతగా కొత్త నిర్వచనాలు ఏర్పర్చిన 'ప్రజా స్వామ్యవాది' గుర్తొస్తుంది. ఇక రాజీవ్ గాంధీ అనగానే దేశం రుణ గ్రస్త కావడం, ఐ.ఎం.ఎఫ్. ఆశ్రయానికి పరుగులకు పునాదులు వేయడం, ఉపాధి రహిత అభివృద్ధికి ఈ దేశంలో పునాదిరాళ్లు వేయడం గుర్తుకొస్తాయి. ఇక సోనియా ఆయన భార్య. కొడుకు, కూతురిని పెంచింది. చేజారిన కుటుంబ అధికారం అనే ఆస్తిని గూడ తిరిగి వారికి అప్పజెప్పే మహా యజ్ఞానికి కొంగుబిగించింది. పాక్షికంగా గెలిచింది గూడ.

ఈ ముగ్గురినీ జపించి, తపించే ముఖ్యమంత్రి వీరిలో ఏ ముఖానికి అంకితమైనారు? ఇప్పుడు పునరంకిత మౌతున్నారు? ఇది శేష ప్రశ్నే.

ఏడాది కాంగ్రెస్ పరిపాలన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపట్ల నీ అభిప్రాయం ఏమిటి అని ప్రశ్నించుకున్నప్పుడు మెదడంతా కలచి వేసిన దృశ్యాలు. అందువల్ల ఏడాదిపాలనలో వారు చేశామంటున్న వెలుగులు వారే స్వయంగా చెప్పుకుంటున్నారు. చీకట్ల మీద లైట్లేసి మరీ చూపుతున్నాయి ప్రతిపక్షాలు. అందువల్ల ఆ వెలుగు చీకట్లు వదిలేద్దాం. ఐదేండ్ల కాలంలో చేస్తానన్న వాగ్దానాలను నెరవేర్చేందుకు ఆ పార్టీకి మరొక నాలుగేళ్లు వుంది. వారి వాగ్దానాలను ఒరిపిడి రాయిపెట్టేందుకు ఇంకా సమయం వుంది.

కాని వై.ఎస్. ముఖ్యమంత్రి అయినరోజున ఏడాదిలోపలే చేయవలసిన పనులు, చేస్తారని ఆశించిన పనులు చెప్పి, వాటిని ఆచరణతో పోల్చి చెప్పడం న్యాయమనిపించింది.

ఇన్నేళ్ళ అనుభవం తరువాత కాంగ్రెస్ పాలనగురించి, ఆశలు పెంచుకునే 'పిచ్చి' ఏమిటని ఎవరైనా అడగవచ్చు. ఇది జోడెద్దుల నాటి కాంగ్రెస్ కాదు. ఆవు-దూడా నైనా కాదు. హస్తం కాంగ్రెస్. అవిచ్ఛిన్నంగా పాలించిన పార్టీకాదు. గెలుస్తూ, ఓడుతూ బొప్పెలు కట్టించుకుంటున్న పార్టీ. ఆరేండ్లు కేంద్రంలో, తొమ్మిదేండ్లు రాష్ట్రంలో అధికారం లేని రోజుల 'సౌభాగ్యా'లను అనుభవించిన అయ్యలే వీరంతా. అందునా కాంగ్రెస్ వరవడికి భిన్నంగా, ఎన్నికలకు చాలాకాలం ముందే వేలమైళ్ల పాదయాత్ర చేసి ప్రజలను ముఖాముఖి కలిసి ఇబ్బందులను తెలుసుకున్న వై.ఎస్. ముఖ్యమంత్రి అయినాడు. తను కావడమే కాక కేంద్రంలో ఆ పార్టీకి ఊపిరి తెచ్చాడు. అలా మారిన పరిస్థితుల మూలంగా కించిత్ ఆశ చిగురించడం తప్పా? ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను అనుసరించి గత ప్రభుత్వం విద్యుత్‌రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టింది. దానికి వ్యతిరేకంగా పోరాటంలో కాంగ్రెస్ భాగస్వామి కాకతప్పలేదు. 'ఉచిత విద్యుత్' నినాదం, 'కిలో రెండురూపాయలకు బియ్యం', 'సారానిషేధం' నినాదాల్లా కీలకమైంది ఎన్నికలలో. ఆంధ్రప్రజలు 'తెలుగుదేశం' పాలనలో అనుభవించిన ఈతి బాధలన్నిటికీ ప్రపంచ బ్యాంకు ఆదేశాలే కీలకం.

ఇన్నేళ్ళ అనుభవం తరువాత కాంగ్రెస్ పాలనగురించి, ఆశలు పెంచుకునే 'పిచ్చి' ఏమిటని ఎవరైనా అడగవచ్చు. ఇది జోడెద్దుల నాటి కాంగ్రెస్ కాదు. ఆవు-దూడా నైనా కాదు. హస్తం కాంగ్రెస్. అవిచ్ఛిన్నంగా పాలించిన పార్టీకాదు. గెలుస్తూ, ఓడుతూ బొప్పెలు కట్టించుకుంటున్న పార్టీ. ఆరేండ్లు కేంద్రంలో, తొమ్మిదేండ్లు రాష్ట్రంలో అధికారం లేని రోజుల 'సౌభాగ్యా'లను అనుభవించిన అయ్యలే వీరంతా.

వై.ఎస్. ప్రభుత్వం గొప్పగా చాటుకుంటున్న మరొక విజయం పెద్ద పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులకు కట్టేందుకు పథకాలు రూపొందించడం. ఇవన్నీ వివాదగ్రస్తమైనవే. పొరుగు రాష్ట్రాలతో తగాదా. కేంద్ర అనుమతులకోసం తగాదా. నిర్వాసితులకు లాఠీలు. ప్రాంతీయ అభిమాన, దురభిమానాలు. అన్నిటినీ మించి డబ్బు కొరత. వేలల్లో కోట్లు చూపించి భేషజాలకు పోవడం తప్ప, అవసరాలు, అవకాశాలు, ప్రయోజనాలు ప్రభుత్వం దృష్టిలో వున్నాయా? ఉంటే ఎప్పుడో తవ్వించి, రిపేర్లు మాత్రమే అవసరమై, నిరుపయోగంగా మారిన 10 వేల వరకు ఉన్న చెరువులకు ప్రాధాన్యత ఎందుకులేదు? ఇదివరకే నిర్మించిన ప్రాజెక్టుల సామర్ధ్యమంతా ఉపయోగించుకోలేకపోతున్నాం. వీటికి గదా ప్రాధాన్యత యివ్వాలి? చిరుగు పట్టిన చొక్కా వదిలి, కొనబోయే సూటుగురించి ఆలోచించేవాడు వాడు వ్యక్తుడా, అవ్యక్తుడా?

రాజకీయ అధికారం సాధించుకునేందుకు వై.ఎస్.సొంత బాణీ ఎంచుకున్నారు. ముఖ్యమంత్రిత్వం కేవలం హైకమాండ్ ధర్మమూ కాదు. ఆ దృష్ట్యా రాష్ట్ర పురోగమనానికి సొంత ఆలోచనలు చేసే అవకాశం వుంది అన్నది నా మొట్టమొదటి ఆశ.

అందుకే రాష్ట్ర స్థూల ఉత్పత్తి లెక్కల పద్మవ్యూహం నుండి బయట పడతారని అనుకున్నా రాష్ట్రమంటే ఎల్లలు కాదని, అందులో మనుషులని ఆలోచించగలరని భావించా. అపారంగా వున్న రాష్ట్ర మానవ సంపదను, ప్రకృతి సంపదను వినియోగించు కొని రాష్ట్ర సౌభాగ్యం పెంచుకునే ప్రణాళిక రూపొందిస్తారనుకున్నా.

కానీ!

ముఖ్యమంత్రి కావడానికి అధికార అంగరక్షకులు లేకుండా ప్రజల మధ్యకు పోయిన వై.ఎస్. హంగులతో ప్రజల వద్దకు పోతున్నారు. ప్రజలనుంచీ దూరంగా ప్లాట్ ఫారాలనుండి స్వోత్కర్షలను వినమంటున్నారు. వాక్కు దానాలను నమ్మ మంటున్నారు. ప్రజలు ప్రశ్నిస్తే అధికార యంత్రం చేయి చూపు తోంది. ఒకరిద్దరు మంత్రులు 'ఏంచేసుకుంటారో చేసుకోండి' అని ప్రజలమీద విరుచుకుపడ్డ వార్తలూ వస్తున్నాయ్.

చరిత్ర మారుస్తానన్న వై.ఎస్. చరిత్ర సుడిగుండంలో చిక్కుకు పోయారనిపిస్తోంది. లేకుంటే కోటి ఎకరాలకు పైగా పంపకానికి అనువుగా ఉన్నభూమి, ఈసరికి గ్రామీణ పేదలకు పంచివుండాలి. అది అటు సంపదను పెంచేందుకు, పంచేందుకు గూడ ఉప యోగించేది. నక్సలైట్ల సమస్య సాంఘిక సమస్య అంటారు. అందు లో కీలకం గ్రామీణ ఆస్తుల అసమాన అనుభవం ఒకటి. భూమి పంపకం జరిగివుంటే పరిస్థితి ఎలావుండేది?ఇది కాంగ్రెస్‌పార్టీ పదే పదే చెపుతున్న సమస్యే. రాజకీయ అడ్డంకి లేదు. అలాంట ప్పుడు లక్ష ఎకరాలకే ఎందుకు పరిమితం అయినారు. అందులో ఇదివరకే పేదల అనుభవంలో వుండి, కేవలం పట్టాలు మాత్రం ఇచ్చింది ఎంత? కొత్తగా సాగులోకి వచ్చి, వ్యవసాయోత్పత్తి పెరుగుదలను పెంచేదెంత? భూమి పంపకంతోనే పేదలు వెలిగి పోతారని కాదు. కొన్ని కుటుంబాలను, కొంతకాలం పస్తులనుండి బయటపడేసేది.

కాని ఈ కార్యక్రమాన్ని సాగించరాదనే భూస్వామ్యశక్తులను తృప్తిపరచేందుకు పని చేపట్టలేదు. నేరుగా జనం దగ్గరకు పోయి అధికారం పొందిన వై.ఎస్. అది నిలుపుకునేందుకు పాతశక్తులను పునాది చేసుకుంటున్నారని భావించాలిగదా? అలాంటప్పుడు ఆర్థిక జీవితంలో కొత్త వరవడి ఎలా వస్తుంది?

విద్యుత్ బోర్డ్ విజయం, ఈ రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తుల పెరుగుదలకు తోడ్పడిన ప్రధాన అంశం. ఆ బోర్డ్ బోర్డ్ తిప్పేశాడు చంద్రబాబు. అదే ఆయన వాటర్‌లూ. వై.ఎస్. చేసిందేమిటి? పాత బకాయిలు రద్దు చేశారు. అది తక్కువ ప్రయోజనం కాదు. కాని పేదల ఇండ్లకు లేకుండా చేస్తే, పేదరికం పోతుందా? పి.పి.ఏ.లతో ప్రైవేట్ యజమానులకు కోట్ల లాభాలు యివ్వడం, వాటిని రద్దు చేసి పేద, మధ్యతరగతి సహాయపడడమా? డిస్కంలకు కొనుగోళ్ల తరలించడంతో చంద్రబాబు యజ్ఞానికి, వై.ఎస్.పౌరోహిత్యం నడిపారు. జనరేషన్ కార్పొరేషన్ వరుసగా థర్మల్ స్టేషన్లను మూసేసే పరిస్థితి. ప్రజలు కూడబెట్టుకున్న ఆస్తులను నిరర్ధకం చేయడం ప్రపంచ బ్యాంక్ ఆదేశం. వై.ఎస్. వాటిని అమలు జరుపుతూ 'నావరవడి కొత్తది' అంటే ఎలా నమ్మాలి?

వై.ఎస్. ప్రభుత్వం గొప్పగా చాటుకుంటున్న మరొక విజయం పెద్ద పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులు కట్టేందుకు పథకాలు రూపొందించడం. ఇవన్నీ వివాదగ్రస్తమైనవే. పొరుగు రాష్ట్రాలతో తగాదా. కేంద్ర అనుమతులకోసం తగాదా. నిర్వాసితులకు లాఠీలు. ప్రాంతీయ అభిమాన, దురభిమానాలు. అన్నిటినీ మించి డబ్బు కొరత. వేల కోట్లు చూపించి భేషజాలకు పోవడం తప్ప, అవసరాలు, అవకాశాలు, ప్రయోజనాలు ప్రభుత్వం దృష్టిలో వున్నాయా? ఉంటే ఎప్పుడో తవ్వించి, రిపేర్లు మాత్రమే అవసరమై, నిరుపయోగంగా మారిన 10 వేల వరకు ఉన్న చెరువులకు ప్రాధాన్యత ఎందుకులేదు? ఇదివరకే నిర్మించిన ప్రాజెక్టుల సామర్ధ్యమంతా ఉపయోగించుకోలేక పోతున్నాం. వీటికి గదా ప్రాధాన్యత యివ్వాలి? చిరుగు పట్టిన చొక్కా వదిలి, కొనబోయే సూటుగురించి ఆలోచించేవాడు వాడు వ్యక్తుడా, అవ్యక్తుడా?

వై.ఎస్. సర్కార్ కట్టదలచుకున్న ప్రాజెక్టుల ఖర్చు అంచనా 46 వేల కోట్ల రూపాయలు. ఇందుకు డబ్బూ, దస్కం కనుచూపు మేరలో లేదనుకోండి. ఇందులో అటు, ఇటు వాదనలను కలిపితే ఎనిమిది, తొమ్మిది వేల అవినీతి లెక్కకొస్తున్నది. చట్టబద్ధంగా ప్రాజెక్టుల తయారీలోనే సేఫ్టీ ఫాక్టర్ పేరుతో అవసరాలు మించి అంచనాలు వేస్తారు. ఇది కాంట్రాక్టర్లకు తెలుసు. వాళ్లు చేసేది వ్యాపారం. సేఫ్టీ వారి బాధ్యత కాదు. అది లాభానికి బాట. కాంట్రాక్టర్ వాటా లేకుండా ధర్మకార్యం నెరవేర్చటం లేదుగదా! ఏతా, వాతా సగం డబ్బు పరుల పాలు. మిగిలిన సగం యంత్రాల, సిమెంటు, ఇత్యాది ఫ్యాక్టరీల పాలు. నాగార్జున సాగర్ యంత్రాలతో కట్టారా? మానవ శ్రమ పెద్ద ప్రాజెక్టులకు పనికిరాదా! యంత్రాల ఉపయోగంతో ఖర్చు ఎంత పెరుగుతోంది? ప్రభుత్వ వ్యయం ప్రజలకు, శ్రమ జీవులకు కాకుండా యంత్రాల నిర్మాతల, కాంట్రాక్టర్ల పాలౌతుంటే, రాష్ట్రం ఎలా అభివృద్ధి ఔతుంది?

ఎవరికో కట్టబెట్టే డబ్బుకోసం తిరిగి ప్రపంచ బ్యాంకే దిక్కు అంటున్నారు. కొల్ల గొట్టుక పోయేవారు, కాసు అప్పుతీర్చరు. ప్రజలు యూజర్ ఛార్జీలు, వున్న ఉద్యోగాలు పోగొట్టుకొని, పస్తులుండి, ఆత్మహత్యలు చేసుకొని రాష్ట్రాన్ని రుణ విముక్తం చేయాలి!

చంద్రబాబునాయుడి బాటకన్నా భిన్నత్వం ఎక్కడ?

ప్రజలకోసం పాలన అనేది కేవలం అర్థంకాని మంత్రం కాకూడదు కదా? కష్టపడి, తిండి తినే హక్కు కోరతారు ప్రజలు. ఎవరిచేతి విదిలింపుల దానాలు వారికక్కరలేదు. ఉన్న ఉపాధి ఊడగొడుతున్నారు. వేసుకున్న గుడిసెలు పడగొడుతున్నారు. వేలాదిగా వుద్యోగాలు వున్నాయని లెక్కలు చెప్పిన ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. కాగా ముఖ్యమంత్రి వై.ఎస్.కు ఉద్యోగాలే వృథా ఖర్చుగా కనిపిస్తున్నాయి. వేల ఉద్యోగాలు వందలైనాయి.

కొత్తగా ఉపాధి కలిగిస్తానంటున్న ప్రభుత్వం, వున్న వనరులను మరచిపోతే ఎలా? ఉద్యోగ వసతులు కలిగించి, దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంతో కీలకమైన పాత్ర వహించే చిన్న పరిశ్రమలు అనేకం మూతపడి వున్నాయి. మూతపడిన పరిశ్రమలనుండి అప్పులు వసూలు చేసుకునేందుకు సెటిల్‌మెంటు పేర వందలకోట్ల రూపాయలు ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ధారా దత్తం చేస్తున్నది. అప్పులు లేవని చెప్పుకోవాలనే తాపత్రయం తప్ప, ప్రజల సొమ్ముతో ఒనగూడిన వనరులు వృథాగా తుప్పు పడుతున్నాయని, వేలాది కుటుంబాలు పస్తులుంటున్నాయనే ఆలోచన కార్పొరేషన్‌కు వుండకపోవచ్చు. ఈ నష్టాలు బడ్జెట్ అంకెల్లో ఇరకాటం పెట్టవు. అది కార్పొరేషన్ ఖాతా గనుక. దాని ఉపాధి, అభివృద్ధి అని కేకలు పెట్టే ప్రభుత్వానికి పట్టాలి. పాతబకాయీల కింద కొట్టి పారేసే మొత్తాలు, యజమానులు దుర్వినియోగం చేసిన మొత్తాలు కలిపి చూస్తే ఈ యంత్రాల తుప్పు వదులుతుంది. వేలాది కుటుంబాలు తిండితింటాయి.

ఇందుకు కొత్త ఆలోచనలు కావాలి. కొత్త పద్ధతులలో పరిపాలనా నిర్వహణ కావాలి. ముఖ్యమంత్రి కొత్తైతే చాలదు. ఈ గీటు రాయితో వై.ఎస్. పరిపాలన వన్నె పరీక్షించండి.

భారతదేశ రాష్ట్రాల బాధ్యతలు మెండు. వనరుల కరువుతో 50 ఏండ్లుగా అవస్థలు పడుతున్నాయి. ఈ కేంద్రీకరణకు విసిగి ప్రాంతీయ పార్టీలకు పట్టం కట్టారు ప్రజలు. అయినా తీరు మారలేదు సరిగదా రాష్ట్రాల స్వంత వనరులలో కీలకమైన అమ్మకంపన్ను వాట్ పేరుతో కేంద్రం పరమౌతున్నది. మొదటి సంవత్సరాలలో రాష్ట్రాలు నష్టపోతాయి, పరిహారం ఇస్తామంటున్నారు. తరువాత ఎలా తగ్గుతుంది? తగ్గకుంటే ఫైనాన్స్ కమిషన్లకు విజ్ఞప్తులే దిక్కు. ఉన్న వనరు గూడ పోగొట్టుకుంటున్నారు.

ప్రధాన ఆర్థిక విధానాలలో కేంద్ర ప్రభుత్వానిదే పెత్తనం. ఆ పెత్తనంతో ఘర్షణ పడకుండా రాష్ట్ర వనరులు ఎట్లా వస్తాయి? వనరులే లేకుండా చేసే వాగ్దానాలు ఒట్టిగొడ్డు అరుపులు తప్ప, పాలెక్కడ వస్తాయి?

వనరులు తెచ్చుకోడం, సమకూర్చుకోడం, వాటి వినియోగం ప్రజలకు అందాలని ప్రభుత్వ వ్యయం ప్రజల సొత్తు కావాలని ఆలోచించే కొత్త ఆలోచన అవసరం.

ప్రజలకోసం ప్రభుత్వం చేసే వ్యయంలో రూపాయలో 10 పైసలు అసలువారికి దక్కడం లేదని రాజీవ్‌గాంధీ - వై.ఎస్. గారి ఆరాధ్యదైవమే - అన్న మాటలు. అంటే దళారీలు తింటున్నారు. దళారీలే తినేందుకు అయ్యే ప్రభుత్వ వ్యయం కొల్లగొడుతున్నారు.

ఈ దళారీలను తొలగించకుండా ఈ కాంట్రాక్టర్లు, టెండర్లు లేని, ప్రజలే ఖర్చును అజమాయిషీ చేసే నూతన సామాజిక వ్యవస్థ ఏర్పడకుండా, ప్రజల సొమ్ము, ప్రజల బాగుకు ఎలా వుపయోగిస్తుంది?

నూతన పరిస్థితులలో కొత్త ఆలోచనలు, సరికొత్త బాటలు పట్టాల్సిన సమయంలో వైఫల్యాల విధానాలకు పేరుగన్న ఇందిర, రాజీవ్ ద్వయం ఆదర్శమనే ముఖ్యమంత్రి ఈ ఏడాదిలో విఫలం కావడమే కాదు. మరో నాలుగేండ్లలోనూ విజయం సాధించలేరని అపనమ్మకం కలిగిస్తోంది.

ఏడాది కొత్తలో "ఫరవాలేద"ని ఓటేసిన ప్రజాభిప్రాయం ఈ "బెనిఫిట్ ఆఫ్ డౌట్" ఎల్లకాలం యివ్వదు. "బెనిఫిట్ ఆఫ్ హోప్" పొందేందుకు వై.ఎస్. మరోసారి వై.ఎస్.గా జనం దగ్గరకు పోవాలి.

❑

రాష్ట్ర వ్యవసాయ రంగం దుస్థితిని చాటిన

జయతీఘోష్ కమిషన్ నివేదిక

- విద్యాభూషణ్

అభివృద్ధి ముసుగులో మోసపూరిత విధానాలను భుజానికెత్తు కున్న ప్రభుత్వం పదిహేనేళ్ళ అనుభవాలను అంగీకరిస్తూనే, ఆయా విధానాల అమలును మాత్రం విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఈ విధానాలు యితర మూడో ప్రపంచ దేశాలపై భయపెడుతున్న ప్రభావాలను కలిగిస్తున్నా తన విధాన నిర్ణయంలో మార్పు లేదంటోంది. ప్రపంచీకరణ ముసుగులో వాణిజ్య విస్తరణ పేరిట వర్ధమాన దేశాల ద్రవ్యపెట్టుబడులను కొల్లగొట్టడం జరుగుతోంది. పర్యవసానంగా ఆయా దేశాల ప్రజల జీవనం దుర్భరమౌతోంది. మార్చి 23-25 తేదీల్లో జరిగిన దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సదస్సు యిదే విషయాన్ని ధృవీకరించింది. దక్షిణాసియా దేశాలైన భారత్, పాకిస్తాన్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలన్నింటిలో ప్రపంచీకరణ విధానాల ఫలితంగా వ్యవసాయరంగం క్షీణించిందన్నదే ప్రధానంగా వ్యక్తమయ్యింది. మన రాష్ట్ర పరిస్థితి సైతం యిందుకు భిన్నంగా ఏమీలేదు. ప్రపంచీకరణ విధానాల అమలుకు రాష్ట్రం ప్రయోగశాలగా దోహదపడుతున్నందున, ఫలితాలు సైతం స్పష్టంగానే వ్యక్తమౌతున్నాయి.

జాతీయ ఆదాయంలో దిగజారిన వ్యవసాయ రంగం వాటా, వ్యవసాయమే తప్ప ప్రత్యామ్నాయం లేని ప్రజలశాతం పెరగడం, అవసరాలకనుగుణంగా పెరగని ఆహార ఉత్పత్తి, దిగజారిపోతున్న నిజవేతనాలు, అడుగంటుతున్న ఉపాధి పాలక విధానాల ఫలితాలుగా నేటికీ సాక్షాత్కరిస్తున్నాయి. 1990 లో తలసరి ఆహార ధాన్యాల వినియోగం రోజుకి 510 గ్రాములు వుండగా 2001 నాటికి 417 గ్రాములకు పడిపోవడమే వ్యవసాయ రంగంపై సంస్కరణల ప్రభావానికి ప్రత్యక్ష ప్రతీక!

ప్రధానంగా వ్యవసాయ రంగాన్నే పరిగణనలోకి తీసుకుంటే, చిన్న కమతాల సేద్యం నష్టదాయకమని చెప్పి మోసపుచ్చి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, దీంతో రైతాంగం జీవనోపాధిని కోల్పోయి, వీళ్ళ భూముల్లో వీరే కూలీలుగా పనిచేసే పరిస్థితులు ఎదురుకావడం, మరోవైపు భూ వనరులను యితర బహుళజాతి కంపెనీలకు అప్పగించే యత్నం, వ్యవసాయ వ్యయాన్ని తగ్గించేందుకై యంత్రాల వినియోగం... బడుగు జీవుల ఉపాధిని మింగేస్తున్నాయి. కంపెనీ సేద్యం లాభాల మాటున వాణిజ్య పంటలకే ప్రాధాన్యత నిస్తుంది. దీంతో ఆహార భద్రతకు విఘాతం. లాభాల వాణిజ్య ధోరణి రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతి వనరులే కలుషితం అయిపోతాయి. ఈ లాభార్జన ధోరణి ఎగుమతులపై దృష్టిని నిలుపుతుంది. ఫలితంగా అంతర్జాతీయ అస్థిరతలకు వ్యవసాయం గురికావల్సి వస్తుంది. యింతటితో ఆగిపోకుండా, ఈ విదేశీ ప్రమేయం విత్తనాల తయారీలోనూ వేలుపెట్టి స్వదేశీ సంస్థలను తరిమేస్తున్నది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, యంత్రాల పేరిట బహుళ జాతి సంస్థలు ఈ రంగంలో విస్తరిస్తున్నాయి. జీవశాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం (బయో టెక్నాలజీ) పేరిట జీవన ప్రక్రియలకు పారిశ్రామిక విలువను కల్పిస్తూ, సాంకేతిక విజ్ఞానాన్నే తీసుకువచ్చి రైతాంగం విత్తనాల కోసం ఆయా కంపెనీలను అంటిపెట్టుకు వుండే దుర్మార్గ ధోరణికి పాలు పోవడం గమనించదగ్గది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించి, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించేందుకు జయతీఘోష్ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ తన నివేదికను డిసెంబరు 11, 2004న ప్రభుత్వానికి సమర్పించగా, ప్రభుత్వం 2005 మార్చ్ 29న శాసన సభలో ప్రవేశపెట్టింది. కమిషన్ పరిశీలనను పరిశీలిద్దాం!

రాష్ట్రంలో సంస్కరణల ప్రభావం రూపొందుకున్న నాటినుంచి సుమారు తొమ్మిదేళ్ళు అధికారం వెలగబెట్టిన హైటెక్ ప్రభుత్వం, వ్యవసాయ రంగ క్షీణతకు మాత్రం తన ప్రమేయమేమీ లేదని చెప్పి తప్పుకోజూస్తోంది. ఈ వ్యవసాయ రంగ క్షీణతకు క్రమం తప్పని వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాలు కారణాలని చెప్పి

చెయ్యి దులిపేసుకుంటోంది. నాటి అధికార హయాంలో వీరు చేపట్టిన రైతాంగ వ్యతిరేక విధానాల పాపఫలమే నేడు రైతాంగం అనుభవిస్తున్నారన్నది అక్షర సత్యం! ప్రత్యేకించి విస్తృతంగా అడవుల నిర్మూలనా ధోరణులను చేపట్టిన కారణం గానే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు నెలవయ్యాయన్నది ఓ నిష్టూర నిజం! సాగునీటి వసతి కల్పన, విత్తనాల సరఫరా వంటి ప్రాథమిక అంశాలనే కాకుండా, మొత్తం గ్రామీణ ప్రాంతాలనే ఉపేక్షించేసిన హైటెక్ విధానాల ఫలితంగానే వ్యవసాయ రంగం అవసాన దశకు చేరుకుంది. విసిగి వేసారిన ఆంధ్రావని రైతాంగం, మనుగడ మీద ఆశలను వదులుకుని ఆత్మహత్యలను ఆశ్రయించ ప్రారంభించారు. సరిగ్గా ఈ సంధి పరిస్థితుల్లో ఎన్నికలు వచ్చినందున, మేల్కొన్న ప్రజానీకం తగిన శాస్తి చేశారు. వాగ్దానాల హోరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల తీర్పు అంతర్యాన్ని గుర్తించి, గ్రామీణ రైతాంగం వైపు దృష్టి మరల్చింది. ఫలితంగా రైతాంగ సమస్యల పరిష్కార సూచనలకై జయతీ ఘోష్ కమిషన్‌ను నియమించడం ముదావహం.

కమిషన్ ప్రాథమిక అధ్యయనం లోనే రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడులు 1980 నాటి నుంచే దిగజారడం ప్రారంభించాయని కనుగొంది. 1990 నాటి నుండి క్రమానుగతంగా దిగుబడులు ఏటా 1.8 శాతం మేరకు దిగజారుతూ వచ్చాయన్నది జాతీయ స్థాయి అధ్యయనం వెల్లడించింది. తరువాత 1996 నుంచి ప్రపంచ మార్కెట్ ధోరణుల ప్రభావం నేరుగా వ్యవసాయోత్పత్తులపై పడటంతో గిట్టుబాటు ధరల సమస్య కీలకమయింది. దీంతో గిట్టుబాటు కోసం వాణిజ్య పంటల నాశ్రయించడం అనివార్య మయింది. క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువుల వినియోగం పథకం ప్రకారం రంగ ప్రవేశం చేయటం జరిగింది. సంప్రదాయ సేద్య ధోరణిని వదులుకుని వ్యయపూరిత సేద్యాన్ని చేపట్టాల్సి వచ్చింది. సేద్య ప్రణాళికల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. పర్యావరణ సమతుల్యతాలోపం, ప్రకృతి వైపరీత్యాల సేద్యం ఓ జూదంగా మారిపోయింది. ఇందుకు సైదోడుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరించడంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ఆదుకున్న నాథుడే లేని పరిస్థితి ఎదురయ్యింది. ఇదంతా రాష్ట్రంలో సంస్కరణ అమలు ప్రయోగ ఫలితంగానే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేని అంశం. పాలక వర్గాలు బాధ్యతారాహిత్య ధోరణులను అవలంబించడంతో వ్యవసాయ రంగం ప్రైవేటుశక్తుల పరం అయి, సంక్షోభంలో కూరుకుపోయింది. గ్రామీణ కుటీర పరిశ్రమలు మూతపడటం, వ్యవసాయరంగంలో ఉపాధే కరువవడం మూలంగా గ్రామీణ రైతాంగం నైరాశ్య పరిస్థితులకు నెట్టేయబడ్డారు. మరోవైపు చేనేత రంగంకు చెందాల్సిన ప్రభుత్వ రాయితీలు లేక, సహకార సంఘాలు నిర్వీర్యమవడంతో చేనేత కార్మికులు సైతం బడుగు రైతాంగ ధోరణులకే చేరువయ్యారని జయతీ కమిషన్ నిర్ద్వంద్వంగా విశ్లేషించింది.

సంస్కరణల ఆవిర్భావంతో అటకెక్కిన ప్రభుత్వ విధానాలు

1. సంస్కరణల ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధికై ప్రభుత్వ వ్యయ కేటాయింపులు కుదించడం జరిగింది.
2. వ్యవసాయ పరిశోధన, విస్తరణ అంశాల్లో ప్రభుత్వ కేటాయింపుల కుదింపు - విద్యుత్ - నీటి పారుదల రంగాలకు సైతం విస్తరణ.
3. ప్రజాపంపిణీ విధానంలో సరుకుల ధరల పెంపు, రాయితీల కుదింపు. అంతిమంగా గ్రామీణ ప్రజల ఆహార వినియోగంలో కోత - కొరత.
4. గ్రామీణ రుణ సౌకర్యాల వెసులుబాటు మృగ్యం.
5. వ్యవసాయ ఉత్పత్తుల అంతర్రాష్ట్ర వాణిజ్యంపై ఆంక్షల సడలింపు.
6. ఆహార ధాన్యాల ఎగుమతుల ప్రోత్సాహం, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షల తొలగింపు వంటి విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడం జరిగిందని కమిషన్ అభిప్రాయ పడింది.

వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు చెందిన అంశం. అయినందున వ్యవసాయరంగ పరిరక్షణా బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపైన అధికంగా వుంటుంది. సంస్కరణల ఆదేశాల రీత్యా గత దశాబ్దంలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైందన్నది కాదనలేని వాస్తవం. సంస్కరణల పుణ్యమా అని ఒకవైపు సాగు నీటి వసతి అభివృద్ధి కొరవడుతుండగా, నీటి వినియోగదార్ల సంఘాల నేర్పాటు చేసి, నీటి తీరువాలను మూడు రెట్ల మేరకు పెంచేయడం జరిగింది. సాగునీటి వసతి పూర్తిగా కాంట్రాక్టర్లకు అప్పగించేయడం జరిగింది. సాగునీటి వినియోగదార్ల సంఘాలు కేవలం కాలువలకే పరిమితం అయి చెరువుల కింద సేద్యాన్ని ఉపేక్షించడం సైతం జరిగింది. వ్యవసాయ రంగ పరిరక్షణకు దోహదపడే రాష్ట్ర సాగునీటి అభివృద్ధి సంస్థ, రాష్ట్ర వ్యవసాయ పారిశ్రామిక సంస్థ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలను మూసివేయడం లేదా నిర్వీర్య పర్చడం జరిగింది నాటి హైటెక్ పాలనా కాలంలోనే.

తదనంతరం చోటు చేసుకున్న విధాన మార్పులు:

విపరీత నిర్లక్ష్య ధోరణులకు వ్యవసాయరంగాన్ని గురిచేసిన కారణంగానే ఏప్రిల్ 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో హైటెక్ పాలనకు కాలం చెల్లింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జరిగిన లోపాన్ని గుర్తెరిగి వ్యవసాయ రంగ

ఒకవైపు దేవాదాయ శాఖ లోనే లక్షలాది ఎకరాల భూవసతి నిరుపయోగంగా పడివుందని స్వయానా ప్రభుత్వమే అంగీకరిస్తున్న పక్షంలో, భూ పంపిణీ సమస్యపై కమిషన్ సరైన దృష్టి నిలపక పోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. వివిధ ఖాతాల్లో అంటే దేవాదాయ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన భూములు, అటవీ శాఖ భూములు, ప్రభుత్వం ప్రకటించిన మిగులు భూములు, ఆంధ్ర కోస్తా ప్రాంతంలో వున్న తీరప్రాంత భూములు, ప్రభుత్వ బంజర్లు, అక్రమ కబ్జాలకు గురైన భూదాన్ భూములు, అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను ప్రభుత్వం సత్వరమే సేకరించి, భూమిలేని నిరుపేదలకు పంపిణీని చేపట్టాల్సి వుంది. పై నుదహరించిన అదనపు భూములు 60-70 లక్షల ఎకరాలు వుంటుందని ఓ అంచనా.

పరిరక్షణకు కొన్ని చర్యలను సూచించింది. ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతాంగ కుటుంబాలకు నష్ట పరిహారాన్ని ప్రకటించింది. బాధిత కుటుంబాలకు మనో స్థైర్యాన్ని యిచ్చేందుకు ఈ నష్టపరిహారం అని, ఈ మొత్తాలకు బడ్జెట్ కేటాయింపుల్లేకుండా వాటిని సమకూర్చుకునే బాధ్యత ఆయా జిల్లా కలెక్టర్లకే అప్పగించబడింది. సమస్యలతో సతమతమయ్యే రైతులకు ఆత్మస్థైర్యాన్ని యిచ్చేందుకు హెల్ప్ లైన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా, రైతాంగ రుణాలపై మారటోరియం, సంస్థాగత రుణ మంజూరికై ఏర్పాటు, లక్ష రూపాయల లోపు రుణం పొందిన వారికి స్టాంపు డ్యూటీ నుండి మినహాయింపు, విత్తన సరఫరా బాధ్యత, పంటల భీమా పథకం, విత్తనాలు, ఎరువుల నాణ్యతల పరిశీలనకై ప్రయోగశాలల ఏర్పాటు, నూనె గింజల దిగుమతులపై సుంకాల ఏర్పాటు ద్వారా నూనె గింజల ఉత్పత్తులను ప్రోత్సహించడం, గత ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయాధికారుల నియామకాలను చేపట్టడం, నీటి పారుదల సౌకర్యాల మెరుగుదలకై నూతన ప్రాజెక్టులను ప్రోత్సహించడం వంటివి ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన చర్యలు.

మరోవైపు ఇంత వరకూ రాష్ట్రంలో వున్న వాస్తవ వ్యవసాయ దార్ల గుర్తింపే సక్రమంగా లేదని జయతి కమిషన్ ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. స్థానిక సంస్థల సహకారంతో రెవెన్యూ శాఖ వాస్తవ వ్యవసాయదార్లను గుర్తించాలని కమిషన్ సూచించింది. మాగాణి-మెట్ట సేద్యాలను గుర్తించాలి. 1999 లాండ్ రెవెన్యూ చట్టాన్ని సక్రమంగా అమలు పర్చాలి. వ్యవసాయదార్లందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలను అందివ్వాలి. ఆస్తి బదలాయింపు చట్టం ప్రకారం మహిళలను ఉమ్మడి పట్టాదార్లుగా గుర్తిస్తూ భూహక్కులను సంక్రమింపచేయాలని కమిషన్ సూచించింది. గిరిజన ప్రాంతీయుల భూ హక్కులను గుర్తించాలి. 1/70 చట్టాన్ని అమలు పర్చాలి. గిరిజన ప్రయోజనాలకు ఆటంకంగా నిల్చిన వివాదాలను పరిష్కరించాలి. భూ యాజమాన్య సమాచారాన్ని భద్రపర్చాలని కమిషన్ సూచించింది.

కమిషన్ కౌలుదారీ వ్యవస్థను సైతం కూలంకషంగా పరిశీలించి తగు సూచనలను చేసింది.

కౌలుదార్లను సేద్యపు దార్లుగా గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని నొక్కి చెప్తూ, వారికీ పాసు పుస్తకాలను జారీ చేయాలని కమీషన్ సూచించింది. కౌలుదార్ల పాస్ పుస్తకాలను రుణ మంజూరీ సంస్థలు గుర్తించాలని సూచించింది. కౌలుదార్లు సైతం భూ యజమానుల మాదిరిగానే వివిధ ప్రయోజనాలకు లబ్ధిదార్లుగా చెయ్యాలని సూచించింది.

భూ పంపిణీ

ప్రభుత్వ నియంత్రణలో వున్న అదనపు భూ వనరులను గుర్తించే ప్రయత్నం ప్రభుత్వం చేయాలని ముందుగా సూచించింది. అక్రమ కబ్జాలను గుర్తెరిగి, వారినుండి ప్రస్తుత విలువనైనా వసూలు చేయాలని, వ్యర్థంగా వున్న భూ వసతిని గుర్తించి భూ వసతిలేని నిరుపేద వర్గాలకు పంపిణీని చేపట్టాలని కమిషన్ సూచించింది.

ఒకవైపు దేవాదాయ శాఖ లోనే లక్షలాది ఎకరాల భూవసతి నిరుపయోగంగా పడివుందని స్వయానా ప్రభుత్వమే అంగీకరిస్తున్న పక్షంలో, భూ పంపిణీ సమస్యపై కమిషన్ సరైన దృష్టి నిలపక పోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. వివిధ ఖాతాల్లో అంటే దేవాదాయ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన భూములు, అటవీ శాఖ భూములు, ప్రభుత్వం ప్రకటించిన మిగులు భూములు, ఆంధ్ర కోస్తా ప్రాంతంలో వున్న తీరప్రాంత భూములు, ప్రభుత్వ బంజర్లు, అక్రమ కబ్జాలకు గురైన భూదాన్ భూములు, అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను ప్రభుత్వం సత్వరమే సేకరించి, భూమిలేని నిరుపేదలకు పంపిణీని చేపట్టాల్సి వుంది. పై నుదహరించిన అదనపు భూములు 60-70 లక్షల ఎకరాలు వుంటుందని ఓ అంచనా. యింతటి ప్రధాన అంశాన్ని అంచనా వేయడంలో కమిషన్ సక్రమ విధానాన్ని అనుసరించలేదని చెప్పక తప్పదు.

నీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు బదలాయింపుగా, అదే ప్రాజెక్టు ప్రాంతంలో

భూగర్భ జలవినియోగం విషయాన్ని ప్రస్తావిస్తూ, కమిషన్ భూగర్భ జల వినియోగంపై ప్రభుత్వ నియంత్రణ అనివార్యమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇందుకు రాష్ట్రంలో వున్న బోర్ బావులను రిజిస్ట్రేషన్ చేయడం అవసరమని పేర్కొంది. వాటర్‌షెడ్ కార్యక్రమాలు, లేదా బోర్ బావుల ఏర్పాటు విషయంలో కాంట్రాక్టు వ్యవస్థను దరిచేరనివ్వక, రైతుల నిర్వహణలోనే ఏర్పాటు చేయడం ద్వారా కొంత నియంత్రణను అలవర్చుకోగలరని కమిటీ సూచించింది.

నిర్వాసితులకు భూపంపిణీ చేపట్టాలని కమిషన్ సూచించింది. గ్రామ ప్రాంతాల్లో వ్యర్ధ భూములను గ్రామ సభల ద్వారా గుర్తించాలని, దేవాదాయ భూములను నిరుపేదలకు దీర్ఘకాలిక కౌలుకు యివ్వాలని కమిషన్ అభిప్రాయపడింది. వీరికి సేద్యానికి దోహదపడే ప్రాధమిక సహకారాన్ని ప్రభుత్వం అందివ్వాలనీ కమిషన్ నొక్కి చెప్పింది. అతి చిన్న కమతాలు మాత్రమే లభ్యమైన చోట సహకార సేద్య విధానాన్ని ప్రోత్సహించి, గ్రామీణులలో సమష్టి సహకార భావనకు దోహదపడాలని కమిషన్ సూచించింది.

రుణ సౌకర్యం పరిశీలన - సూచనలు

వ్యవసాయ రంగంలో రుణ సౌకర్య కల్పన వాణిజ్య లక్ష్యంతో గాక, సాంఘిక బాధ్యతగా చేపట్టాలని కమిషన్ అభిప్రాయపడింది. ఆయా ప్రాంతాల్లో వున్న మొత్తం రైతాంగాన్ని గుర్తించి వారికి కిసాన్ క్రెడిట్ కార్డులను అందచెయ్యాల్సి వుందని కమిషన్ సూచించింది. పట్టాదార్ పాస్ పుస్తకాల మాదిరిగానే కిసాన్ క్రెడిట్ కార్డులను స్వంత వ్యవసాయదార్లకు, కౌలుదార్లకు, గిరిజనులకు వర్తింప జేస్తూ, గ్రామ పంచాయితీ, స్వయం సహాయక బృందం, గ్రామ వ్యవస్థ, నీటిపారుదల కమిటీ, నీటి వినియోగదార్ల సంస్థల నుంచి ఏ ఒక్కరి ధృవీకరణ పైనన్నా లబ్ధి పొందేలా నియమాలను సవరించాలని కమిషన్ సూచించింది.

కమిషన్ సూచించిన మరో అతి ముఖ్యమైన సూచన ఏంటంటే, రాష్ట్రస్థాయి లేదా జిల్లా స్థాయి లేదా ప్రాంతీయ స్థాయి బ్యాంకు కమిటీల్లో తప్పనిసరిగా కర్షక ప్రతినిధులకు స్థానం కల్పించాలని సూచించింది. ప్రభుత్వ స్థూల వార్షికాదాయంలో వ్యవసాయరంగం నుంచి పొందుతున్న ఆదాయ శాతంకు సమాన స్థాయిలో ఈ రుణ పంపిణీ జరగాలన్నది మరో ముఖ్య సూచన. ప్రైవేటు బ్యాంకులు సైతం వ్యవసాయ రుణ పంపిణీని సాంఘిక బాధ్యతగా అమలుపర్చేలా చర్యలు తీసుకోవాలి. సాంఘిక పంట రుణాలు అందివ్వటంలోనూ, ధరావత్తు లేకుండా రుణ పంపిణీ చేపట్టడం లోనూ బ్యాంకులు వారి నిర్దేశిత నియమాలకు అనువుగా వర్తించాలి. బ్యాంకులు కేవలం పంటరుణాలకే పరిమితం కాకుండా, వ్యవసాయేతర అనుబంధ గొర్రెల పెంపకం, చేపల పెంపకం, కోళ్ళపెంపకం వంటి వృత్తులకు రుణ సహకారం అందివ్వాల్సి వుందని కమిషన్ సూచించింది. ప్రతీ 15 వేల గ్రామీణ జనాభాకు అందుబాటులో వుండేలా బ్యాంకులను ఏర్పాటు చేస్తూ, వ్యవసాయ రంగ నిపుణులు తమ సిబ్బందిలో వుండేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ తరహా సూచనలను పాటించని బ్యాంకు అధికార్లపై చర్య తీసుకోవడం తప్పనిసరని కమిషన్ హెచ్చరించింది. యింతటితో ఆగిపోకుండా తీవ్ర వర్షాభావ, కరువు ప్రాంతాల్లో తక్షణ సహకారం అందించేందుకు ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి వుందని కమిషన్ సూచించింది. పంటరుణాల్లో 25 శాతం ప్రత్యేక రాయితీగా యివ్వాలంది. సక్రమ చెల్లింపులకు రాయితీలను ప్రకటించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వడ్డీ మొత్తం అసలు మొత్తాన్ని దాటి పోరాదు. గ్రామీణ రుణ వ్యవస్థ మెరుగుదలకై గ్రామీణ బ్యాంకుల విస్తృతిని పెంచాల్సి వుందని కమిషన్ సూచించింది. సేద్యం నేడు జూదంగా మారిన నేపథ్యంలో పంటల భీమా పథకాన్ని ఉద్యానవన సేద్యంతో పాటు అందరికీ అమలు పర్చాలని కమిషన్ అభిప్రాయపడింది.

ఇక భూగర్భ జలవినియోగం విషయాన్ని ప్రస్తావిస్తూ, కమిషన్ భూగర్భ జల వినియోగంపై ప్రభుత్వ నియంత్రణ అనివార్యమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇందుకు రాష్ట్రంలో వున్న బోర్ బావులను రిజిస్ట్రేషన్ చేయడం అవసరమని పేర్కొంది. వాటర్‌షెడ్ కార్యక్రమాలు, లేదా బోర్ బావుల ఏర్పాటు విషయంలో కాంట్రాక్టు వ్యవస్థను దరిచేరనివ్వక, రైతుల నిర్వహణలోనే ఏర్పాటు చేయడం ద్వారా కొంత నియంత్రణను అలవర్చుకోగలరని కమిషన్ సూచించింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం వేలాదికోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులను కాంట్రాక్టర్లకు అప్పగించడంలో అత్యుత్సాహం ప్రదర్శించి, అవకతవకలు బహిర్గతమై అభాసుపాలైన వైనం మనముందు వుంది. వాస్తవంగా ఈ తరహా కాంట్రాక్టు పనుల్లో మూడొంతుల్లో ఒక వంతు అదనపు అంచనాలతో కాంట్రాక్టర్ల జేబులు నింపుకోవడం సర్వ సామాన్య విషయమన్నది అందరికీ తెలిసిందే. మరి ప్రాజెక్టు పనులను ప్రభుత్వమే చేపట్టడం ద్వారా నాణ్యతా విలువలను కాపాడుకోవడమే కాకుండా, వేలాదిమందికి ఉపాధిని సైతం కల్పించవచ్చు కదా. కానీ ప్రభుత్వం పనుల నిర్వహణ కాంట్రాక్టు వ్యవస్థను పెంచి పోషించేందుకు అన్నది సంస్కరణల అమలు నాటినుంచి గోచరిస్తున్న వాస్తవం.

ఇక విద్యుత్ సరఫరా విషయానికొస్తే రోజులో అవసరమైన కాలానికి విద్యుత్ సరఫరా నిరాటంకంగా సాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సాధ్యమైనంత మేరకు పగటి పూట 9 గంటల

కాలం విద్యుత్ సరఫరా అందివ్వాలని కమిషన్ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గ్రామీణ విద్యుత్ కనెక్షన్లను నియంత్రించాల్సి వుంది. నిర్ణీత గడువును ప్రకటించి, గడువు అనంతరం గుర్తించిన అక్రమ కనెక్షన్లను రద్దు చేయాలని కమిషన్ సూచించింది. విద్యుత్ పంపిణీ ప్రసార నష్టాలను నియంత్రించి పటిష్ట యాజమాన్య ధోరణులను అలవర్చాలన్నది మరో సూచన. దారిద్ర్య రేఖకు దిగువున వున్న అట్టడుగు వర్గాలకు నెలకు 50 యూనిట్ల విద్యుత్ వినియోగానికి ఉచిత విద్యుత్‌ను అందివ్వాలని కమిషన్ సూచించింది.

వ్యవసాయ పరిశోధన - విస్తరణ రంగాల్లో ప్రభుత్వం పరిశోధనలను చేపట్టి, ఉచితంగా వ్యవసాయదార్లకు అందివ్వాల్సిన నైతిక బాధ్యత వుందని కమిషన్ స్పష్టం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా ఉత్పన్నం కానున్న భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనేందుకు అనువుగా, రైతాంగాన్ని సంసిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కమిషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వ్యవసాయ రంగంలో వాస్తవ అవసరాలకు అనువుగా, విద్యార్థులకు అవసరమైన శిక్షణను యిచ్చేందుకనువుగా పాఠ్య ప్రణాళికలను రూపొందించాల్సి వుందని కమిషన్ పేర్కొంది.

రైతాంగానికి అవసరమైన ఎరువులను ప్రభుత్వమే విధిగా సరఫరా చేయాలని కమిషన్ స్పష్టం చేసింది. క్రిమిసంహారక మందులతో ఎరువులను ప్రభుత్వ హయాంలో సరఫరా చేయాలి. వీటి నాణ్యతలను గుర్తించడంతో తగు నైపుణ్యతను ఫీల్డ్ ఆఫీసర్లకు యివ్వాలనీ కమిషన్ సూచించింది. తగు విద్యార్హతలున్న వారినే ఈ ఎరువులు, క్రిమి సంహారక మందుల డీలర్లుగా నియమించాలి. జిల్లా స్థాయిలో భూసార పరిశోధనా సంస్థలను ఏర్పాటు చేసి రైతాంగానికి అవసర సేవలను అందివ్వాలని, యిందుకు అవసర బడ్జెట్ కేటాయింపులను చేపట్టాలని కమిషన్ సూచించింది.

అక్రమ క్రిమిసంహారక మందుల అమ్మకం దార్లపై కఠిన చర్యలను తీసుకునేందుకు అనువుగా క్రిమిసంహారక చట్టం 1968ని తగు రీతిన సవరించి, అమలు చేయాలని, క్రిమి సంహారక మందుల పరిశోధనాశాలలను ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది.

యిక వ్యవసాయ ఉత్పత్తుల ధరవరల స్థిరీకరణను కమిషన్ ప్రస్తావిస్తూ, అవసరమైతే దిగుబడుల ధరలను స్థిరీకరిస్తూ, జాతీయ ఉత్పత్తుల ధరలను కాపాడుతూ, రైతాంగ మనుగడకై ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి వుందని పేర్కొంది. రాష్ట్ర స్థాయిలో ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సేకరణా సమన్వయ కమిటీని ఏర్పర్చి, సేకరణకు ముందుగానే సేకరణా పరిమితులను నిర్దేశించుకోవడం అవసరమని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సేకరణా సమన్వయ కమిటిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధిత శాఖలు సభ్యులుగా వుండాలని కమిషన్ సూచించింది. భారత్ ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) రాగులు, జొన్నలు, వంటి కాయధాన్యాల సేకరణను చేపట్టాల్సి వుందని సూచించింది. వీటి ఉత్పత్తిని, వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సి వుందని సూచించింది. మార్కెట్ ధరలను స్థిరీకరించేందుకు ప్రత్యేక నిధిని (స్టెబిలైజేషన్ ఫండ్)ను ఏర్పాటు చేయాలని కమిషన్ పేర్కొంది.

దోపిడీ ధోరణులకు అనువుకాని మార్కెటింగ్ ఏర్పాట్లను ప్రభుత్వం, ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. ఈ సూచనను ప్రభుత్వమూ అంగీకరించింది. ఈ మార్కెట్లు మండల స్థాయిలో ఏర్పాటు చేయాలి. ఐదారు గ్రామాలకో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మార్కెట్ కమిటీలు రైతుల ఆధ్వర్యంలోనే నిర్వహింపబడాలని కమిషన్ సూచన. మార్కెట్ యార్డుల్లో రైతుల నుంచి వసూలు చేస్తున్న రుసుం మొత్తాలను, మార్కెట్ యార్డుల నిర్వహణకై వెచ్చించాలి. మార్కెట్ యార్డులను అత్యాధునిక సమాచార సాంకేతికతా ఏర్పాట్లతో ఆధునీకరించాలని, ముద్రించిన రసీదులను రైతులకిచ్చే స్థాయిలో ఈ ఆధునీకరణ సాగాలని కమిషన్ సూచించింది. ఉత్పత్తిదార్లకు, సేకరణ దార్ల కమీషన్ చెల్లింపులు పారదర్శకంగా సాగాలని, అనధికార కమీషన్ల రద్దు వంటి సూచనలను కమీషన్ ప్రతిపాదించింది.

వ్యవసాయేతర వృత్తులైన కోళ్ళ పెంపకం, గొర్రెల పెంపకం వంటి వృత్తులను ప్రోత్సహించాలి. రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థను సమర్ధవంతం చేయాలి. పెంపకం చేపడుతున్న కోళ్ళు, చేపలు, గొర్రెలకు అవసరమైన దాణా, ఆహార పదార్థాలను, తగు మోతాదు ఖరీదుకే అందివ్వాలని,వ్యవసాయేతరవృత్తులకు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది.

యిక చేనేత కార్మికుల విషయంలో వారికి అవసరమైన నూలును సరసమైన ధరకే సరఫరా చేయాలని, ఆప్కో సంస్థను అత్యవసరంగా ఆధునీకరిస్తూ, జనతా వస్త్ర పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, గత కాలపు హేండ్లూమ్ రిజర్వేషన్ ఏక్టును పునరుద్ధరించాలని కమిషన్ సూచించింది.

జయతీ ఘోష్ కమీషన్ సమస్య లోతుల్లోకి వెళ్ళి, పూర్తి అధ్యయనం జరిపి తన సలహాలను, సూచనలను ప్రభుత్వానికి నివేదించింది. కమిటీ సూచనలన్నింటిలో (ఒకటీ, అరా మినహా) సుమారుగా అన్నింటినీ ప్రభుత్వం ఆమోదిస్తున్నట్టుగా తన అంగీకారాన్ని వ్యక్తం చేసింది. ఇన్ని సూచనలనూ యిన్ని రకాల వ్యవస్థలను ప్రక్షాళనం చేస్తూ అమలు పర్చేందుకు మిగిలిన నాలుగేళ్ళ కాలం సరిపోదేమోననిపిస్తుంది. అదీ తక్షణం అమలును చేపడితే కాని వచ్చిన చిక్కంతా కమిషన్ నివేదికను డిసెంబర్ 2004లో సమర్పిస్తే ప్రభుత్వానికి పరిశీలించి సూచనలను ఆమోదించేందుకు సుమారు మూడు నెలల కాలం పట్టింది. మరి సూచనలు అమల్లోకి రావాలంటే ఎంత కాలమన్నది ప్రశ్నే! ❑

అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ - రెండో అంకం

- ఎన్. వేణుగోపాల్

'రానున్న ఎన్నికలలో చంద్రబాబు అధికారంలోంచి దిగిపోయి. రాజశేఖర రెడ్డో మరొకరో అధికారంలోకి వచ్చినా, చిన్నా చితకా పార్టీల సంకీర్ణం అధికారానికి వచ్చినా ప్రపంచ బ్యాంకు సంస్కరణల ప్రమాదం, ఆంధ్రప్రదేశ్‌ను అమ్మకానికి పెట్టే ప్రమాదం పూర్తిగా రద్దయిపోదు' అని 1999 ఎన్నికలకు ముందు ఆగస్ట్‌లో నేను ప్రచురించిన 'అమ్మకానికి ఆంధ్రప్రదేశ్' ముందుమాటలో రాశాను. ఆ ఎన్నికలలో కూడ చంద్రబాబు నాయుడే తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, 1999 డిసెంబర్‌లో వెలువడిన అదే పుస్తకం రెండో కూర్పు ముందుమాటలో 'చంద్రబాబు విజయం ఆర్థిక సంస్కరణల క్రమానికి ప్రజల మద్దతు ఉన్నదనడానికి సూచిక కాదు. తెలుగుదేశం కాక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉన్నా ఆర్థిక సంస్కరణల క్రమం అమలవుతూ ఉండేదే' అని రాశాను.

ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో, ప్రపంచ బ్యాంకు ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించడంలో...

ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో, ప్రపంచ బ్యాంకు ఆదేశాలను ఔదల దాల్చడంలో తెలుగుదేశానికీ, కాంగ్రెస్‌కూ (ఆ మాటకొస్తే అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలకూ) ఏమీ తేడా లేదనేది గత పదిహేను సంవత్సరాల అనుభవం నేర్పుతున్న పాఠం.

అయినా డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ - తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఇంత వేగంగా ప్రపంచ బ్యాంకు పాలనలోకి వెళ్ళిపోవడం కొంచెం ఆశ్చర్యంగానే ఉంది. తెలుగుదేశం పాలనాకాలంలో రాజశేఖరరెడ్డి గాని, ఆయన మంత్రివర్గ సహచరులలో కొందరు గాని ప్రపంచ బ్యాంకుకు, దాని ఆదేశాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు ఈ ఆశ్చర్యానికి కారణం. తాము చేసిన వ్యాఖ్యలను వారు అంత త్వరగా మరచిపోగలిగారా అనే సందేహం అందుకు కారణం.

ప్రతి పక్షనాయకుడుగా రాజశేఖర రెడ్డి 1999-2004 మధ్య కాలంలో ఎన్నో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకు నాయకత్వం వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అస్తవ్యస్త రాజకీయార్థిక విధానాలకు బాధ్యత ప్రపంచ బ్యాంకు నిర్దేశిత ఆర్థిక విధానాలదే నన్నారు. చంద్రబాబును ప్రపంచ బ్యాంకు జీతగాడిగా, బానిసగా అభివర్ణించారు. అంధ్రప్రదేశ్ అప్పులలో అర్జెంటీనా దిశగా సాగుతున్న దన్నారు. ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు అప్పుల నుంచి వైదొలగా లన్నారు. అప్పులు తీసుకున్నా, అవమానకరమైన షరతులపై తీసుకోగూడదన్నారు. తాము అధికారంలోకి వస్తే అప్పులను, అప్పులకోసం కుదిరిన ఒప్పందాలను పునఃసమీక్షిస్తామని, అవమానకరమైన ఒప్పందాలతో కూడిన అప్పులను రద్దు చేస్తామని అన్నారు. ఈ ప్రకటనలన్నీ అప్పటి పత్రికలలోను, ప్రసార సాధనాల లోనూ వెలువడినవే. చివరికి శాసన సభా వేదిక మీద కూడ రాజశేఖర రెడ్డి ఈ ప్రకటనలన్నిటినీ పదే పదే చేశారు.

ఈ నేపథ్యంలో అధికారం చేపట్టినప్పుడు ప్రపంచ బ్యాంకుకు - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్యనున్న సంబంధం ఎంతోకొంత పునఃసమీక్షకు గురవుతుందని, ఎంతోకొంత మారుతుందని ఆశించడం అత్యాశకాదు. అందులోనూ ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు భిన్నంగా, ప్రపంచ బ్యాంకును అసంతృప్తి పరిచేలా రైతాంగానికి ఉచిత విద్యుత్తు, ప్రభుత్వ ఆస్పత్రులలో యూజర్ ఛార్జీల రద్దు వంటి కొన్ని నిర్ణయాలను కొత్త ప్రభుత్వం ప్రకటించడంతో ఆ ఆశలు నిజం కాబోతున్నాయనిపించింది.

అయితే రాజశేఖర రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ, కొనసాగుతున్న ప్రపంచ బ్యాంకు రుణాలను సమీక్షించడం జరగలేదు సరికదా కొత్త రుణాల కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కొత్త రుణాలలో అత్యంత కఠినమైన షరతులతో ఉండే వ్యవస్థాగత సర్దుబాట్ల రుణాలు కూడ ఉండడం ప్రత్యేకంగా గమనించాలి.

కాంగ్రెస్-తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఏడెనిమిది ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో నడుస్తున్న పథకాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ రూరల్ పావర్టీ రిడక్షన్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, ఆంధ్ర డిస్ట్రిక్ట్ పావర్టీ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్, ఎపి ఎకనమిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్ట్, ఎపి పవర్ సెక్టర్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్ట్, ఎపి స్టేట్ హైవేస్ ప్రాజెక్ట్, థర్డ్ ఎపి ఇరిగేషన్ ప్రాజెక్ట్ అనే ఈ కొనసాగుతున్న పథకాలలో ఎపి ఎకనమిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్ట్, ఎపి పవర్ సెక్టర్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్టు రెండూ కూడ వ్యవస్థాత్మక సర్దుబాటు రుణం (స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్‌లోన్) అని ప్రపంచ బ్యాంకు పిలిచే పరిధిలోవి. వ్యవస్థాత్మక సర్దుబాటు రుణం కేవలం వడ్డీ వసూలు చేసుకునే రుణం కాదు. రుణగ్రహీత ఏమేమి

చేయాలో, ఏమేమి చేయగూడదో రుణదాత శాసించే, క్రమబద్ధంగా పర్యవేక్షించే ఒప్పందం కింద రుణం. అంటే రుణగ్రహీత పాటించవలసిన రాజకీయార్థిక విధానాలను నిర్ణయించే రుణం. రుణ గ్రహీత తప్పనిసరిగా కొన్ని విధానాలను పాటించాలనే షరతుల మీద ఇచ్చే రుణం, మొట్టమొదట తయారయ్యే ప్రాజెక్ట్ ప్రతిపాదన లో, మధ్య మధ్య జరిగే అప్రైజల్ రిపోర్టులలో, రుణదాతకూ గ్రహీతకూ మధ్య రహస్యంగా జరిగే ఎయిడ్ మెమొరీలలో ఈ షరతులు విస్పష్టంగానే ఉంటాయి. ఈ షరతులు లేవనో, అవమాన కరంగా లేవనో ప్రతిపక్షాలకు, ప్రచారసాధనాలకు, ప్రజలకు చెప్పవచ్చుగాని ఆ షరతులు ఎంత కఠినమయినవో, అవమాన కరమయినవో ప్రభుత్వానికి, అధికారులకు స్పష్టంగానే తెలిసి ఉంటుంది. నిజానికి అవి కఠినమనయినవో, అవమానకర మయినవో కాకపోతే ప్రభుత్వం స్వయంగా వాటిని బహిరంగ పరిచి ఆ విషయం రుజువుచేయవచ్చు.

1997 నుంచి 2004 వరకూ కూడ అనేక వేదికల మీద అనేక సార్లు ఈ ఒప్పందాల గురించి, షరతుల గురించి అనుమానాలను

> తెలుగుదేశం పారనాకాలంలో ప్రపంచ బ్యాంకు రుణాలలో, ముఖ్యంగా ఎపి ఎకనామిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్టులో, భాగంగా వెలువడిన ఎజెండా ఫర్ ఎకనమిక్ రిఫార్మ్స్‌లో ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ మూసివేయాలని, ప్రైవేటీకరించాలని ఇచ్చిన ఆదేశాలలో ఎ.పి.ఎస్.ఆర్.టి.సి., సింగరేణిలను ప్రైవేటీకరించాల్సి ఉన్నప్పటికీ, ఆ పని రాజకీయంగా సున్నితమైనదని, కనుక వాయిదా వేయవచ్చునని ప్రపంచ బ్యాంకు రాసింది. తెలుగుదేశం పాలనలో ఆ విధంగా వాయిదాపడిన ఆర్టీసీ ప్రైవేటీకరణ కాంగ్రెస్-తెరాస పాలనలో అమలులోకి రాబోతోంది.

వ్యక్తం చేసిన రాజశేఖర రెడ్డి 2004 మే 14 తర్వాత గడిచిన ఏడాదిలో ఆ అనుమానాలను మళ్ళీ లేవనెత్తలేదు. ఇప్పుడు ఆ పత్రాలను చూసే హక్కు, అధికారం వచ్చినందువల్ల తాను ఇంతకాలం లేవనెత్తిన అనుమానాలు నిజమయినవో కావో ప్రజలకు వివరించే బాధ్యత కూడా తీసుకోలేదు. కొనసాగుతున్న ఎనిమిది పథకాలలో కనీసం అనుమానాస్పదమైన రెండు పథకాల పత్రాలన్నిటినీ బహిరంగ పరచడమో, ఆ రెండు పథకాలను సమీక్షించడమో చేయాలని కూడ ఆయన ప్రభుత్వం అనుకోలేదు.

కొనసాగుతున్న పథకాల పునఃసమీక్ష, అనుమాన నివృత్తి లేకపోవడం ఒక ఎత్తయితే, కొత్త ప్రభుత్వమే స్వయంగా కొత్తగా ప్రపంచ బ్యాంకు రుణాల కోసం, వ్యవస్థాత్మక సర్దుబాటు రుణాలకోసం వెంపరలాడడం మరొక ఎత్తు. పాత రుణాల సర్దుబాట్లలో మిగిలిపోయిన సర్దుబాట్లను కొనసాగించడానికి, పాత ప్రభుత్వం మిగిల్చిన షరతులను పాటించడానికి ఉత్సాహ పడడం మరొక ఎత్తు. గత ఏడాది పాలనలో రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఈ పనులన్నీ చేసింది. రైతాంగానికి ఉచిత విద్యుత్తు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో యూజర్ ఛార్జీల రద్దు వంటి చర్యల వల్ల ప్రపంచ బ్యాంకుకు కోపం వచ్చిందని గుర్తించి, ఆ కోపాన్ని పోగొట్టడానికి, ఆ సంక్షేమ చర్యలకు తూట్లు పొడవడం ప్రారంభించింది.

మొట్టమొదట, 300 మిలియన్ డాలర్ల (దాదాపు రు.1500 కోట్ల) ఎపి అర్బన్ రిఫార్మ్ అండ్ మునిసిపల్ సర్వీసెస్ ప్రాజెక్టు అనే పథకం ప్రతిపాదన ఎన్నికలకు రెండు నెలల ముందు పాత ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈలోగా ప్రభుత్వం మారడం వల్ల ఆ ప్రతిపాదననే జులై 2004లో కొత్త ప్రభుత్వం ముందు పెట్టడం జరిగింది. దానిమీద చర్చలు సాగి, ఒక ఒప్పందం తయారయి, ఆ ఒప్పందం మీద సంతకాలు జరిగే స్థితి మే 2005లో ఏర్పడింది.

ఈ చర్చలు జరిగే క్రమంలోనే రాష్ట్రప్రభుత్వం తాను అనుకున్న దారిలో నడవడం లేదని, సంస్కరణలకు దూరం పోతున్నదని, సంక్షేమ మార్గం పడుతున్నదని ప్రపంచ బ్యాంకు హెచ్చరించడం ప్రారంభించింది. ఇది కొనసాగితే పాత అప్పులలో మిగిలిపోయిన వాయిదాలు ఇవ్వబోనని, కొత్త అప్పులు ఇవ్వబోనని హెచ్చరికలు, బెదిరింపులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ను, మూసివేతను పర్యవేక్షిస్తున్న ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్‌కు నిధులు అందించే డిఎఫ్ఐడి మరోవైపు నుంచి ఈ బెదిరింపుల తతంగాన్ని సాగించింది. బ్రిటిష్ ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో ఒకటయిన డిఎఫ్ఐడి కూడా సామ్రాజ్యవాద, బహుళ జాతి సంస్థల ప్రయోజనాలు కాపాడడంలో ప్రపంచ బ్యాంకుకు తోడు దొంగే.

ఈ ప్రపంచ బ్యాంకు, డిఎఫ్ఐడి ఒత్తిడికి లొంగిపోయిన రాష్ట్రప్రభుత్వం ఈ రెండు సంస్థల ముందర తన నిజస్వరూపాన్ని, ఉద్దేశ్యాలను చెప్పుకుంటూ, తనను క్షమించమని, త్వరలోనే ఏలిన వారి షరతులను పాటిస్తానని దేబిరించడం ప్రారంభించింది.

ఈ దేబిరింపులకు కనికరించిన ప్రపంచబ్యాంకు 2005 మార్చ్ 31న విడుదల చేసిన 30927 నివేదికలో 'ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంస్కరణల క్రమం వేగం మందగించింది గాని దిశ మారలేదు' అని ఆమోదించింది. ఆ నివేదిక తర్వాతనే ఎపి అర్బన్ రిఫార్మ్ అండ్ మునిసిపల్ సర్వీసెస్ ప్రాజెక్ట్ పనులు వేగిరమయ్యాయి. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన ఆర్థిక సంస్కరణల కార్యక్రమాన్ని కొనసాగించే చర్యలన్నిటినీ వేగవంతం చేసింది.

ఈ కార్యక్రమంలో ప్రధానమయినది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రరోడ్డు

రవాణా సంస్థ ప్రైవేటీకరణ దిశగా చర్యలు తీసుకోవడం. తెలుగుదేశం పాలనాకాలంలో ప్రపంచబ్యాంకు రుణాలలో, ముఖ్యంగా ఎపి ఎకనామిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్టులో భాగంగా వెలువడిన ఎజెండా ఫర్ ఎకనమిక్ రిఫార్మ్స్‌లో ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ మూసివేయాలని, ప్రైవేటీకరించాలని ఇచ్చిన ఆదేశాలలో ఎ.పి.ఎస్.ఆర్.టి.సి., సింగరేణిలను ప్రైవేటీకరించాల్సి ఉన్నప్పటికీ, ఆ పని రాజకీయంగా సున్నితమైనదని, కనుక వాయిదా వేయవచ్చునని ప్రపంచ బ్యాంకు రాసింది. తెలుగుదేశం పాలనలో ఆ విధంగా వాయిదాపడిన ఆర్టీసీ ప్రైవేటీకరణ కాంగ్రెస్-తెరాస పాలనలో అమలులోకి రాబోతోంది.

సరిగ్గా తెలుగుదేశం పాలనలో విద్యుచ్ఛక్తి రంగం ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేయడానికి హితేన్ భయ్యా కమిటీ నియామకం జరిగినట్టుగానే, ప్రస్తుతం ఆర్టీసీ ప్రైవేటీకరణ కొరకు ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించడం జరిగింది. ఈ ఉన్నతాధికార సంఘం కూడ, మొదటి మెట్టుగా ఆర్టీసీని ఆరు కార్పోరేషన్లుగా విభజించాలని, పదమూడు వేలమందికి వి.ఆర్.ఎస్. ఇచ్చి తొలగించాలని, బస్ బాడీ బిల్డింగ్ యూనిట్‌ను మూసివేయాలని, రెగ్యులేటరీ కమిషన్‌ను నియమించాలని సరిగ్గా హితేన్ భయ్యా చేసిన లాంటి సూచనలే చేసింది. అంతర్జాతీయంగా జనాభాకు బస్సుల సంఖ్యకు ఉన్న నిష్పత్తిని ఉటంకించి, 80,000 బస్సులు కావలసి ఉండగా ఆర్టీసీకి 20,000 బస్సులే ఉన్నాయని ఒక వైపు అంటూ, స్వయంగా ముఖ్యమంత్రి 'సరిపోను బస్సులు లేనప్పుడు ఆర్టీసీకి గుత్తాధిపత్యం ఎందుకు' అని ఆర్టీసీకి వ్యతిరేక ప్రకటనలు చేశారు. ఈ క్రమం మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే రాజశేఖరరెడ్డి పాలనలో ప్రపంచ బ్యాంకు ఆదేశం ఆర్టీసీ విషయంలో సంపూర్ణంగా అమలు కాబోతున్నట్టు కనబడుతోంది.

మరోవైపు రైతాంగానికి ఉచిత విద్యుత్తు విషయంలో, ప్రభుత్వాసుపత్రుల్లో యూజర్ ఛార్జీల రద్దు వంటి అంశాలలో ప్రపంచ బ్యాంకును మళ్ళీ ప్రసన్నం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణలు, మార్పు చేర్పులు ప్రారంభించింది. ఉచిత విద్యుత్తు పథకానికి మార్పులు చేస్తూ అంతిమంగా ఆ పథకం ఎందుకూ పనికి రాకుండా చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు యూజర్ ఛార్జీలు తొలగించిన చేత్తోనే ప్రభుత్వ పశు ఆస్పత్రుల్లో పశు వైద్యానికి యూజర్ ఛార్జీలను ప్రవేశపెట్టింది.

మొత్తం మీద, ఈ పరిణామాలన్నిటికీ తార్కిక ఫలితంగా మే 17న ఢిల్లీలో ప్రపంచ బ్యాంకు భారత ప్రతినిధితో ముఖ్యమంత్రి జరిపిన సమావేశం రు.7,500 కోట్ల రుణాన్ని, అందులో భాగంగా వ్యవస్థాత్మక సర్దుబాటు రుణాన్ని, సంస్కరణల కార్యక్రమాన్ని కూడా చర్చించింది. ఇక జరుగనున్నది ఆంధ్రప్రదేశ్ రెండోసారి అమ్మకం. ❑

మీలోని రచయితను వెలికి తీయండి! వీక్షణం మీ రచన కోసం వేచి చూస్తోంది!

మీ చుట్టూ, మీ గ్రామంలో, మీ బస్తీలో, మీ పని స్థలంలో, మీరు పనిచేసే సంఘంలో ఏదో ఒక ఘటన మిమ్మల్ని కదిలిస్తుంది. మీలో ఆలోచనలు రగిలిస్తుంది. ఆ ఘటన వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మూలాల గురించి మీరు అన్వేషిస్తుంటారు. మీ ఆలోచనలను రాయండి. సరిగ్గా 'వీక్షణం' ఎదురు చూస్తున్నది అటువంటి క్షేత్ర నివేదికల కోసమే. 'వీక్షణం' ఆర్థిక, సామాజిక పత్రిక తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే ఆలోచనలకు, అన్వేషణలకు ఒక వేదిక. మీరు అట్టడుగు నుంచి, మీ అనుభవాల నుంచి పంపే నివేదికలు ఆ ఆలోచనల్లో, అన్వేషణల్లో భాగమే.

'వీక్షణం' ను ఇటు క్షేత్ర నివేదికల, అటు నిపుణుల విశ్లేషణల మేలు కలయికగా తీర్చిదిద్దాలని సంపాదకవర్గం ప్రయత్నిస్తోంది. మన జీవితాల మీద ప్రగాఢ ప్రభావం వేయగల అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పరిణామాల మీద నిపుణుల విశ్లేషణలు ఎంత అవసరమో, ఆ పరిణామాలు అట్టడుగు మనుషుల జీవన సరళిని ఎట్లా మారుస్తున్నాయో కింది నుంచి నివేదించడమూ అంతే అవసరం.

వీక్షణం మీ పత్రిక వీక్షణం మన పత్రిక

వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణ. ఆ అన్వేషణలో భాగం పంచుకోండి.

రచనలు పంపవలసిన చిరునామా:

సంపాదకుడు, వీక్షణం, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

ఏలేరు విచార(ణ)ం

– ఇతిహాస్

తీరుమారని వై.ఎస్. సర్కారుకు మరోసారి తలబొప్పి కట్టింది! కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పునరుద్దరించబడ్డ సోమశేఖర కమిషన్‌ను మరోసారి హైకోర్టు రద్దు చేసింది.

ఏలేరు కాల్వ భూముల పరిహారం కేసులో దాదాపు వందకోట్ల రూపాయల అవినీతి జరిగింది. అప్పటి చంద్రబాబు హయాంలో ప్రభుత్వ పెద్దలు కూడా ఇందులో కుమ్మక్కయ్యారనీ పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఎన్నో దశలలో జరిగిన ఏలేరు కుంభకోణం విచారణ 'కొండను తవ్వి ఎలుకను పట్టిన చందం'గా సాగింది. అప్పటి హైకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన జస్టిస్ సోమశేఖర కమిషన్ ఈ అవినీతి పురాణం గుట్టు విప్పేందుకు చాలా ప్రయత్నం చేసింది. వందలమందిని విచారించి, వేలాది ప్రభుత్వ డాక్యుమెంట్లు పరిశీలించిన కమిషన్ చివరికి చంద్రబాబునూ, కోడెల శివ ప్రసాదరావునూ కూడా ప్రశ్నించేందుకు ప్రయత్నించింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ ప్రధాన నిందితుడైన పీలా పోతినాయుడు అనే లాయర్ దాఖలు చేసుకున్న పిటిషన్ ఆధారంగా జస్టిస్ సుభాషన్ రెడ్డి బెంచ్ సోమశేఖర కమిషన్‌ను రద్దు చేసింది.

ఇప్పుడు వై.ఎస్. సర్కారుచే పునరుద్దరించబడ్డ సోమశేఖర కమిషన్‌ను మరోసారి సాంకేతిక కారణాలు చూపుతూ హైకోర్టు రద్దు చేసింది.

మన దేశంలో ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన ప్రజల దుస్థితిపై ఎంతో చర్చ జరుగుతున్న సమయమిది. ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్వాసితులకు చెల్లించే నష్టపరిహారం చివరికి చేరేది ఎవరికో! పరిహారం సొమ్ము బొక్కేందుకు రాజకీయ నాయకులూ, లాయర్లూ కలిసి ఆడే క్షుద్ర క్రీడలో ఎన్ని పచ్చి అబద్దాలుంటాయో ఏలేరు కుంభకోణం తీరుతెన్నులు పరిశీలిస్తే తెలుస్తాయి.

పీలా పోతినాయుడు అనే లాయరు భూములు కోల్పోయిన రైతుల పేరిట ఫోర్జరీ డాక్యుమెంట్లు పుట్టించి, భూముల విలువను అమాంతంగా పెంచేసి, స్థానిక సబ్‌జడ్జి,కొంతమంది రెవెన్యూ అధికారుల సహాయంతో కోట్లాది రూపాయలు కాజేశాడు. ఒక ఎకరా ఇరవైమూడు సెంట్ల భూమిలో పదివేల కొబ్బరి చెట్లున్నాయనీ, నలభైవేల నష్ట పరిహారాన్ని నలభై లక్షలకు పెంచేయడం, చెట్లు లేనిచోట ఉన్నాయని చూపించడం, చెట్ల విలువనూ, సంఖ్యనూ పది నుంచి వంద రెట్లకు పెంచేయడం ద్వారా పోతినాయుడు ముఠా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు కన్నం పెట్టింది.

ఈ అవినీతి గురించి పత్రికలలో రాగానే అయిష్టంగా మొదలైన ప్రభుత్వ విచారణ వివిధ రూపాలలో, అనేక ప్రభుత్వ శాఖల నేతృత్వంలో జరిగింది. చిన్న చేపలు దొరికాయి కానీ ఒక్క పెద్ద చేపా వలకు చిక్కకుండా 'సరైన సమయంలో సరైన చర్యలు' తీసుకుంది అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.

ఏలేరుపై ఐఎఎస్ అధికారి రే నేతృత్వంలో 1997 లో జరిగిన విచారణ చిన్న గుమస్తాలే స్కామ్‌కు కారణం అని తేల్చింది. ఆ తరువాత అదే సంవత్సరం జరిగిన సిబిసిఐడీ విచారణ కూడా పెద్దల్ని వదిలేసి చిన్న చేపల్ని పట్టబోయింది. చివరికి ప్రభుత్వం సిబిసిఐడికి అసలు ఈ కేసును దర్యాప్తు చేసే అధికారమే లేదని తేల్చింది. 1997 లోనే ఏర్పాటైన జస్టిస్ ఎస్.ఆర్. నాయక్ నేతృత్వంలోని కమిషన్ ఆయన అర్థాంతరంగా రాజీనామా చేయడంతో ముగిసింది. ఆయన రాజీనామాకు కారణం ప్రభుత్వ సహాయ నిరాకరణే అని గుసగుసలు వినిపించాయి. ఆగస్ట్ 1997లో హైకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సోమశేఖర కమిషన్ ఈ కుంభకోణం అనుపానులు తెలుసుకునేందుకు నిజాయితీగా ప్రయత్నించింది. అయితే ప్రధాన నిందితుడైన పీలా పోతినాయుడు వేసిన పిటీషన్ ఆధారంగా హైకోర్టుచే రద్దు చేయబడింది సోమశేఖర కమిషన్. తదనంతరం 1998 అక్టోబర్‌లో సి.ఆర్.పి.సి 340 కింద విశాఖ జిల్లా జడ్జి లక్ష్మణ రెడ్డి చేపట్టిన విచారణ కూడా అరెస్ట్ వారెంట్లు ఇచ్చే దశలో లక్ష్మణ రెడ్డి బదిలీతో నిలిచిపోయింది. ఇప్పుడు తాజాగా సోమశేఖర కమిషన్ మాజీ మంత్రులను కూడా విచారిస్తుండగా మరోసారి రద్దైంది.

ఇదీ మన దేశంలో అవినీతి దళారీలకు రాజకీయ నాయకులు కల్పిస్తున్న రక్షణ. కుంభకోణం జరిగిందని స్పష్టంగా అర్థమవుతున్నా సాంకేతిక కారణాలతో అడుగడుగునా విచారణలు అడ్డుకుని నేరగాళ్ళను రక్షిస్తున్నారు మన ఘనత వహించిన ఏలికలు. పారదర్శకత, నైతికత అంటూ నీతులు వల్లించిన గత ప్రభుత్వపు నిజస్వరూపం నేడు కాకపోతే రేపైనా బట్టబయలు కాక తప్పదు.

ఆలోచించవలసిన ఇంకో విషయం ఏమిటంటే కొత్త ప్రభుత్వ నిర్ణయాలకు హైకోర్ట్ వరసగా వేస్తున్న బ్రేక్‌లు. పులిచింతల ప్రాజెక్టు, ముస్లిములకు రిజర్వేషన్లు, సాగునీటిటెండర్లు,ఎక్సైజ్ పాలసీ ఇప్పుడు సోమశేఖరకమిషన్ విషయంలో కూడా ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఇది ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించి ఆచి తూచి నిర్ణయాలు తీసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది.

ఉమ్మడి మార్కెట్ కోసమే ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు వ్యాట్!

- వి. కొమరయ్య

విలువ ఆధారిత పన్నుల విధానం (వాల్యూ ఆడెడ్ టాక్స్ - వ్యాట్) 2005 ఏప్రిల్ 1 నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. వ్యాట్‌ను అమలులోకి తేవడానికి తన పాలనా కాలంలో ఉధృతంగా ప్రయత్నించిన భారతీయ జనతాపార్టీ అధికారంలో ఉన్న ఐదు రాష్ట్రాలలో ప్రభుత్వాలు వ్యాట్‌ను అమలు చేయడానికి నిరాకరించగా, ఇంతకాలమూ వ్యాట్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన వామపక్షాలు ఇప్పుడు సమర్థించాయి. ఇతర కారణాలవల్ల ఉత్తరప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు కూడా వ్యాట్ అమలును అడ్డుకోగా ఇరవై ఒక్క రాష్ట్రాలలో ఈ కొత్త పన్నుల విధానం అమల్లోకి వచ్చింది. చాలా రాష్ట్రాలలో వ్యాట్‌కు వ్యతిరేకంగా వ్యాపార వర్గాల ఆందోళన ఇప్పటికీ కొనసాగుతోంది.

యు.పి.ఎ.లో నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఏది ఏమైనా వ్యాట్‌ను అమలు చేసి తీరుతామని ప్రకటిస్తున్నాయి. వ్యాట్ అమలు వల్ల ఏయే ఏయే సరుకుల ధరలలో ఏయే రకాల మార్పులు వస్తాయో, ఇప్పటికే చాలా పరిశీలనలూ, విశ్లేషణలూ వెలువడ్డాయి. కాని వ్యాట్ గురించిన ఒక రాజకీయార్థిక విశ్లేషణ అవసరం ఇంకా తీరలేదు. ఈ వ్యాసం అందుకు ప్రయత్నిస్తుంది.

ఏ సమాజంలోనైనా పన్నుల విధానం అవసరముంటుంది. సామాజిక ఉత్పత్తి కార్యక్రమాలలో భాగం పంచుకోవడానికి అవకాశం లేని వర్గాలు పెరుగుతున్నకొద్దీ ఆ వర్గాల మనుగడకు అవసరమైన నిధులను సేకరించడానికి ప్రభుత్వాలు పన్నుల విధానాలను రూపొందిస్తాయి. కౌటిల్యుడు అర్థశాస్త్రం రాసేనాటికే, అంటే రెండు వేల ఐదువందల సంవత్సరాల క్రితమే పన్నుల విధానం సుసంఘటితంగా ఉంది. ఏయే వర్గాల మీద ఏయేరకాల పన్నులు విధించాలి,అలా పోగుపడిన నిధులను తిరిగి ఏయే వర్గాల మీద ఎలా ఖర్చుపెట్టాలి అనేవి ప్రభుత్వ పాలనాశాస్త్రంలోముఖ్యమైన అంశాలు.

సంపద పెరుగుతున్న కొద్దీ పాలనా విధానాలూ,పన్నుల విధానాలూ కూడా మారుతూ వచ్చాయి. సంపద పెరుగుతున్న కొద్దీ పన్ను పెంచాలని ఎక్కువ సంపద లేనివారి నుంచి అంత ఎక్కువ పన్ను వసూలు చేయకూడదని, అవసర మయితే వారి సంక్షేమంకోసం పన్నుల నిధులను ఖర్చు పెట్టాలనీ గత శతాబ్దంలో తయారైన సంక్షేమ అర్థశాస్త్రం చెబుతోంది.

అయితే ఎక్కువ సంపన్నుల నుంచి ఎక్కువ పన్నులూ, పేదల నుంచి తక్కువ పన్నులూ అనే పన్నుల విధానం ప్రధానంగా ఆదాయం మీద ఆధారపడింది. దానిని ప్రత్యక్ష పన్నుల విధానం అంటారు. సమాజంలో ప్రత్యక్ష ఆదాయం పొందే వారి సంఖ్య తక్కువగా ఉండవచ్చు, అంటే ప్రత్యక్ష పన్నుల సేకరణకు పరిమితులున్నాయి. దీనికి భిన్నంగా సొంతంగా ఆదాయం ఉన్నా లేకపోయినా ప్రతి మనిషీ ఎన్నో కొన్ని సరుకులూ, సేవలూ వినియోగిస్తూ ఉంటారు గనుక వినియోగం మీద పన్నువేస్తే ఎక్కువ రాబడి ఆర్జించవచ్చని ప్రభుత్వాలు ఆలోచించాయి.

తద్వారా ఉనికిలోకి వచ్చిన పరోక్షపన్నుల విధానం ప్రతి సరుకు అమ్మకం మీదా, కొనుగోలు మీదా పన్ను వసూలు చేస్తుంది. అంటే ఒకఇంట్లో ఇంటి పెద్ద తన నెలసరి వేతనం మీద చెల్లించే ప్రత్యక్ష పన్ను కన్నా, ఆ కుటుంబ సభ్యులు నలుగురైదుగురు వాడుకునే వేర్వేరు సరుకుల మీదా, సేవలమీదా చెల్లించే పరోక్షపన్ను ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. పైగా ఈ పరోక్ష పన్ను అదృశ్యంగా ఉండడం వల్ల దాని ఒత్తిడి కూడా ఎక్కువగా తెలియకుండా ఉంటుంది.

అయితే పరోక్ష పన్నుల పద్ధతిలో ఒక ప్రధాన సమస్య ఉంది. సమాజంలో ఏ సరుకైనా దానికదిగా అంతిమ వినియోగ సరుకు కాదు. ఒక సరుకునుపయోగించి మరొక సరుకును తయారు చేయవచ్చు. అప్పుడు ఏ సరుకు మీద పన్ను వసూలు చెయ్యాలనే సమస్య తలెత్తుతుంది. ఉదాహరణకు ఒకరు తమ వినియోగం కొరకే గోధుమలను కొనుక్కోవచ్చు, మరొకరు ఆ గోధుమలను కొని వాటిని రవ్వగానో, పిండిగానో మార్చి అమ్మవచ్చు. మరొకరు ఆ రవ్వనో, పిండినో కొని ఉప్మాగానో, రొట్టెగానో అమ్మవచ్చు. ఇక్కడ ఏ అమ్మకం మీద పన్ను విధించాలి? ఒక సరుకు ఇలా మూడు, నాలుగు రూపాలు మార్చుకున్నప్పుడు ప్రతిచోటా పన్ను విధిస్తూ పోవడం దుబారా కాదా? అన్యాయం కాదా? ఈ ప్రశ్నలు చాలా కాలంగా వినబడుతున్నవే.

ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పడమనే పేరుమీద, అనేకచోట్ల పన్నులు విధించే పద్ధతిని తొలగించడానికనే పేరుమీద ప్రభుత్వం వ్యాట్ అనుకూల వాదనలను ముందుకు తెస్తోంది. పైకి చూడడానికి చాలా సరైన వాదనలుగా కనబడే ఈ వాదనల ప్రకారం ఒక సరుకు ప్రయాణంలో ఎన్ని మజిలీలుంటే అన్ని మజిలీలలో

పన్ను విధించే బదులు ప్రతి మజిలీలోనూ అంతకు ముందు మజిలీ నుంచి తనవరకూ చేసిన ప్రయాణం మీద మాత్రమే పన్ను విధించడం జరుగుతుంది. అంటే ఒక వస్తువు మారకంలో ఒకరి చేతి నుంచి ఇంకో చేతికి మారేలోపు అదనంగా చేరిన విలువ మీద మాత్రమే పన్ను చెల్లించాల్సి ఉంటుంది, లేదా కొత్త మజిలీలో మొత్తం పన్ను చెల్లించినా పాత మజిలీలో చెల్లించిన పన్ను రాయితీ వస్తుంది.

సైద్ధాంతికంగా చూసినపుడు చాలా సమర్థనీయమైన వాదనగా కనబడుతున్న ఈ వాదనను మరికొంత లోతుగా పరిశీలిం చాలి. పన్నుల విధానంలో డబుల్ టాక్సేషన్, మల్టిప్లిసిటీ (రెండు చోట్ల గాని అంతకంటే ఎక్కువ చోట్లగాని పన్ను చెల్లింపు) ఉండ కూడదని అర్థశాస్త్రవేత్తలు ఎంతో కాలంగా వాదిస్తున్నప్పటికీ పట్టని ప్రభుత్వం హఠాత్తుగా ఇప్పుడు ఎందుకు ఇంత ఉత్సాహం కనబరుస్తోంది?

ప్రపంచవ్యాప్తంగా 1960ల నుంచీ వ్యాట్ అమలు ప్రయత్నాలు మొదలయ్యాయి. 1960ల్లో బ్రెజిల్ ఇటువంటి ఈ పన్నుల విధానానికి నాంది పలికింది. 1970లలో మరికొన్ని దేశాలు ఆ విధానాన్ని అమలు చేశాయి.

ఇప్పటికి ప్రపంచంలో నూట ముప్పై దేశాలలో ఈ విధానం అమలులో ఉంది. ఐతే భారతదేశం వంటి విభిన్న జాతుల, భాషల, ప్రాంతాల, వ్యాపార విధానాల దేశంలో ఇటువంటి మూకుమ్మడి విధానం అమలు చేయడం సాధ్యమవుతుందా? ఒకవేళ సాధ్యమయినా ఏయే మార్పులు చేర్పులతో దాన్ని అమలు చేయాలి అనే ఆలోచనలు లేకుండా భారతప్రభుత్వం 1990ల మధ్య భాగం నుంచీ వ్యాట్ అమలుకోసం వెంపర్లాడుతోంది.

ఇందుకు ఏకైక కారణం నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా దేశంలో వ్యాట్ అమలు చేయవలసిందిగా ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఆదేశం. ఆ ఆదేశం అందిన నాటినుంచీ భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలూ ఎన్ని ఆటంకాలెదురైనా వ్యాట్‌ను యథాతథంగా అమలు చేయడం సాధ్యం కాదని తెలిసివస్తున్నా స్వామి భక్తితో మునుముందుకే సాగిపోతున్నాయి. ఈ మధ్యలో ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాలు చెప్పుకునే సిద్ధాంతాలు మారినా, వ్యాట్ అమలు ప్రయత్నం మాత్రం యధావిధిగా సాగుతోంది.

1995లోనే అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను పిలిచి రాష్ట్రస్థాయి వ్యాట్ అమలు గురించి చర్చించారు. ఆ తరువాత దేవెగౌడ, ఐ.కె.గుజ్రాల్ ప్రభుత్వాలలోనూ ఆ పని యధావిధిగా సాగింది. చివరికి 1999లో భారతీయ జనతా పార్టీ నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా మళ్ళీ ఒక ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి, మార్క్సిస్టు పార్టీ అర్థశాస్త్రవేత్త అసిమ్‌కుమార్ దాస్ గుప్తా నేతృత్వంలో ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించారు. ఈ సంఘం 2005 జనవరిలో సమర్పించిన శ్వేతపత్రం ఆధారంగానే ఇవాళ వ్యాట్ అమలులోకి వస్తోంది.

అంటే భారతీయ జనతాపార్టీ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు)దాకా అన్ని పార్లమెంటరీ రాజకీయపక్షాలకూ వ్యాట్ అమలులో హస్తం ఉంది. ఒకవైపు ప్రపంచ బ్యాంకు ఒత్తిడీ, మరోవైపు అన్ని రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం కలగలసి వ్యాట్‌కు అనుకూలంగా ప్రజల మద్దతు కూడగట్టేందుకు వాదనలు తయారుచెయ్యడం మొదలయ్యింది.

వ్యాట్ వల్ల పన్నులను హేతుబద్ధం చేయడం సాధ్యమవుతుందనీ, సరుకుల ధరలు తగ్గుతాయనీ, పన్నుల విధానంలో పారదర్శకత వస్తుందనీ, రాష్ట్రాల మధ్య పోటీ తగ్గుతుందనీ, ఆదాయం పెరుగుతుందనీ వ్యాట్‌కు సమర్థనలు చెపుతున్నారు. కానీ ఈ సమర్థనలన్నీ కుంటిసాకులో, అబద్ధాలో, వక్రీకరణలో తప్ప వాస్తవాలు కావు.

కొన్ని సరుకులను మినహాయించడం, కొందరు అమ్మకం దార్లు వ్యాట్ పరిధినుంచి మినహాయింపు పొందేటట్టూ, కొందరు టర్నోవర్ టాక్స్ కడితే చాలునన్నట్టూ నియమాలు విధించడం వల్ల పన్నుల విధింపు హేతుబద్ధత సాధ్యంకాదు. ఒక టర్నోవర్ టాక్స్ వ్యాపారి, మరొక వ్యాట్ వ్యాపారి పక్క పక్క దుకాణాలలో ఒకే సరుకును అమ్మేటప్పుడు ఆ సరుకుల ధరలలో ఉండే తేడాలలో హేతుబద్ధత ఏమీ ఉండదు.

ఇక వ్యాట్ వల్ల సరుకుల ధరలు తగ్గుతాయనే మాట కూడా నిజంకాదు. ఎందువల్లనంటే గతంలో అమ్మకం పన్ను తక్కువగా ఉన్న సరుకుల మీద ఎక్కువ వ్యాట్ అమలవుతోంది. అందువల్ల ఆ వస్తువుల ధరలు తగ్గవు సరికదా పెరుగుతాయి. మరోపక్క అమ్మకం పన్ను ఎక్కువగా ఉండి ఇప్పుడు వ్యాట్ తగ్గినప్పటికీ అది వినియోగదారుల దాకా చేరుతుందనే నమ్మకం లేదు.

పై రెండు కారణాలవల్లా వ్యాట్ పారదర్శకంగా ఉండడం సాధ్యం కాదు.

రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశాలలో రాష్ట్రాల మధ్య పోటీని నివారించాలనే నీతి వాక్యాలు ఎన్ని పలికినప్పటికీ రాష్ట్రాలు పరిశ్రమలనూ, పెట్టుబడులనూ ఆకర్షించడం కొరకు తమ పన్నుల విధానంలో మార్పులు చేస్తున్నాయి. రాయితీలు ప్రకటిస్తున్నాయి. పన్నులకు సెలవులు ప్రకటిస్తున్నాయి. వ్యాట్ ఈ పరిస్థితిని మార్చబోదు.

(మిగతా 49వ పేజీలో)

భారత రక్షణ విధానం సవ్యంగానే ఉందా?

- దిగుమర్తి నరసింహారావు

క్షిపణుల పరీక్షకు ఎఫ్-16 యుద్ధ విమానాలు అవసరం లేదు అన్న నినాదంతో వీటికి వ్యతిరేకంగా భారత మాజీ నౌకాధిపతి అడ్మిరల్ రామ్‌దాస్ మే 11వ తేదీన ఒక ఉద్యమాన్ని ఆరంభించారు. ఇది చాలా ముందు ఆలోచనతోటి సూత్రబద్ధమైన భారత దేశ రక్షణ విధానానికి మద్దతుగా తీసుకున్న నిర్ణయం అనివేరే చెప్పనవసరం లేదు. అంతకన్నా ఆనందించవలసిన విషయం, మన సైన్యాధిపతులు, కొత్తరకం ఆయుధాలు, నవీన ఆయుధాల కోసం తహతహలాడకుండా, భారతదేశ రక్షణ అవసరాన్ని దృష్టిలోపెట్టుకొని, జాతీయ స్వాతంత్ర్యోద్యమంలో ఆవిర్భవింపబడిన విదేశ నీతి, స్వాతంత్ర్యం సాధించిన తరువాత, మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తమ పదిహేడు సంవత్సరాల కాలంలో రూపొందించిన రక్షణ విధానానికి అనుగుణంగా ఆలోచించడం.

ఏ దేశ రక్షణ విధానమైనా, ఆ దేశ విదేశాంగ విధానంపై కొంతవరకు ఆధారపడివుంటుంది. సామ్రాజ్య కాంక్షలేకుండా పొరుగు దేశాల భూభాగాల్ని హరించాలన్న దురుద్దేశం లేని భారత దేశం వంటి శాంతి కాముక దేశాలు, వీటి రక్షణ విధానాన్ని కేవలం యితరులు, ఏ కారణాన్నైనా దేశం మీదకు దండెత్తి వస్తే, దేశ సరిహద్దులను, దేశ సార్వభౌమాధికారానికి ఎటువంటి అడ్డంకులు రాకుండా కాపాడుకోడానికి రూపొందించుకుంటాయి. అలా కాకుండా, యితర దేశ భూభాగాల్ని కబళించడానికో, లేక పొరుగు దేశాలు చిన్నవి, బలహీనమైనవి అయితే వాటిని అదిరించి, బెదిరించి, వాటి ఆంతరంగిక విధానాలలో జోక్యం చేసుకునే ఉద్దేశంతో సైనిక బలగాన్ని, ఆయుధాగారాన్ని పెంచుకుంటూ పోతాయి. దీనికి 19వ శతాబ్దంలో బ్రిటిష్, ఫ్రెంచి, డచ్ సామ్రాజ్యాలు, 21వ శతాబ్దంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు చక్కని ఉదాహరణ. అయితే రెండు విపరీతాల మధ్య చాలా దేశాలు వున్నాయి. వీలైతే పొరుగు దేశ భూభాగాన్ని కాజేయడం, లేకపోతే శాంతి మంత్రాన్ని పఠించటం. అయితే విదేశాంగ విధానం, అంతర్గత రాజకీయ, ఆర్థిక విధానాలపై కొంతవరకు ఆశ్రయించుకొని వుంటుంది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవిస్తూ, వ్యక్తి స్వాతంత్ర్యం, సమాజ శ్రేయస్సుల మధ్య సఖ్యత కుదుర్చుతూ వీలైనంతవరకు బడుగు వర్గాలు, శ్రామికులు, పెత్తందార్లు, పారిశ్రామిక ధనికవర్గాల దోపిడీకి గురికాకుండా వారిని రక్షించే పథంలో దేశీయ విధానాలను మలచ బోయే ప్రభుత్వ లక్ష్యాలకు, నిరంకుశ, వ్యక్తిగత పరిపాలన సాగించే పరిపాలకుల విధానాలకు ఎక్కడా పోలిక వుండదు.

అందుచేత దేశ అంతర్గత విధనాలపై, విదేశ విధానం, దానిననుసరించి రక్షణ విధానం ఆధారపడివుంటాయి. ఈ మూడింటి మధ్యన పొంతన వున్నప్పుడు, ఆ దేశం, రక్షణ, భద్రత క్షేమంగా వుంటాయి. ఈ దృక్కోణం నుంచి చూస్తే మన దేశ రక్షణ విధానం (డిఫెన్స్ పాలసీ) కొంత అస్తవ్యస్తంగా వుందేమోనని అనిపిస్తుంది. దీనికి ముఖ్యకారణం. మన రక్షణ విధానాలను, మన పొరుగుదేశాలు మన దేశం పట్ల అవలంబిస్తున్న వైఖరి ననుసరించి ఎప్పటికప్పుడు రూపుదిద్దుకుంటున్నది. కాని, ఒక సిద్ధాంత అవగాహనతో, ఒక సూత్ర ప్రాయంగా మౌలికంగా నిర్మాణం చేసుకొన్నది కాదు.

ఏవిధానమైనా పూర్తిగా వంగని రీతిగా బెట్టుసరిగా వుండరాదు. మారుతున్న జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల ననుసరించి కొంచెం చేర్పులు మార్పులు ఉంఢటం సహజం. అయితే మన రక్షణ విధానం ప్రధానంగా బలహీన పడింది దేశం స్వాతంత్ర్యం సాధించిన తరువాత 1948లో జమ్ము కాశ్మీరు సంస్థానాన్ని బలవంతంగా పాకిస్తాన్‌తో చేర్చుకోడానికి, దుండగుల రూపంలో పాకిస్థాన్ సైనికులు కాశ్మీరు లోయను ఆక్రమించుకునే ప్రయత్నాన్ని తిరగగొట్టడానికి కాశ్మీరు రాజు, తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన తదుపరి, భారత సైన్యాలు దుండగులను వెంటతరిమాయి. అయితే ఆదర్శవాది అయిన భారత ప్రధాని నెహ్రూ ఆ దుండగులను కాశ్మీరు రాష్ట్రం సరిహద్దు దాటే వరకు తరిమి వేయకుండా పాకిస్తాన్ భారతదేశంలో భాగమైన కాశ్మీరుపై దురాక్రమణ చేస్తున్నదని ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేయడంతో, భద్రతా మండలి వెంటనే రెండు దేశాలని యుద్ధవిరమణ చేయాలని తీర్మానించడంతో కాశ్మీరులో కొంతభాగం పాకిస్తాన్‌కు చెందిన దుండగుల ఆక్రమణలో వుండిపోయింది. తదుపరి ఆ ప్రాంతాన్ని పాక్ ఆధీనంలో వున్న కాశ్మీరుగా వ్యవహరించడం జరుగుతున్నది. అది మూల స్థానంగా పెట్టుకొని అప్పటినుంచి యింతవరకు భారతదేశంలోవున్న కాశ్మీరులో లోయలోని ప్రాంతంపై కొంత విరామం యిచ్చి, పాకిస్తాన్‌లోని తీవ్రవాద సంస్థలకు చెందిన మిలిటెంట్లు, టెర్రరిస్టులు దాడులు జరుపుతూనే వున్నారు. అందుచేత ప్రధానంగా, ఈ మిలిటెంట్ల దాడులు రావణాసురుని కాష్టం లాగా ఎల్లప్పుడూ కొనసాగకుండా, వీటిని పకడ్బందీగా ఎదుర్కోడానికి సరిహద్దు దళాలను భారత ప్రభుత్వం ఉపయోగిస్తున్నది. భారత దేశ రక్షణ విధానంలో యిది ముఖ్య భాగం.

భారతదేశ రక్షణ విధానం 1962లో మరో మలుపు తిరిగింది. చైనాతో కలిసి బాండుంగులో ఆఫ్రికా - ఆసియా దేశాల సమావేశం జరిపి అందులో "పంచశీల" సూత్రాన్ని రూపొందించిన తరువాత, చైనాతో దేశ ఉత్తర, ఈశాన్య సరిహద్దులో ఎలాంటి పేచీ వుండదన్న భావం కలిగింది. అయితే టిబెట్టు చైనా దేశం అధీనంలో దాని సార్వభౌమాధికారంతో చారిత్రకంగా వుందని, చైనా బలహీనంగా వున్నప్పుడు దలైలామా, తానే ఆదేశ అధినేతగా ప్రవర్తిస్తున్నారని, ఆయన చైనా ఆధిపత్యాన్ని గుర్తించాలని చౌ-ఎన్-లై ప్రభుత్వం డిమాండ్ చేసింది. కాని దానికి అంగీకరించకుండా దలైలామా, భారతదేశంలో తలదాచుకోడానికి భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించగా, నెహ్రూ అందుకు అంగీకరించారు. దలైలామా చాలా ధనాన్ని, బంగారాన్ని గాడిదల మీద వేసుకొని హిమాలయాలు దాటి భారత దేశంలో ప్రవేశించారు.

ఈ సంఘటన చైనా పాలకుల్లో కొంత అసంతృప్తిని కలిగించింది. దీని పర్యవసానవే చైనా సేనలు 1962లో అక్సాయిచిన్ ప్రాంతంలో భారతదేశ ఈశాన్య సరిహద్దు దాటి భారతదేశంలో కొంత దూరం ప్రవేశించాయి. చైనా నుంచి ఎలాంటి అవాంతరం రాదనుకున్న నెహ్రూను ఈ సంఘటన కలవరపరిచింది. భారత సైన్యాలు కొంత వెనక్కు రావలసివచ్చింది. అయితే వారం రోజుల పోరాటం తర్వాత చైనా సైన్యాలు భారతదేశం ప్రాంతం నుంచి ఉపసంహరించబడ్డాయి. అప్పటినుంచి భారత చైనా సంబంధాలలో కొంత శీతల వాతావరణం ఏర్పడింది. అలా సరిహద్దు దాటిరావడానికి చైనా చెప్పిన వాదం, భారత చైనా సరిహద్దుగా వాడుకలో వున్న మాక్‌మోహన్ రేఖ, చైనా బలహీనంగా వున్నప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యం చైనాపై రుద్దిందని, దానిని తాము అంగీకరించడం లేదని తెలపడానికేనని తన సరిహద్దు దురాక్రమణ సమర్థించుకొంది.

అందుచేత భారత చైనా సరిహద్దును, రెండు దేశాల అంగీకారంతో తిరిగి రూపొందించవలసిన పరిస్థితి ఏర్పడింది. తరువాత రెండు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించిన సంప్రదింపులు ప్రారంభించినా ఏభై సంవత్సరాలు గడిచినా ఈ సంప్రదింపులు చురుగ్గా సాగలేదు. 1988లో రాజీవ్ గాంధీ చైనా సందర్శించినప్పుడు తిరిగి ఈ సంప్రదింపులు కొంత వేగాన్ని పుంజుకున్నాయి. ఈ మధ్యన చైనా ప్రధాని వెన్‌జియాబాల్ భారతదేశం సందర్శించినప్పుడు ఈ సరిహద్దు సంభాషణలు త్వరితగతిని పూర్తిచేసి, ఒక నిర్ణీత కాలపరిమితిలో సరిహద్దు ఒడంబడిక జరగాలన్న నేపథ్యంలో భారత ప్రధానితో సంభాషణలు జరిగాయి.

ఇంక మరో సరిహద్దు, బంగ్లాదేశ్‌తో ఇక్కడ సరిహద్దు భారతదేశ విభజన జరిగినప్పుడే భారతదేశం, తూర్పు పాకిస్తాన్ దేశాల మధ్య తీర్చిదిద్దబడింది. దానినే యిప్పుడు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుగా పరిగణించబడుతున్నది. అయితే యిక్కడ సమస్య సరిహద్దు సమస్యకాదు. బంగ్లాదేశ్ నుంచి చాలామంది అక్కడ భుక్తిలేక దొంగతనంగా సరిహద్దుదాటి, ఉత్తరాన అస్సామ్ రాష్ట్రంలోను తూర్పున పశ్చిమ బెంగాల్‌లోను త్రిపురలోను కాందిశీకులుగా ప్రవేశించడం జరుగుతున్నది. దీని వలన ఆ రాష్ట్రాలలో అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తున్నది. వారు మాట్లాడేది బెంగాలీ భాష అయినా వారిలో చాలామంది మహమ్మదీయ మతానికి చెందినవారు. ఈ విధంగా బంగ్లాదేశ్‌కు చెందిన ప్రజలు భారత దేశంలో చొరబడకుండా, సరిహద్దులో ముళ్లతీగ కంచె వేయాలని కొద్ది సంవత్సరాల క్రితం భారత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అలాగ ముళ్ళతీగ కంచె నిర్ణయం పట్ల బంగ్లాదేశ్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది.

హిమాలయయా పర్వతాల ప్రాంతంలో వున్న నేపాల్, భూటాన్ దేశాలతో భారత దేశానికి మధ్య సరిహద్దు వివాదం అంటూ ఏమీలేదు. కారణం ఈ రెండు దేశాలు 'లాండ్ లాక్డ్'. అంటే వాటికి తీర ప్రదేశం లేదు. అందుచేత వాటి వ్యాపారానికి, యితర అవసరాలకు ఈ దేశాలు భారతదేశం, దాని రేవుల మీద, కొంతవరకు భారతదేశ రైలు మార్గాల మీద ఆధారపడవలసి వుంది. వారు ఏ సందర్భంలోను భారత దేశంతో వైరం తెచ్చుకునే స్థితిలో లేరు. అయితే నేపాల్ రాజధాని ఖట్మండూ, వివిధ పశ్చిమ ఆసియాదేశాల గూఢచారి సంస్థలకు ఒక ముఖ్యమైన కేంద్రంగా వ్యవహరిస్తున్నది.

రక్షణకు, రాజకీయం, ఆర్థిక యితర వ్యవహారాలకు సంబంధించిన రహస్య సమాచారం భారత దేశంనుంచి, చైనా, పాకిస్తాన్ నుంచి సేకరించి, ఆ గూఢచారి సంస్థలు తమ దేశాలకు అందచేయడమే వారి ముఖ్య కార్యక్రమం. అందుచేత ఈ గూఢచారి సంస్థలకు చెందిన గూఢచారులు, వారి ఏజెంట్లు, భారతదేశ సరిహద్దులు అక్రమంగా దాటి దేశంలోకి ప్రవేశించకుండా, నిరోధించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆ మధ్యన భారత పార్లమెంటుమీద, కలకత్తాలోని అమెరికా దౌత్య కార్యాలయం మీద దాడి జరిపిన వారిలో ఎక్కువమంది నేపాల్ సరిహద్దు దాటి వచ్చినట్లు చెబుతున్నారు.

అన్ని విషయాలు సమగ్రంగా, లోతుగా ఆలోచిస్తే, భారత దేశ రక్షణ విధానం ప్రధానంగా సరిహద్దులను రక్షించుకోవడం, సరిహద్దులను దొంగతనంగా, రహస్యంగా యితర దేశస్తులు భారతదేశం అధికారుల అనుమతి లేకుండా ప్రవేశించడం అరికట్టడమే. అయితే ఈ సుదీర్ఘమైన సరిహద్దును, ముఖ్యంగా హిమాలయ ప్రాంతంలోనో లడక్ ప్రాంతాలలో సరిహద్దును రక్షించడం చాలా యిబ్బందులతో కూడుకున్న వ్యవహారం. ఇక్కడ సరిహద్దు దళాలతోపాటు సైన్యాలను కూడా కాపలా వుంచడం

మంచిది అని గత అనుభవం చెబుతున్నది. కార్గిల్ యుద్ధం నేర్పిన గుణపాఠం కూడా యిదే. భారతదేశం ఈశాన్య రాష్ట్రాలకు అటు మైన్మార్, కొంతవరకు చైనా సరిహద్దును అంటుకొని సరిహద్దు వుంది. మైన్మార్ దేశంతో ఎప్పుడూ భారతదేశం ఏవిధమైన రక్షణ విషయంలో యిబ్బంది పొందలేదు. కాని ఈశాన్యరాష్ట్రంలో కొన్ని తిరుగుబాటు వర్గాలు ఈ భారత మైన్మార్ సరిహద్దులను దాటి ఆదేశం కొండ ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పరచుకున్నట్లు వార్తలు అప్పుడప్పుడు పత్రికల్లో వస్తున్నాయి. అలాగే అస్సామ్ రాష్ట్ర ఈశాన్య పొలిమేరల్లో కూడా అప్పుడప్పుడు చైనా సైనికులు చెదురు మదురుగా భారతదేశంలో చొరబడి, తిరిగి వెళ్ళిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందుచేత ఈ ప్రాంతంలో అప్రమత్తంగా వుండడం చాలా అవసరం.

భారత దేశం ద్వీపకల్ప భాగానికి తూర్పున బంగాళాఖాతం తీరం పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు, పశ్చిమాన అరేబియా సముద్ర తీరంలో కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ వున్నాయి. అయితే తూర్పుతీరాన ఏదేశం దాడి చేసే ప్రమాదం లేదు. కాని పశ్చిమ తీరంలో కొన్ని సందర్భాల్లో, కాంచీనుంచి, గుజరాత్‌లోని కాండ్లా రేవు పట్నం వైపు పాకిస్తాన్ యుద్ధ నౌకలు అప్పుడప్పుడు గస్తీ తిరగటం గమనించడం జరిగింది. అందుచేత కోస్తా తీర సరిహద్దులను రక్షించడానికి, విశాఖపట్నం, కొచ్చిన్, ముంబాయి స్థావరాలుగా, తూర్పు, పశ్చిమ భారత దేశ గస్తీ నౌకాదళాలు బాధ్యతను తీసుకున్నాయి. అందుచేత కేవలం భారతదేశ ఉత్తర, వాయువ్య, ఈశాన్య, పశ్చిమ, తూర్పు సరిహద్దులను కాపాడడం, అంటే యితర దేశస్థులు అనుమతి లేకుండా భారత దేశ సరిహద్దులను దాటి దేశంలోకి దొంగతనం గాను, రహస్యంగాను ప్రవేశించడం, ఈ ప్రవేశం భూమార్గాల గుండా, సముద్ర మార్గాల ద్వారాను సాధ్యం. అందుకని అనుక్షణం ఈ సరిహద్దుల్లో, భద్రతా గస్తీదళాల నిఘావేసే వుంచాలి.

ఈ బాధ్యతలు నిర్వర్తించడానికి భారతదేశ భద్రతా గస్తీదళాలకు అవసరమైన ఆయుధాలు వుండాలి. అయితే ఈ ఆయుధాలు ఎటువంటివై వుండాలి? ఫిరంగులు, క్షిపణులు, భోఫోర్సు తుపాకులులాంటివి కేవలం సరిహద్దులను రక్షించడానికి అవసరం. సాధారణంగా ఈ భద్రతా గస్తీదళాలు ఉపయోగించేవి సైనికులు ఉపయోగించే చిన్న సైజు మర తుపాకులు (మెషీన్ గన్స్) ఎ.కె.47 తుపాకులు, హాండ్ గ్రెనేడ్స్ మున్నగునవి.

ఎందుకంటే సరిహద్దును రహస్యంగా, దొంగతనంగా చొచ్చుకుని వచ్చేవారు మామూలుగా సైనిక, యితర గూఢచారి సంస్థలకు చెందిన వారై వుంటారు. సైన్యాలు దొంగతనంగా చొచ్చుకొని రాలేవు. అందువలన ఈ భద్రతా గస్తీదళాలకు కావలసినవి సామాన్యమైన ఆయుధాలు, అవికూడా ఎక్కువ సంఖ్యలో అవసరం వుంటుంది. వారికి బాంబులు, అణు ఆయుధాలు లాంటి మారణాయుధాలు అవసరం.

అయితే శ్రీలంకలో యల్.టి.టి.ఇ. వారికి శ్రీలంక ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పోరాటం ఉధృతంగా సాగుతున్నప్పుడు, కొంతమంది యల్.టి.టి.ఇ. కార్యకర్తలు దొంగతనంగా తమిళనాడుచేరి, చెన్నై సమీపంలో శ్రీపెరంబూరు దగ్గిర ఎన్నికల సందర్భంలో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రసంగించడానికి వచ్చినప్పుడు ఆయనను చంపారు. అప్పటినుంచి దక్షిణ నుంచి భారత దేశానికి ప్రమాదం పొంచి వుందని సముద్ర తీరంలో గట్టి నిఘా ఏర్పాటు చేయబడింది.

ఈరోజుల్లో భూమార్గాన, సముద్ర మార్గానే కాకుండా ఆకాశ మార్గం గుండా కూడా విరోధులు ప్రవేశించడానికి అవకాశముంది. అందుచేత ఆకాశమార్గాన యుద్ధవిమానాలు భారత గగనతల సరిహద్దును అతిక్రమించి వచ్చిన సందర్భంలో వాటిని దూరం నుంచే కనుగొని, వాటిని తరిమి కొట్టడానికి భారత దేశ సరిహద్దులలో శక్తివంతమైన రాడార్లు నిర్మించడం జరిగింది.

రాడార్ ద్వారా రాబోయే ప్రమాదాన్ని కనుగొని, వాటిని తరిమికొట్టడానికి భారత వైమానిక దళానికి చెందిన ఫైటర్ విమానాలు వాటిని ఎదుర్కొని, వాటిపై కాల్పులు జరిపి సరిహద్దును రక్షించుతారు. అందుచేత దేశ సరిహద్దులను రక్షించడానికి సరిహద్దు భద్రతా సైన్యాలతోబాటు, నౌకాదళం, విమానదళం కూడా ఎల్లప్పుడు సిద్ధంగా వుండడం అవసరం.

ఇంత పెద్ద ఎత్తున సరిహద్దులను రక్షించుకుంటూ దేశం శాంతి భద్రతలకు పొరుగు దేశాలనుండి ఎలాంటి భంగంకాని, ప్రమాదం కాని ఏర్పడకుండా వుండేందుకు, సరిహద్దు భద్రతా దళాలతోబాటు, సైన్యాలు, విమాన, నౌకాదళాలను ఎప్పుడూ సంసిద్ధంగా వుంచడానికి, వాటికి అవసరమైన ఆయుధాలు, మందుగుండు మున్నగునవి ఏర్పాటు చేయడానికి భారీ ఎత్తున ఖర్చు అవుతుంది. అందులో సందేహపడనవసరం లేదు.

అయితే ఎంత ఖర్చు అయినా, కేవలం దేశ సరిహద్దులు రక్షించడానికి అయ్యే ఖర్చు, సైనికులు దేశ సరిహద్దులు దాటి పొరుగు దేశాలలోని భూభాగాలను దురాక్రమణ చేయడానికి అవసరమైన సైన్యాలను పోషించడానికి అయ్యే ఖర్చుకన్నా చాలా తక్కువే. భారత దేశానికి ఏ దేశ భూభాగంపై దాడిచేసి, దురాక్రమణ ద్వారా సరిహద్దులను విస్తరించాలన్న కోరిక ఎప్పుడూ ఏనాడూ చరిత్రలోకాని, వర్తమానంలోకాని లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత నౌకాదళం యితర సేనలు, ఇజ్రాయిల్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు మున్నగు దేశాల సైన్యాల తోటి ఉమ్మడి కవాతులు జరపడం అవసరమా ? మన సేనలు గాని యుద్ధ నావలుగాని, విమాన దళాలు గాని ఆ దేశాల మీదకు కాదుగదా ఆ సరిహద్దుల పొలిమేరకు కూడా

వెళ్ళలేదు. వెళ్ళవలసిన అవసరం శాంతికాముక దేశమైన భారత్‌కు లేదు. ఈ ఉమ్మడి కవాతులవల్ల, యుద్ధపోరాటంలో, కొత్తకొత్త సాంకేతిక పద్ధతులు వ్యూహరచనలు మున్నగునవి అలవరచుకోడానికి వీలు పడుతుందన్న అభిప్రాయంతో పాల్గొంటారు. నాటోకి చెందిన సేనలు ఇలాంటి ఉమ్మడి కవాతులు చేస్తున్నాయంటే అర్థం వుంది. ఎందుకంటే ఆ దేశాలకు సైనిక ఒడంబడికలున్నాయి. మరి భారతదేశానికి అమెరికా సంయుక్తరాష్ట్రాలతోకాని, ఇజ్రాయిలుతోకాని మరో దేశంతో కాని సైనిక ఒడంబడికలు లేవు. అలాంటప్పుడు ఈ కవాతుల వలన ఆదేశాలనుంచి మన దేశ సైన్యాధిపతులు నేర్చుకోతగినవి ఆట్టే లేకపోయినా, మన దేశ సైన్యరహస్యాలు,మన ఆయుధాలకు సంబంధించిన సాంకేతిక వివరాలు తెలుసుకోడానికే ఉపయోగపడతాయి. ఈ ఉమ్మడి కవాతుల వల్ల మన సైనిక దళాలు పకడ్బందీగా యుద్ధ సన్నద్ధంగా ఎల్లప్పుడూ ఉండటానికి తోడ్పడతాయన్నది మరో అభిప్రాయం.కాని మొత్తం ఉమ్మడికవాతుల వల్ల ప్రయోజనం శూన్యం.

ఇంక ఆయుధాల ఉత్పత్తి, కొనుగోలు, శాస్త్ర సాంకేతిక పరిశోధన కూడా ఒక పరిమితి దాటి చేయనవసరం లేదు. అసలు అణు విస్ఫోటనం పోఖ్‌రాన్‌లో ఇందిరా గాంధీ హయాంలో చేయడం గురించే ఏకాభిప్రాయం లేదు. అణు పరిశోధన కేవలం శాంతి ప్రయోజనాలకే పరిమితం అవ్వాలని, మొదటినుంచి భారత దేశ నాయకులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి విస్ఫోటనాలు చాలా ప్రమాదకరమైనవి. భారతదేశం చేస్తే, దానికి సమానంగా, మన దేశాన్ని విరోధి దేశంగా పరిగణించే పాకిస్తాన్ లాంటి దేశాలు కూడా ఆ రంగంలో భారతదేశంతో సమానంగా ఉండాలని ప్రయత్నిస్తారు. ఆ దేశాలకన్నా ఒక ఆకు ఎక్కువ చదివినట్లుండాలని భారత దేశ సైనిక సాంకేతిక శాస్త్రజ్ఞులు తాపత్రయపడతారు. ఈ పోటీ వల్ల జరిగే, మంచి వుండదు. ఆయుధం వుండగానే దానిని ఉపయోగించాలన్న తహతహ ఎక్కువ అవుతుంది. అది చాలా ప్రమాదకరమైన మనః ప్రవృత్తికి దారితీస్తుంది. సైనికాధిపతులు ఏ చిన్న సందర్భం వచ్చినా యిటువంటి మారణాయుధాలను ప్రయోగించాలని ఉబలాటపడుతూంటారు. అందుకని యిటువంటి ఆయుధాలు యుద్ధరంగంలో లేకపోవటం మంచిది.

అణుబాంబు చాలా ప్రమాదకరమైనవే కాకుండా చాలా ఖర్చుతో కూడుకున్న విషయం. అందుకని ఇటీవల కాలంలో అణు బాంబులకు బదులుగా, దూరప్రాంతాలలో వున్న సైనిక స్థావరాలపై దాడి చేయగల క్షిపణలపై చాలా దేశాలు కేంద్రీకరిస్తున్నాయి. భారత దేశం ఈ క్షిపణుల తయారీలో కొంచెం ముందంజలో వుంది. నేలమీదనుంచి ఆకాశంలో ఎగిరే విమానాలపై దాడిచేయగల క్షిపణులు, సరిహద్దులు దాటి, పొరుగు దేశాలలో సైనిక స్థావరాల పై దాడిచేయగల క్షిపణులు, అగ్ని, బ్రహ్మోస్ మున్నగునవి దేశంలో నిర్మించగల స్తోమత మన రక్షణ విభాగానికి చెందిన సాంకేతిక శాస్త్రజ్ఞులు చేకూర్చుకొన్నారు. ఈ క్షిపణులకు అణు శస్త్ర ముఖాలు తరలించే వీలుంది.

అయితే మన రక్షణ అవసరాల విషయంలో ఒక సహేతుకమైన సమీక్ష 1962లో చైనా సేనలు మన ఉత్తర, ఈశాన్య సరిహద్దులను దాటి దేశంలోకి చొచ్చుకొని వచ్చిన సందర్భం తరువాత చేయబడలేదు. ఆనాడు చేసిన సమీక్ష ఫలితంగానే, భారత సైన్యంలో ఎత్తైన కొండ ప్రదేశాలలో యుద్ధం చేయగల సైన్య దళాలను తర్ఫీదు చేయడం జరిగింది. అయితే అప్పటినుంచి, మన దేశ సరిహద్దులను రక్షించడానికి లేదా విరోధి సైన్యాలు మన దేశం మీదకు దండెత్తి వస్తే, వాటిని చీల్చి చెండాడడానికి కావలసిన ఆయుధాలను సమకూర్చుకోడం, ఒక నిర్ణీత రక్షణ విధానానికి అనుగుణంగా కాకుండా ఎప్పటికప్పుడు సైన్యాధిపతులు తమకు తోచిన నిర్ణయాలు తీసుకోడమే జరుగుతున్నది. చాలా ధనం ఈ విధంగా తధర్మ నిర్ణయాలు తీసుకోవడం వల్ల దుబారా అయ్యింది. ఉదాహరణకు భారత వైమానిక దళాలకు కావలసిన ఫైటర్ విమానాలు కొనే నిమిత్తం యం.ఐ.జి.-23, యం.ఐ.జి.27, మిరాజ్ 2000, యం.ఐ.జి.-29, యం.యు.-30 అవన్నీ వివరంగా, లోతుగా ఆలోచించికొన్నవి కావు. కేవలం మన మిత్ర దేశాలు అనబడే కొన్ని దేశాల నుంచి కొన్న సందర్భాలు కూడా లేకపోలేదు. మన రక్షణ అవసరాలు ఏమిటి అన్న దృక్పథంతో ఎంచికొన్నవి కావు. 1980 దశకం లో విమాన దళ అధిపతి ఎయిర్ మార్షల్ లతీఫ్ ఈ యం.ఐ.జి.లకు, గ్నాట్స్‌కు, యింకా ఆ జాతికి చెందిన విమానాలకు బదులుగా భారత విమాన దళానికి కావలసింది విరోధి విమానాలను ఎదిరించి పోరాడే తేలికైన యుద్ధ పోరాట విమానాలు అవసరమని వీనిని దేశంలోనే ఉత్పత్తి చేయడానికి కృషి చేయాలన్న విధానాన్ని సూచించారు.

ఏంటంటే ప్రస్తుత పరిస్థితులలో ఆయుధాల పరిశోధనలలో ఇవాళ మంచి అనుకున్నది మరో 5,10 సంవత్సరాలలో, పాతవి అయిపోతున్నాయి. అందుచేత అధునాతన ఆయుధాలకు బదులు పదికాలాలు మన్నే ఆయుధాలు ఏవి అని ఎంచి కొంత అధిక వ్యయం అయినా కొనడం మంచిది. అదీకాకుండా సైన్యానికి చెందిన మూడు విభాగాల ఆధిపత్యం ఉమ్మడిగా మన దేశ సరిహద్దులను రక్షించడానికి ఎటువంటి ఆయుధాలు కావాలి అని ఆలోచించి వాటిని సేకరించాలి. ఈ విధమైన హేతుబద్ధమైన, ప్రయోజనకరమైన, సమంజస మైన నిర్ణయాలు తీసుకోడానికి నిజాయితీ, రుజువర్తన గల రక్షణశాఖ అనేకమార్లు సమాలోచనలు జరిపి ఒక రక్షణ విధా నాన్ని రూపొందించి, ఆ విధానాన్ని ప్రతి రెండు మూడు సంవత్సరాలకు ఒక మాట సమీక్షిస్తూ, అవసరమైన మార్పు చేస్తూ, దానికి అనువైన ఆయుధాలు కొనుగోలు చేస్తే, రక్షణ శాఖ నిధులు, యిప్పటి లాగ దుర్వినియోగం కావు. అంతేకాక రక్షణ శాఖలో అవినీతికి కూడా తావు బాగా తగ్గిపోతుంది. ❑

ఇండియా - చైనా- పాకిస్తాన్

సయోధ్య స్వరాలు

- ఆర్‌వీఆర్ చంద్రశేఖరరావు


ఇండియా - చైనా

ఇండియా- చైనాల మధ్య చేకూరిన సయోధ్య నిర్దిష్టమైన రూపం దాల్చింది. ఏప్రిల్ 11వ తేదీన రెండు దేశాలు కుదుర్చుకున్న మార్గదర్శక సూత్రాలే ఇందుకు నిదర్శనం. గడచిన 16 సంవత్సరాలుగా అంచెలంచెలుగా సాధించిన మైత్రీ భావం, ఇరు పక్షాలు ఓర్పుతో, చాకచక్యమైన దౌత్య విధానాలతో అతి తీవ్రమైన శత్రుత్వ భావాన్ని విడనాడి స్నేహ శీలక దృష్టితో సృష్టించుకున్న ఈ శాంతి కాముక ప్రక్రియ ప్రపంచ దౌత్య చరిత్రలోనే ఘనమైనదిగా నిలుస్తుంది.

టిబెట్ స్వతంత్ర ప్రతిపత్తి విషయంతో ప్రారంభమైన తగాదా, సరిహద్దు వివాదాన్ని ఉధృతం చేసి 1962లో యుద్ధానికి దారితీసింది. పంచశీల సూత్రాలు దాదాపుగా మాయమయ్యాయి. 25 సంవత్సరాలకుపైగా భారత్-చైనా సంబంధాలు బద్ధ శత్రుత్వంగా మారాయి. దీనికి తోడు 1964లో చైనా అణుబాంబును సాధించుకున్న నేపథ్యంలో రెండు దేశాల మధ్య అణు పందెం ప్రారంభమయింది. భారత్ రక్షణ అంచనాలలో చైనా మొదటిస్థాయి శత్రువుగా రూపొందింది. పాకిస్తాన్ నుండి వచ్చే ముప్పుకన్నా చైనానుంచి కలిగే ఉపద్రవమే హెచ్చనే అంచనా భారత రక్షణ వ్యూహ రచనలో కొన్ని దశాబ్దాలుగా చోటు చేసుకుంది. అటువంటి సందర్భంలో సరిహద్దు పరిష్కారానికి ప్రయత్నించిన సంప్రతింపులు ఫలించలేదు. పైగా చైనాలోని సాంస్కృతిక విప్లవం, సోవియట్ రష్యాతో సైద్ధాంతిక, సరిహద్దు తగవులు తీవ్రరూపం దాల్చడం వంటి కారణాల వల్ల చైనా విధానాలు విప్లవాత్మక ధోరణులతోనూ, ఉగ్ర దృక్పథాలతోనూ సాగుతూ వచ్చాయి. చైనా, ఇండియా సంబంధాలు ప్రచ్ఛన్న యుద్ధ నమూనాతో సరితూగాయి.

ఎట్టకేలకు 1988లో మొట్టమొదటి సారిగా రాజీవ్‌గాంధీ హయాంలో ఈ సంబంధాలలో సక్రమమైన మలుపు వచ్చింది. డిసెంబరు 1988లో ఆయన చైనా పర్యటనను చారిత్రాత్మకమైనదిగా వర్ణించవచ్చు.

ఆ సందర్భంలో రెండు దేశాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర అవగాహనలతోను, నిర్మాణాత్మక దృష్టితోనూ పరిష్కరించుకోవడానికి అంగీకారం కుదిరింది. రాజీవ్ పర్యటన సాధించిన సత్ఫలితాలకు అప్పుడు చైనా నాయకుడైన డెంగ్



జియావో పింగ్ చొరవ, ప్రోత్సాహం ఎంతైనా మద్దతునిచ్చాయి. ఇదివరలో కూడా అటువంటి ప్రాతిపదికలను లాంఛన ప్రాయంగా ప్రకటించినా, సంబంధాలలో అంతగా మార్పులు కలుగలేదు. రాజీవ్ పర్యటన తరువాత ఈ దేశాల మధ్య ఒక సుహృద్భావ వాతావరణం ఏర్పడింది. రాజకీయ సమస్యల పరిష్కారం త్వరలో జరగకపోయినా, వాటిని శాంతియుతంగా పరిష్కరించుకోక తప్పదనే గాఢ నమ్మకం, ఆశయం ఈ రెండు దేశాల విధానాలలో ప్రస్ఫుటించింది. దీని మూలంగా వివాదాల పరిష్కారానికి తగురీతిని దోహదమయ్యే సంప్రదింపు బృందాలను ఏర్పరచుకోవడం, ఇటు దౌత్య స్థాయిలోను, అటు సైనిక స్థాయిలోనూ నిర్మాణాత్మకమైన, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే ప్రతిపాదనలను అమలు పరచడం జరుగుతూ వచ్చింది. రాజీవ్ వేసిన పునాదులపై వాజ్‌పేయి హయాంలో ఇండియా - చైనా సంబంధాలు మరింత దృఢపడ్డాయి. 2003లో వీరి చైనా పర్యటన తరువాత వెలువడిన ఉమ్మడి ప్రకటన ఈ దేశాల ద్వైపాక్షిక సుహృద్భావాన్ని మరింతగా చాటింది. సరిహద్దు సమస్యపై దౌత్యపరమైన సంప్రదింపులు మిత్రత్వ శైలిలో నిలిచాయి. కేవలం సరిహద్దు విషయంలో పరిష్కారమే కాక, సైనిక వ్యూహాత్మకంగా ఉన్నత శ్రేణిని అందుకోవాలనే ఉద్దేశంతో ఈ సంప్రదింపులను కొనసాగించాలనే భావన చైనా ప్రధాని వెన్ వ్యక్తం చేయడం గమనార్హం. దీనిని పురస్కరించుకొనే సంప్రదింపులను ప్రత్యేక ప్రతినిధుల స్థాయికి పెంచడం జరిగింది. అప్పటినుండి మొన్నటి

వరకు ఈ ప్రతినిధుల మధ్య నాలుగు దఫాల సమావేశాలు జరిగాయి. ఆనాటి ఫలితమే సమస్యా పరిష్కారానికి మొన్న ప్రకటించ బడ్డ మార్గదర్శక సూత్రాలు.

రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా బిగిసిన ముడులను విప్పడమే ఈ అగ్రశ్రేణి సమావేశాలు సాధించిన ఫలం. సమస్యా పరిష్కారానికి ఎట్టి పరిస్థితులలోనూ బలప్రయోగం చేయడం జరగదని, దీర్ఘమైన సరిహద్దు ప్రాంతాలలో శాంతియుత వాతావరణాన్ని, రాజకీయ స్థాయిలోనూ, సైనిక స్థాయిలోనూ నెలకొల్పడం జరుగుతుందనీ ఈసారి సంప్రదింపులలో నిర్ణయించబడడమే అతి గొప్పదైన విషయం. దీనితో పరస్పర సంబంధాలు సయోధ్య రీతి గతులలో నిలిచాయి.

చైనా నాయకత్వంలో ఇటీవల జరిగిన భారీ మార్పుల తరువాత ఆదేశపు ప్రధాని, వెన్ మై బావ్ మొదటిసారిగా ఇండియా పర్యటనకురావడం, ఆ సందర్భంలో ద్వైపాక్షిక విషయాలను సమగ్రంగా పరిష్కరించుకోవడానికి ప్రణాళికను ఖరారు చేసుకోవడం, 16 ఏళ్ల దౌత్య ప్రక్రియలకు ప్రతీక. అయితే, గమనించవలసిన విషయమేమిటంటే, కీలకమైన సరిహద్దు సమస్య పరిష్కరింపబడిందని కాదు. ఆ సమస్య ఇంకా సమస్యగానే ఉంది. కాని సమస్యా పరిష్కార విధానం ఒక నిర్దిష్ట రీతిలో రూపొందింది. ఈ నిర్దిష్ట రీతులనే "సరిహద్దు పరిష్కారానికి అవకించవలసిన మార్గదర్శక సూత్రాలు"గా రూపుదిద్దారు. సూక్ష్మంగా వీటిని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. సరిహద్దు విషయంలో చోటు చేసుకున్న భేదాభిప్రాయాలు ద్వైపాక్షికంగా ఇతర రంగాలలో సాధించుకున్న పురోగతికి భంగం రాకూడదు.
2. సరిహద్దు సమన్యను పంచశీల ప్రాతిపదికలను పురస్కరించుకొని సమంజసమైన, ఉభయత్రా ఆమోదకరమైన రీతిలో పరస్పర సలహా సంప్రదింపులతో పరిష్కరించుకోవాలి.
3. పరస్పర అవగాహనాత్మకంగా సరిహద్దు విషయంలో ఇరు పక్షాలు అర్ధవంతమైన నడలింపులను, మార్పులను చేసుకోవాలి. తద్వారా సరిహద్దు వివాదాలను అన్నింటిని ఒక త్రాటి కింద ఏకాయకీ పరిష్కరించుకోవాలి. ఈ పరిష్కారం తుది పరిష్కారంగా పరిగణించాలి.
4. ముఖ్యంగా, ఈ పరిష్కారం ఉభయ దేశాల సైనిక వ్యూహ రచన ప్రయోజనాలకు తగు గుర్తింపు నిచ్చేటువంటివిగా ఉండాలి.
5. సరిహద్దులను నిర్ణయించడంలో వీలైనంత వరకు సరిహద్దులను నిర్దిష్టమైన, నైసర్గిక వాస్తవాలకు అనుకూలమైన అన్ని రీతులలో అనుసరించాలి. సరిహద్దుల కిరుప్రక్కల ఉండిన ప్రజల ప్రయోజనాలను పరిరక్షించాలి.
6. సరిహద్దు పరిష్కారం పూర్తిగా జరిగేవరకు, ఉభయ పక్షాలు ఇప్పుడున్న నియంత్రణ రేఖను గౌరవిస్తూ, ఆ ప్రాంతాలలో శాంతి భద్రతలను పరిరక్షించాలి. ప్రస్తుతం ఉన్న ఇండియా-చైనా ఉమ్మడి బృందాలు (ఇండియా-చైనా ఉమ్మడి బృందం, ఇండియా-చైనా దౌత్య సైనిక నిపుణుల బృందాలు) వారి కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉంటారు.
7. ప్రత్యేక ప్రతినిధులు, సరిహద్దు సమస్య విషయంలో వారి సలహా సంప్రదింపులను కొనసాగిస్తూ సరిహద్దు నిర్ణయానికై ఆమోదకరమైన పరిష్కారాన్ని రూపుదిద్ది, దాని గీతను రూపొందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తారు.

పైన వివరించిన కార్యసాధన అంతవేగిరంగా చేకూరేది కాదు. అయినా, ఇంత విపులంగా సరిహద్దు పరిష్కారానికి ఇదివరకెన్నడు అంగీకారం స్థూలంగా కుదరలేదు. ఇప్పుడు కుదరడం ఎంతో ఆశాజనకమైన సంగతి. అంతేకాక, బలప్రయోగం ద్వారా సమస్యా పరిష్కారానికి స్వస్తి చెప్పడం, పరస్పర సంబంధాలు ఈ పరిష్కారానికి మించిన విధంగా రూపుదిద్దుకోవాలనే ఆశయాన్ని పునరుద్ఘా టించడం ఇంకా చెప్పుకోదగ్గ సంగతి.

రక్షణ వ్యూహ రచన దృష్ట్యా చూస్తే ఇండియా-చైనా సంబంధాలు, సాధారణ మైత్రీ స్థాయికి మించి రూపొందే సూచనలు కనిపిస్తున్నాయి. ఆదిలో ఇండియా-చైనాలు అణ్వస్త్ర పోటీలో ఇరుక్కొంటాయనే భయం ఉండేది. ఇప్పుడు ఆ భయం లేదు. ఇంతేకాక, చైనా తనంతట తానే ప్రపంచ శాంతి భద్రతల ప్రయోజనాలకై, ఇండియా, చైనా-రష్యాలు ఒక రక్షణ వ్యూహాత్మక కూటమిగా వ్యవహరించాలి అనే భావనను ప్రతిపాదించటం మరింత గొప్ప విషయం. అమెరికా ఈ పోకడను హర్షించదుకదా, అడ్డుతగలవచ్చును కూడా.

మొత్తం మీద ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో ఇండియా-చైనా సంబంధాలు కొత్త దశకు చేరుకున్నాయనే చెప్పాలి. అయితే, ఇండియా - చైనా మైత్రి, రక్షణ వ్యూహాత్మక సహకార విధానాన్ని ఒక సైనిక సహకార ఒప్పందంగా భావించరాదని, అది ఏ ఇతర దేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్దేశించబడలేదని, ఇండియా స్పష్టం చేసింది.

ఇంకొక విషయంలో కూడా రెండు దేశాలూ సహృదయ భావం వ్యక్తమయింది. ఐక్య రాజ్య సమితి భద్రతామండలిలో ఇండియాకు స్థిర సభ్యత్వాన్ని చైనా సమర్ధించింది. అంటే, ఇప్పటికి, ప్రస్తుత స్థిర సభ్యులయిన ఐదు దేశాలలో నాలుగు, ఇండియా స్థిర సభ్యత్వానికి ఆమోదం తెలిపాయి. అమెరికా ఇంకా ఈ విషయంలో ఒక నిర్ణయానికి రాలేదు. చైనా కూడా కొన్ని సందర్భాలలో ఇండియా స్థిర సభ్యత్వం నిర్ణయం అంతర్జాతీయ అభిప్రాయానికే

వదిలివేయాలని కూడా చెప్పడం జరిగింది. అంటే చైనా తుది నిర్ణయంలో ఇంకా సందేహాలున్నాయేమో.


ఇండియా-చైనాల సంబంధాలలో వచ్చిన మంచి మార్పు కారకాలు చాలావున్నాయి. ప్రపంచ వ్యవహారాలలో ఇండియా పాత్రను, ప్రతిష్టను, ఇదివరలో లాగా చైనా కొట్టి పారవెయ్యలేదు. ఇండియా కూడా అణ్వాస్త్ర ధారియే! ఆర్థిక, వాణిజ్య విషయాలలో కూడా గణనీయమైన దేశమే. అమెరికా ఏకాధిపత్యానికి ఇంకా అడుగులకి మడుగులొత్తడం లేదు. అందువల్ల ఇండియాతో సయోధ్య చైనాకు లాభదాయకం. కాని ఈ కారణంగా చైనా సరిహద్దు సమస్య విషయంలో అధిక త్యాగాలు చేస్తుందా? తను తనదని ఆక్రమించిన ఇండియా భూభాగాన్ని తిరిగి ఇస్తుందా? లేకపోతే పై మెరుగుల రాయితీలతోనే ఇండియా తృప్తి చెందుతుందా? ఇప్పటిలో ఏ సంగతీ చెప్పడం కష్టం.

ఇండియా-పాకిస్తాన్

చైనా ప్రధాని వచ్చివెళ్లిన వెంటనే పాకిస్తాన్ అధ్యక్షుడు ముషారఫ్ భారత పర్యటన ప్రాంతీయ రాజకీయ రంగంలో అత్యంత కీలక ప్రాధాన్యతను పొందింది.

ఇండియాకు రక్షణ విషయంలో పాకిస్తాన్‌తో సంబంధాలు చైనాతో కన్నా ప్రధానమైనవి. ముందు చెప్పినట్లు చైనాతో రక్షణకు సంబంధించిన మట్టుకు సమస్యలు చాలవరకు మందగిల్లాయి. కాని పాకిస్తాన్‌తో ఇండియా సంబంధాలు ఇంకా మౌలికంగా శత్రుత్వ స్థాయిలోనే వున్నాయి. కాశ్మీరు సమస్య, ఉగ్రవాదం ఇంకా సమసిపోలేదు. మళ్ళీ రక్షణ సామగ్రి సేకరణలో పోటీ పునః ప్రారంభమైన సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా ఇరుదేశాలకు ఎఫ్-16 యుద్ధ విమానాలను సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇవన్నీ కాక, వారిరువురి అణ్వాస్త్రాలు పరస్పర ప్రయోగ ప్రయోజనాలకే అన్నట్టుగా ఆ దేశాల విధానాలు తెలియజేస్తున్నాయి. ఈ వాతావరణంలో ఇండియా-పాకిస్తాన్‌ల శిఖరాగ్ర సమావేశం ప్రాముఖ్యత వహించడం సహజమే.

ఒకవైపు సుమారు 60 ఏళ్ళ నుంచి వస్తున్న వైరం, ఐదుసార్లు యుద్ధంగా పరిణమించడం వల్ల ఈ ఉపఖండం ప్రపంచ శాంతి భద్రతలకే ఒక క్లిష్టమైన సవాలుగా నిలిచింది. మరోవైపు ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలోనే కొన్ని శాంతి కిరణాలు ప్రసరిస్తున్నాయి. కార్గిల్ యుద్ధం తరువాత, అణ్వాస్త్ర ప్రయోగ ఉపద్రవం మరింత భయానక స్వప్నంగా రూపొందింది. ఈ కారణంగా రెండు దేశాల మధ్య సంప్రదింపులు - శాంతియుత పరిష్కార మార్గాన్వేషణలు భారీగా జరుగుతున్నాయి. ప్రపంచ ఉగ్రవాదాన్ని యుద్ధ ప్రాతిపదికపై ప్రకటించిన అమెరికా ఆధ్వర్యాన రెండు దేశాలపై ఒత్తిడుల



కారణంగా కూడా, ఉపఖండంలో ఉధృత వాతావరణాన్ని తగ్గించడానికి రెండు దేశాలు ప్రయోజనాత్మకమైన సంప్రదింపుల పరంపరలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మొన్నటి శిఖరాగ్ర సమావేశం ప్రాముఖ్యం విశదమౌతుంది. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఈ శాంతి స్థాపన ప్రక్రియ మొదలైంది. అయితే ఆగ్రాలో జరిగిన వాజ్‌పేయి - ముషారఫ్ సంప్రదింపులు ఆశను చూపి నిరాశే మిగిల్చాయి. వాతావరణం మరల ఉధృత రూపం దాల్చింది. కాని అదృష్టవశాత్తు వాజ్‌పేయి హయాం ఆఖరి మాసాలలోనే తిరిగి రెండు దేశాల మధ్య శాంతి పవనాలు వీచడం మొదలెట్టాయి. గత సంవత్సరం మొదలులో ఇరు దేశాల నేతలు కీలకమైన సడలింపు ధోరణులను ప్రకటించారు. కాశ్మీరు సమస్యను సమగ్రంగా చర్చించడానికి సిద్ధంగా ఉందని ఇండియా ప్రధాని, కాశ్మీరుపై ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైటు) పై పట్టును వదుల్తామని ముషారఫ్ అనడంతో ఒక తాజా పరిస్థితి ప్రభావితమైంది. తిరిగి దౌత్యస్థాయిలో సంప్రదింపులు, కాశ్మీరు సమస్య మొదలుకొని, ఇతర సమస్యల చర్చలకు కావలసిన కార్యక్రమాలు చురుకుగా సాగాయి. కాశ్మీరులో ఉగ్రవాదాన్ని అరికట్టడం విషయంతో సహా, కాశ్మీరులోని నియంత్రణ రేఖకిరుప్రక్కల ప్రజా రవాణా సౌకర్యాన్ని ప్రారంభించడం, ఇంకా వాణిజ్య, వ్యాపార విషయాలలో సడలింపు విధానాలపై విరివిగా సంప్రదింపులు చోటు చేసుకున్నాయి.

ఈ సమయంలో ఇండియాలో సాధారణ ఎన్నికలొచ్చి, ఎన్.డి.ఏ. ప్రభుత్వం పడిపోయి, కాంగ్రెసు పార్టీ నాయకత్వం కింద యు.పి.ఏ. ప్రభుత్వం వచ్చింది. సిద్ధాంత ప్రాయంగా, లౌకిక వాదానికి కట్టుబడిన యు.పి.ఏ. ప్రభుత్వం పాకిస్తాన్‌తో సయోధ్యను కోరుతుందనే భావం సహజమైనదైనా, మొదట్లో కొన్ని హంసపాదులు కనిపించాయి. పాకిస్తాన్‌తో వ్యవహరించడంలో తమకు మించిన సామర్థ్యం ఎవరికీ లేదనే అహంభావం కాంగ్రెసు ఉన్నత వర్గాలలో, ముఖ్యంగా విదేశాంగ భాగంలో జీర్ణించుకొని పోవడం దీనికి కొంత కారణం. అయితేనేమి దౌత్య విధానాలు

కాశ్మీరు సమస్యను వెనుకకు నెట్టకుండానే, దాని పరిష్కారాన్ని ధ్యేయంగానే ఉంచుకుంటూ, ఇతర విషయాలలో పురోగతికి పాకిస్తాన్ సిద్ధమనేనని ముషారఫ్ వ్యాఖ్యలు ఈ శిఖరాగ్ర సంప్రదింపులకు కొత్త స్ఫూర్తిని కలిగించాయి. రెండు దేశాల బాషా శైలిలో అత్యంత ఆశాదాయకమైన మార్పు వచ్చింది. కాశ్మీరులోని నియంత్రణ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చుకొనే ప్రశస్తి లేదంటూనే, ఆ రేఖను ఒక 'మెత్త'ని రేఖగా పరిగణనిస్తామని ఇరువురు అనడం, దౌత్య భాషా పరంగా విప్లవాత్మకమైనదే.

క్రమేణ సక్రమంగా సాగాయి. శ్రీనగర్ నుండి ముజఫరాబాద్‌కు బస్సు సర్వీసును ప్రారంభించడంలో ఇతర రంగాలలో కూడ కొన్ని అంగీకారాలు చేకూరడంతో మరొక శిఖరాగ్ర భేటీకి రంగం సుగమమైంది. ఇండియాలో జరుగుతున్న - భారత్ - ఇండియా క్రికెట్ ఆటలు సులభమైన దౌత్య నెపాన్ని కలిగించాయి.

కాశ్మీరు సమస్యను వెనుకకు నెట్టకుండానే, దాని పరిష్కారాన్ని ధ్యేయంగానే ఉంచుకుంటూ, ఇతర విషయాలలో పురోగతికి పాకిస్తాన్ సిద్ధమనేనని ముషారఫ్ వ్యాఖ్యలు ఈ శిఖరాగ్ర సంప్రదింపులకు కొత్త స్ఫూర్తిని కలిగించాయి. రెండు దేశాల భాషా శైలిలో అత్యంత ఆశాదాయకమైన మార్పు వచ్చింది. కాశ్మీరులోని నియంత్రణ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చుకొనే ప్రశస్తి లేదంటూనే, ఆ రేఖను ఒక 'మెత్త'ని రేఖగా పరిగణిస్తామని ఇరువురు అనడం, దౌత్య భాషా పరంగా విప్లవాత్మకమైనదే.

అంటే, కాశ్మీరు సమస్యను ఒక కొలిక్కి తీసుకొచ్చేంతవరకు, రెండు దేశాలు సరిహద్దు రేఖను ఒక ఉద్రిక్తమైన సీమగా పరిగణించబోవని అర్థం అన్నమాట. ఈ మెత్తతనం అనే మాటకు ప్రత్యాక్షార్థక వాస్తవం చోటుచేసుకుంటోంది. దీనికిరువైపుల కాశ్మీరు ప్రజలు ఆరు దశాబ్దాల తరువాత రాక పోకలను జరుపగలగడమే కాకుండా, వ్యాపార వాణిజ్య సౌకర్యాలను కూడా కలిగించడానికి వ్యూహాత్మక ప్రాతిపదికలను కుదర్చబోతున్నారు. తన పర్యటనలో కాశ్మీరులోని ఉగ్రవాద, వేర్పాటువాద పక్షాలతో సంప్రదింపులలో ముషారఫ్ ఇదివరకటి రెచ్చగొట్టే ధోరణి చూపలేదు.

కాశ్మీరు విషయమటుంచి, రెండు దేశాల మధ్య సాధారణ ప్రజల రాకపోకలను, సాంస్కృతిక, సాంకేతిక బృందాల పర్యటనలను ప్రోత్సహించడం, వాణిజ్య పాఠాలకు అవకాశాలను పెంచడం మొదలగు అంశాలలో మరింత ప్రగతి కనబడింది.

పైన చెప్పిన పురోగమన రీతులు ఉదాహరణలు మాత్రమే. అసలు చెప్పుకోదగ్గ విషయమేమంటే పాకిస్తాన్ ఇన్నేళ్ళ దాకా వీడని మొండి పట్టు ఇప్పుడు వీడనుంది. రాజకీయ సమస్యా పరిష్కారం కానంతకాలం, ఆర్థిక రంగంలో ఇండియాతో సంబంధాలు పెంచుకోమన్నదే ఈ మొండి పట్టు. ఈ భావన ప్రాంతీయ సహకార సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకం. ప్రాంతీయ సహకార సిద్ధాంతపు సారాంశమేమంటే, ఒక ప్రాంతంలో కరడు కట్టిన రాజకీయ సమస్యల పరిష్కారం జటిలమయినప్పుడు, దానిని ప్రక్కకు త్రోసి, ఆర్థిక, వాణిజ్య రంగాలలో సహకారాన్ని, కార్యదీక్షతో అమలు జరిపితే, సహకారం వల్ల కలిగే లాభాలు, స్నేహ భావాలమూలంగా, రాజకీయ సమస్యల పరిష్కారం క్రమేణా సులభసాధ్యం అవుతుందనే భావన. ఈ ప్రక్రియ పశ్చిమ యూరపులో అతి విజయవంతంగా సాగింది. గత 50 ఏళ్ళుగా సాగి, తుదకు యూరపియన్ యూనియన్‌గా ఒక ఆదర్శ ప్రాయమైన ప్రాంతీయ సహకార వ్యవస్థ, ఇంచుమించు సార్వభౌమాధికారాన్ని సంతరించుకున్న రాజకీయ వ్యవస్థగా మారింది.

తదుపరి ఇతర ప్రాదేశిక సహకార వ్యవస్థలు కూడా చాలవరకు సత్ఫలితాలను పొందగలిగాయి. దక్షిణాసియాయే ఏళ్ళనుండి ఉంది. పాకిస్తాన్ - ఇండియాతో ప్రాంతీయ సహకారం అంశంలో ఉత్సాహం చూపలేదు. అట్టి సహకార విధానం, కాశ్మీరు సమస్యను మరుగు పరుస్తుందని పాకిస్తాన్ భయం. భుట్టో అధికారంలో ఉన్నప్పుడు, ఇరాన్ రాజు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇండియాల భూభాగం మీదుగా వాణిజ్య, వ్యాపార సహకారాన్ని విస్తృతం చేసుకోవాలని ప్రతిపాదించినప్పుడు భుట్టో ఆ ప్రతిపాదనను వ్యతిరేకించారు. వ్యతిరేకత ఇటీవల వరకు పాకిస్తాన్ విధానంలో వ్యక్తమవుతూంది.

అయితే ఇప్పుడిప్పుడే పాకిస్తాన్ ఆ విధానానికి స్వస్తి చెప్పింది. ఈ మార్పు ప్రాంతీయ సహకార ప్రయోజనాలకు, ముఖ్యంగా ఇండియా - చైనా స్నేహ సంబంధాలకు ఎంతైనా ప్రయోజనకరం.

ఇండియా-పాకిస్తాన్‌లు తమ సంబంధాలలో ఇంతవరకు సాధించిన ప్రగతి గణనీయమైనదే. కాని కాశ్మీరు విషయంలో ఇరుపక్షాలు ఎంతవరకు ముందడుగు వేయగలవనే ప్రశ్న వుండనే వుంది. ఈ విషయంలో రెండు ప్రక్కల సడలింపులు రావాలి. కాశ్మీరు ప్రజల ప్రయోజనాలను దాఖలులోనికి తీసుకొని ముందడుగు వేయవలిసి ఉంది.

ఈ లోపల రెండు దేశాలమధ్య ఆయుధ పోటీ తిరిగి ప్రారంభమయే ప్రమాదం లేక పోలేదు. ముందు చెప్పినట్లు, అమెరికా రెండు దేశాలకు శక్తివంతమైన ఎఫ్-16 యుద్ధ సిద్ధత

పెరగవచ్చు. ప్రస్తుత అంచనాల ప్రకారం అమెరికా పాకిస్తాన్ 24, ఎఫ్-16 కొనుగోలుకు అనుమతినిచ్చింది. అయితే ఇండియా 126, అవే ఎఫ్-16లను అమెరికానుండి కొనుక్కోవచ్చు. పైగా, ఇండియా ఎఫ్-16లకన్నా శక్తివంతమైన ఎఫ్-18 విమానాలను కూడా దిగుమతి చేసుకుందుకి అమెరికా అంగీకరించింది. ఈ రక్షణ పరికరాల సేకరణ ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందా? ఆయుధపోటీలు యుద్ధాలను ప్రేరేపిస్తాయనే సిద్ధాంతం వుంది. కాని, ఇండియా - పాకిస్తాన్ మధ్య ఈ సిద్ధాంతం అంతగా వర్తించదు. యుద్ధం జరుగుతున్నప్పుడు రక్షణ పరికరాల కొనుగోలుల, యుద్ధాన్ని ఉధృతం చేస్తాయి కాని, కేవలం యుద్ధ పాటవం కారణంగా, యుద్ధాలు రాలేదు. ఆర్థిక, వాణిజ్య సహకారం ఇతర సయోధ్య ధోరణులు ఎంతగా ఉన్నా - రక్షణ విధానాలలో వీరి అప్రమత్తతలో ఉదాసీనంగా ఉండదు. అందువల్ల యుద్ధ విమానాల కొనుగోలు ఉదంతాన్ని పెద్ద మెప్పుగా అనుకో అక్కరలేదు.

సయోధ్యల అంచనాలు

ఇటు చైనాతో, అటు పాకిస్తాన్‌తో సయోధ్య కుదరడం హర్షదాయకమే. కాని ఈ సయోధ్యల ప్రాముఖ్యం తులనాత్మకంగా పరిశీలిస్తే, వాటి మధ్య తేడాలను గమనించవచ్చు. చైనాతో సయోధ్య చాల మేరకు చైనా అంచనాలకు సరళంగాను ఆమోదకరంగానూ ఉంది. దీనితో ఇండియాకు అంతగా దౌత్యపరంగాకాని, రక్షణ పరంగాకాని అట్టే వచ్చిందేమీ లేదు. సరిహద్దు వివాదంలో వేలాది చదరపు కిలోమీటర్ల ఇండియా భూభాగం ఇంకా చైనా చేతుల్లోనే ఉంది. నిక్కచ్చిగా చెప్పాలంటే చైనా దురాక్రమణ కొనసాగుతూనే ఉంది. స్వల్పసంతోష కారణాలు లేకపోలేదు. సిక్కింను భారత భూభాగంగా అధికార పూర్వకంగా ఒప్పుకోవడం, సరిహద్దు సమస్య విషయంలో కొంచెం సర్దుబాటు జరుగవచ్చు. మొత్తం మీద, చేయగలిగేది అట్టే లేదు కాబట్టి సర్దుకు పోవడమే మేలనే వైనం కనిపిస్తోంది. సైనికంగానూ, ఆర్థికంగానూ, అతి పెద్దదైన చైనాతో దశాబ్దాల వైరాన్ని పాతి పెట్టడం మంచి విషయమే.

పాకిస్తాన్ విషయంలో తీరులు వేరు. సరిహద్దు వివాదంలో కాశ్మీరుపై తమకు కొన్ని హక్కులున్నాయని వాటిని ఇండియా గుర్తించి పరిష్కారం చేసుకోవాలని పాకిస్తాన్ వాదన. అంటే, ఇంచుమించుగా చైనా ఆక్రమణ కారణంగా ఇండియా ఏ మాదిరిగా తన సరిహద్దును కోల్పోయిందో, ఇండియా ఆక్రమణ మూలంగా కాశ్మీరులో తనకు నష్టం వచ్చిందన్నది పాకిస్తాన్ అభియోగం. అందుకే - ఇన్నాళ్ళుగా పాకిస్తాన్ వివాదాన్ని మరువలేకపోయింది. ఇంకోవిధంగా చెప్పాలంటే ఇండియా-చైనా వివాదంలో, ప్రస్తుత భూభాగ పరిస్థితి మార్పు కాంక్షించే ఇండియా - ఇండియా పాకిస్తాన్ వివాదంలో మార్పు రావాలంటున్నది పాకిస్తాన్.

ఈ తారతమ్యాల గుర్తిస్తే, పాకిస్తాన్ ఇప్పుడు చూపుతున్న సయోధ్య పోకడలను హెచ్చుగా హర్షించాలి. ఇండియాతో పెంపొందించుకోవడంలో చైనా అంతగా ఏమీ త్యాగాలు చేయలేదు. పాకిస్తాన్ ఈమాత్రం సయోధ్యకు పూనుకోవడం తన ఇదివరకటి ధోరణిని వెనుకకుపెట్టడం ఎక్కువ హర్షనీయమైన పోకడ. ఇది నిరర్ధకం కాకూడదు. కాశ్మీరు విషయంలో ఈ పోకడను గుర్తించి తగు సడలింపు విధానాలను అవలంబిస్తే, ఉప ఖండంలో శాంతి స్థిరంగా చేకూరుతుంది. ఇందులో ఇండియా పాత్ర ఎంతైనా వుంటుంది. ❑

(40వ పేజీ తరువాయి)

అందువల్ల అంతిమంగా వ్యాట్ ప్రకటిత ఉద్దేశాలలో ఒకే ఒక ఉద్దేశం - ఆదాయం పెరుగుదల నిజంగా మారబోయింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యాట్ వల్ల ఆదాయం పెరుగుతుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలతో భాగం పంచుకోవలసిన అమ్మకం పన్ను కన్నా ఎక్కువ నిధులను కేంద్రం పొందగలుగుతుంది. ప్రకటిత ఉద్దేశ్యాలు ఇలా ఉండగా అప్రకటితంగా ప్రపంచ బ్యాంకుకూ, దానిని వెనకనుంచి నడిపిస్తున్న బహుళజాతి సంస్థలకూ జరగబోయే ముఖ్యమైన మేలు ఒకటుంది. ప్రపంచ బ్యాంకు సాహిత్యంలో అది చాలాసార్లు ప్రస్తావనకు వచ్చింది కూడా. భారతదేశం ఒక సువిశాల మార్కెట్ అని లొట్టలు వేసుకుంటూ ఈ దేశంలో ప్రవేశించిన బహుళజాతి సంస్థలకు రాష్ట్రాలూ, రాష్ట్రాల సరిహద్దులూ, ప్రాంతీయ అసమానతలూ, భాషా భేధాలూ గిట్టడం లేదు. ఇదంతా కూడా ఉమ్మడి మార్కెట్ అయితే ఎంత బాగుండును అని వాళ్ళు తలపోస్తున్నారు. రాష్ట్రాలలో వేర్వేరుగా అమలవుతున్న అమ్మకం పన్ను విధానాలూ, రాష్ట్రాల మధ్య సరిహద్దుల దగ్గర వసూలు చేస్తున్న సుంకాలూ, ఆక్ట్రాయ్ వంటి పన్నులూ వారికి కంటగింపుగా ఉన్నాయి. అవన్నీ చెరిపేసే ఒక ఉమ్మడి మార్కెట్ సాధించాలంటే స్థానిక పన్నుల విధానం రద్దయి ఉమ్మడి పన్నుల ఉమ్మడి మార్కెట్ ఏర్పడాలని వాళ్ళ కోరిక. వ్యాట్ మనకు మంచిదా కాదా, ఉపయోగపడుతుందా లేదా అని చర్చించడానికన్నా ముందు ఏడేడు సముద్రాల అవతలి బేహారుల ఉమ్మడి మార్కెట్ కొరకు మనం ఈ విధానాన్ని తెచ్చుకోవలసిందేనా? ❑

వ్యవసాయ సంస్కరణల గురించి.....

- వెన్నెలకంటి రామారావు

మన దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం పునాది. దాదాపు 69 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. సరిపడనంత భూమి లేకపోవడం వల్ల, వ్యవసాయంపై వచ్చే బొటా బొటి ఆదాయం వల్ల గ్రామ ప్రజలు జీవనం గడపలేని పరిస్థితి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే గ్రామాలలో 80 శాతం ప్రజలు, పట్టణాలలో 70 శాతం ప్రజలు కనీసంగా తీసుకోవలసిన పోషక విలువలున్న ఆహారం తీసుకోలేకపోతున్నారు.

ప్రభుత్వ గణాంకాల గారడీ కుట్రకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా రెండు డాలర్ల కంటే (దాదాపు 90రూ॥ కంటే) దినసరి ఆదాయం తక్కువగా వున్న వారినే పేదలుగా గుర్తించినట్లయితే గ్రామాలలో 75 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన వుంటారు. కరువు సహాయంలో భాగంగా మనదేశానికి అమెరికా అందించిన హరిత విప్లవమృత్యు హస్తం రైతాంగాన్ని భూముల నుండి, వృత్తి పనివారిని వారి పనిముట్లనుండి "విముక్తి" చేసింది. హరితవిప్లవం పెంచిన ధాన్యోత్పత్తిని నోటికి అందించుకోగల్గిన కొనుగోలు శక్తి విశాల ప్రజానీకం చేజారింది. సాంప్రదాయక వ్యవసాయంలోని కోట్లాది మందికి ఉపాధిని చూపించే స్వయం సంపూర్ణత స్థితిని హరిత విప్లవం హరించి వేసింది. ఉపాధి కోల్పోయిన వృత్తిపనివారు ఒకవైపు, ఉత్పాదకత కోల్పోయి, ఉత్పత్తి కారకాలు ప్రియమైపోయి, ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు దొరకని రైతాంగం ఇంకొక వైపు వెరసి వలసలు, ఆకలి చావులు, ఆత్మహత్యలకు అనుకూలంగా నేడు గ్రామీణ భారతం తయారైంది. హరిత విప్లవం తాను అడుగుపెట్టిన చోటల్లా ఆర్థిక, సామాజిక, పర్యావరణ విధ్వంసాలను సృష్టిస్తూ మొత్తం వ్యవసాయరంగాన్ని కబళించింది.

వ్యవసాయ రంగంలోని భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు సామ్రాజ్యవాదం యొక్క సహజ పెట్టుబడిగా నిలుస్తూ, ఆ రంగంలోని అదనపు విలువలు దోచుకునేందుకు స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడిదారులకు పెద్ద వనరుగా నిలిచాయి. వ్యవసాయంలో మిగులు ఇతర రంగాలకు ఇతర దేశాలకు తరలించబడుతోంది. దాంతో వ్యవసాయ రంగంలో విస్తృత పునరుత్పత్తి కాదుగదా, సరళ పునరుత్పత్తి సైతం మృగ్యమై వ్యవసాయోత్పత్తి తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. భారత వ్యవసాయరంగంలో పెట్టే మదుపుకు దాదాపు 87 శాతం నష్టం వచ్చే దుస్థితి ఏర్పడింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్లు లాంటి ఉత్పత్తి కారకాల వ్యాపారం, వడ్డీ వ్యాపారం, దళారీ వ్యాపారం పునాదిగా జాతీయ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులతో మిలాఖతైన హైబ్రిడ్ భూస్వామ్యవర్గం గ్రామాల్లో తలెత్తింది. గ్రామాల్లోని భూస్వామ్యంతో పెనవేసుకొనిపోయిన జాతీయ (ప్రైవేటు, ప్రభుత్వ), అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడుల మిశ్రమ పెట్టుబడిని బ్యూరాక్రటిక్ పెట్టుబడి అనీ, ఆర్థిక విధానాన్ని బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానమని అంటారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ విధ్వంసంతో కూడిన ఆర్థిక విధానమిది. ఈ విధానం వల్ల శిథిలమైన పారిశ్రామిక రంగం హరిత విప్లవపు 'కన్పించని కుట్రల' క్షతగాత్రులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గంగా నిలబడలేక పోవడంతో గ్రామీణుల జీవితాలు దినదిన గండంగా మారాయి.

బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం ఫలితంగా

1. వాతావరణ కరువు - పర్యావరణ విధ్వంసం ఫలితంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన వచ్చేది
2. నీటి కరువు - భూగర్భ నీటి వనరులు, భూమిపై ప్రవహించే నీరు తగ్గిపోతే వచ్చేది
3. వ్యవసాయ కరువు - పై రెండు పరిస్థితులు కలిసి ఏర్పడిన కొత్త పరిస్థితి.
4. సామాజిక - ఆర్థిక కరువు - సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడం, ఉత్పత్తి కారకాల, ఉత్పాదితల వ్యాపారంపై సరైన నియంత్రణ లేకపోవడం, వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టకపోవడం.

ఈ నాలుగు రకాల కరువులు దేశ వ్యాపితంగా వివిధ ప్రాంతాల్లో తాండవిస్తున్నాయి. మన దేశంలో సుమారు 30 పెద్ద నదులుండి, సంవత్సరానికి సగటున 800-900 మి.మీ. వర్షపాతం వుండి, ప్రపంచ నీటి వనరులలో 4 శాతం మన దేశంలోనే వున్నా దాన్ని వినియోగించుకోలేని మన పాలక వర్గాల ఆర్థిక విధానం దేశ ప్రజల్ని సామాజిక, ఆర్థిక మారణహోమానికి గురి చేస్తోంది.

అదే సమయంలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలోని అధికోత్పత్తి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రమైన ఉత్తరార్థగోళ పారిశ్రామిక దేశాలు తమ దేశాలలోని అధికోత్పత్తులతో అంతర్జాతీయ ద్రవ్యసంస్థల షరతుల ద్వారా, పొలిమేర

ప్రాంతాలైన దక్షిణార్ధగోళ వ్యవసాయక దేశాల మార్కెట్లను ఇబ్బడిముబ్బడిగా ముంచెత్తడం ద్వారా తమ దేశ సంక్షోభాలని పరిష్కరించుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దీంతో పొలిమేర దేశాల సామాజిక, ఆర్థిక వ్యవస్థలు తీవ్ర సంక్షోభాల్లోకి కూరుకుపోయినాయి. ఈ నేపథ్యంలో నుండే సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజా ఉద్యమాలు అనేక రూపాలలో ముందు కొస్తున్నాయి. అదే సమయంలో దోపిడీ పాలక వర్గాలు ఫాసిస్టు సామాజిక, ఆర్థిక సిద్ధాంతాలు, విధానాలతో సంక్షోభ పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

మౌలిక సమస్యలలో కెల్లా అత్యంత కీలకమైన ఆహార సమస్యలో అంతర్భాగమైనవి వ్యవసాయ ఆస్తి సంబంధాల సమస్య, వ్యవసాయక శ్రమ సంబంధాల సమస్య. ఈ సమస్యలు సంక్షోభ సమయాల్లో జరూరు పరిష్కారంకై ముందు నిలుస్తాయి. ఈ నేపథ్యం నుండే ఆంధ్ర రాష్ట్రంలో పాలకులు ప్రపంచ బ్యాంకు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానం అమలు పథకంలో భాగంగా వ్యవసాయ ఆస్తి సంబంధాల రీత్యా కాంట్రాక్టు వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయాన్ని ముందుకు తెస్తున్నారు. దీనికొరకు 1973 నాటి భూసంస్కరణల చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని యోచిస్తున్నారు.

అదే సమయంలో దాదాపు 70 శాతంగా వున్న వ్యవసాయ ఆధారిత జనాభాను 40 శాతం వరకు తగ్గించేందుకు, ధనిక దేశాల వ్యవసాయోత్పత్తులకు భారత మార్కెట్లను పెరడుగా మార్చేందుకు అన్ని రకాల సబ్సిడీలను ఎత్తి వేస్తున్నారు. వ్యవసాయం నష్టదాయకంగా మారడంతో చిన్న కమతాలలో సేద్యం అసాధ్యమైపోయింది. వ్యవసాయాన్ని జాతీయ, అంతర్జాతీయ వ్యవసాయ బేహారీ తోడేళ్ళకు ఆహారంగా పాలకులు మార్చి వేశారు. ఎగుమతుల ఆధారిత వ్యవసాయాన్ని పాలకులు ప్రోత్సహించడం, ఆహార ధాన్యాల సాగు నష్టదాయకం కావడంతో గ్రామాలు ఆహార స్వయం పోషక స్వభావాన్ని కోల్పోయాయి. ప్రపంచ మార్కెట్ జూదంలో వ్యాపార పంటల సాగు తీవ్రమైన అప్పుల వలయంలోకి రైతాంగాన్ని నెట్టడంతో కొనుగోలు శక్తి కోల్పోయి, గ్రామీణ జనాభా పెద్ద ఎత్తున కూటి కరువు బారిన పడ్డారు. బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, భూసంస్కరణలనే విషయాల పునాదిగా అనేక ప్రజా ఉద్యమాల్ని వివిధ ప్రజాస్వామిక, వామపక్ష విప్లవ పార్టీలు చేపట్టాయి.

వీటిలో, కోట్లాది మంది ప్రజల జీవన ప్రమాణాల్ని నిర్ణయించగలిగే అంశమైన భూ సంస్కరణలపై మేధావులు, రాజకీయ సిద్ధాంతవేత్తలు రెండు శత్రు శిబిరాలై చర్చిస్తున్నారు. వామపక్ష విప్లవ పార్టీలకు భూ సంస్కరణలనేవి ఒక కీలకమైన విప్లవ రాజకీయాంశంగా కూడ వుంది. జనాభాలో అతి తక్కువ శాతం మంది చేతిలో, అతి ఎక్కువ శాతం భూమి కేంద్రీకరింపబడి వుండడమనేది వ్యవసాయ ఆస్తి సంబంధాలు భూస్వామ్య విధానం యొక్క అంతస్సారం. భూస్వామ్య విధానాన్ని అంతం చేసి నూతన ప్రజాస్వామ్య విప్లవ విజయానికి దున్నేవానికే భూమి దక్కాలనేది వామపక్ష, విప్లవ పార్టీల కేంద్ర కర్తవ్యమై కూర్చొంది. ఈ పరిస్థితులలో దేశంలో వ్యవసాయం లాభసాటి కానేకాదు, సరికదా కనీసం తిండి గింజలు కూడా ఇవ్వలేని పరిస్థితులలో భూమిని నమ్ముకుని భూసంస్కరణలు అమలు జరపడం హాస్యాస్పదమైన విషయం, భూ పంపకమనేది పేదరికాన్ని పంపిణీ చేయడంగా పరిగణించాలని కొంతమంది మేధావులు వాదిస్తున్నారు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పారిశ్రామికాభివృద్ధి పై కేంద్రీకరిస్తూ కోట్లాదిమంది ప్రజలకు పారిశ్రామిక రంగంలో జీవనోపాధి కల్పిస్తూ సంక్షోభాన్ని పరిష్కరించాలని వాళ్ళ అభిప్రాయం. భూ కేంద్రీకరణ రూపంలో భూసంస్కరణలు జరగాలని ఈ మేధావులు వాదిస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో భారీ భూకమతాల ద్వారా జరిగే వ్యవసాయోత్పత్తి ఘోరంగా విఫలమైందని, తద్భిన్నంగా చిన్న కమతాల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెంచవచ్చని, మనకున్న ప్రాథమిక వనరులను పూర్తిగా వినియోగించుకోవచ్చని, కోట్లమంది జీవితాలు మెరుగు పరచగలమని, నేడు అనేక విధాలుగా రుజువైన వాస్తవమని కొంతమంది మేధావులు, ముఖ్యంగా వామపక్ష మేధావులు వాదిస్తారు. ఈ నేపథ్యంలో దున్నే వానికి భూమి దక్కాలనే రూపంలో భూ సంస్కరణలు జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో కేవలం భూముల పంపిణీ వల్ల సమస్య పరిష్కారం కాదు, ఆ రంగానికి కావల్సిన ఉపకరణాలు, నూతన టెక్నాలజీ, సాగునీరు, రుణ సౌకర్యం, మార్కెట్ వనరులను కూడా కల్పిస్తేనే వ్యవసాయం గిట్టుబాటవుతుందని వీరు వాదిస్తారు. భూ కేంద్రీకరణ రూపంలోని భూ సంస్కరణవాదం, తద్విరుద్ధంగా భూ పంపకం రూపంలోని భూ సంస్కరణ వాదం అనే రెండు భిన్న వాదాలు ఉనికిలో ఉన్నాయి. భూ కేంద్రీకరణ లేక వికేంద్రీకరణ రూపంలోని వ్యవసాయక ఆస్తి సంబంధాలు, వ్యవసాయక శ్రమ సంబంధాలు వివిధ చారిత్రక సందర్భాలలో సవ్య లేక అపసవ్య పాత్రల్ని పోషించాయి.

పదివేల సంవత్సరాల క్రితం మానవజాతి వ్యవసాయం ప్రారంభించడంతో భూగోళంపై వ్యవసాయక జాతులు, పశుపాలక జాతులుగా మొట్టమొదటి గొప్ప సామాజిక శ్రమ విభజన జరిగింది. ఆనాటి నుండి సాగిన సామాజిక ఉత్పత్తి రూపాలన్నీ పర్యావరణ పతనానికి దారితీసినవే. ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందే కొద్దీ ప్రకృతికి, సమాజానికి మధ్య సంబంధాలు మారుతూ వచ్చాయి. ప్రకృతిని మానవీకరించే క్రమం పెరిగే కొద్దీ మానవ ప్రకృతిలో, మానవ సంబంధాలలో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రకృతి, సమాజానికి మధ్య, సమాజంలోని వ్యక్తుల మధ్యగల పరస్పర

ప్రతిచర్యల ఫలితంగా భూమితో ముడిపడిన మానవ సంబంధాలు (ఆస్తి సంబంధాలు, శ్రమ సంబంధాలు, పంపిణీ సంబంధాలు) అనేక మార్పులకు గురైనాయి. మానవ జాతి అభివృద్ధి క్రమంలోని ఆదిమ, బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ, సోషలిస్టు, కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థల అభివృద్ధి క్రమానికి ఉత్పత్తి సంబంధాలలోని వ్యవసాయక ఉత్పత్తి సంబంధాల చలన క్రమం అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుంది. ఏ సామాజిక వ్యవస్థ అయినా వ్యవసాయక ఉత్పత్తి సంబంధాల పునాదిపై ఆధారపడే, పారిశ్రామిక ఉత్పత్తి సంబంధాల్ని పటిష్ట పరచుకోగలదు. వ్యవసాయక ఉత్పత్తి సంబంధాలు ప్రాథమికమైనవి. ఇవి వ్యవసాయక ఆస్తి సంబంధాలు, వ్యవసాయక శ్రమ సంబంధాలు, వ్యవసాయక పంపిణీ

వ్యవసాయక ఉత్పత్తి సంబంధాలు	ఆస్తిసంబంధాలు	శ్రమ సంబంధాలు	పంపిణీ సంబంధాలు
ఆదిమ సామాజిక వ్యవస్థ	సామాజికం	సామాజికం	సామాజికం
బానిస యాజమాని వ్యవస్థ	వ్యక్తిగతం	సామాజికం	వ్యక్తిగతం
భూస్వామ్య వ్యవస్థ	వ్యక్తిగతం	వ్యక్తిగతం	వ్యక్తిగతం
పెట్టుబడిదారీ వ్యవస్థ	వ్యక్తిగతం	సామాజికం	వ్యక్తిగతం
సోషలిస్టు వ్యవస్థ	సామాజికం	సామాజికం	వ్యక్తిగతం
కమ్యూనిస్టు వ్యవస్థ	సామాజికం	సామాజికం	సామాజికం

సంబంధాలుగా విభజింపబడి, వివిధ చారిత్రక సందర్భాలలో సామాజిక రూపాన్ని (కేంద్రీకరణ) లేదా వైయక్తిక రూపాన్ని (వికేంద్రీకరణ) సంతరించుకుంటాయి.

వ్యవసాయం నేర్వడం ద్వారా స్థిర జీవిత విధానానికి మళ్ళిన ఆదిమ సమాజ మానవులకు భూమి ఒక సమష్టి, ఉమ్మడి ఆస్తి. భూమిపై జరిగే ఉత్పత్తి కార్యకలాపం కూడా సమష్టిగా సాగేది. పెరుగుతున్న జనాభా అవసరాల్ని సమష్టి ఉత్పత్తి కార్యకలాపం ఇంకెంత మాత్రమూ తీర్చలేనిదిగా తయారైంది. ఆనాడు తన పోషణకు అవసరపడే దానికన్నా అదనంగా ఉత్పత్తి చేయగల శక్తి మానవ శ్రమ శక్తికి లేదు. ఈ సంక్షోభానికి పరిష్కారంగా పితృస్వామిక పెద్దల నాయకత్వంలోని కుటుంబాలకు సాగుభూమిని కేటాయించిన రూపంలో వ్యవసాయక శ్రమ సంబంధాలు ఉనికిలోకి వచ్చాయి.

పితృస్వామిక కుటుంబాల కింద వ్యవసాయోత్పత్తి జరిగింది. ఆదిమ పోడు వ్యవసాయం స్థానంలో దున్ని, కలుపుతీసి, స్థిరమైన మడిచెక్కల ద్వారా వ్యవసాయం చేయడంతో ఉత్పాదకత పెరిగింది, స్థిర వ్యవసాయ జీవితానికి అనుగుణ్యంగా సమాజంలో చేతివృత్తులు ఒక గొప్ప సామాజిక శ్రమ విభజనగా ఉనికిలోకి వచ్చాయి. సమాజంలో వ్యష్టి శ్రమ ఉత్పాదకత పెరిగినా చేతివృత్తుల శ్రమ విభజన కారణంగా గణనీయమైన జనాభా వ్యవసాయం నుండి దూరం కావడం, వ్యవసాయ కార్యకలాపాలు విస్తరించాల్సి రావడంతో మానవ శ్రమకు విపరీతమైన గిరాకీ పెరిగింది. మారిన పరిస్థితులకనువైన ఉత్పాదకత లేని కారణంగా చౌకగా దొరికే మానవ శ్రమశక్తి అవసరం ఏర్పడింది.

ఉత్పాదితాలు గణనీయమైన పరిమాణంలో ఏర్పడటం వలన మనుషులు గణం, తెగ అనేవాటి కంటే ఎంతో పెద్ద బృందాలుగా ఏర్పడగల్గారు. ఈ నేపథ్యంలో బానిసల ద్వారా వ్యవసాయం చేయబడింది. దాంతో చిన్న కమతాల సేద్యం స్థానంలో పెద్ద పెద్ద భూఖండాలు వచ్చాయి. లక్షలాది మంది బానిసల ద్వారా పెద్ద పెద్ద భూ కమతాలలో వ్యవసాయం సాగేది. బానిస యాజమాన్య వ్యవసాయ ఆస్తి సంబంధాలు వ్యక్తిగతమైనవిగాను, లక్షలాది బానిసల శ్రమను సంఘటితం చేసే సాధనంగా భూమి ఉంది కాబట్టి వ్యవసాయక శ్రమ సంబంధాలు సామాజికంగాను; వ్యక్తుల ప్రాతిపదికగా జరిగే వ్యవసాయక పంపిణీ సంబంధాలు వెలిశాయి. దాంతో బానిస యాజమాన్య వ్యవస్థలో పాదార్థిక సాంస్కృతిక సంపదలు బ్రహ్మాండంగా వృద్ధి చెందాయి.

ఆదిమ మొరటు ఉత్పత్తి విధానం పునాదిగా వ్యవసాయక ఆస్తి సంబంధాలు, వ్యవసాయక శ్రమ సంబంధాలు, వ్యవసాయక పంపిణీ సంబంధాలు అనే మూడు రకాల వ్యవసాయక ఉత్పత్తి సంబంధాలు ఆదిమ సమాజంలో సామాజిక రూపంలో ఉండేవి. ప్రకృతి, సమాజాల ఆదానప్రదాన క్రమం గండిపడని విధంగా, దెబ్బ తగలని విధంగా సమాజం ఉండేది. అందుకు తగ్గట్టుగా ఆదిమ సమాజంలోని మానవులంతా సామూహిక ఉత్పత్తిదారులుగా భూమండలంపై విస్తరింపబడి జీవించేవారు.

పెరుగుతున్న మానవ సమూహం ఉత్పాదకత పెరుగుదలను ధృవీకరిస్తే, ఉత్పాదకత పెరుగుదల శ్రమ విభజనను ధృవీకరించింది. శ్రమ విభజన విస్తృతి, వ్యాప్తి జరిగే కొద్దీ, మారక

సౌలభ్యం కోసం జనాభా కేంద్రీకరణ జరుగుతుంది. ఫలితంగా నగర రాజ్యాల ఆవిర్భావం, విశాలమైన రైతాంగ జనాభా భూమి నుండి తొలగింపబడిన వారిస్థానాలలో పెద్ద పెద్ద క్షేత్రాలు బానిసల ద్వారా సాగు చేయబడడం జరుగుతుంది. భూమి నుండి తొలగింపబడిన జనాభాను ఉపయోగించు కోగల పారిశ్రామికరంగ అభివృద్ధి లేకపోవడంతో ఈ జనాభా ఆ సమాజానికి గుదిబండగా మారి సామాజిక సంక్షోభానికి దారితీసింది.

అదే సమయంలో పెద్ద కమతాలలో సేద్యం చేయడం నగరాలకు వ్యవసాయోత్పత్తుల తరలింపుతో పెద్ద ఎత్తున భూసారం తరలించబడి, ఉత్పాదకత కోల్పోవడం ఒక వంక, దాన్ని పరిపూర్తి చేసుకునేందుకు అదనంగా విశాలమైన అటవీ ప్రాంతాన్ని కూడా సాగులోకి తేవడం ఇంకొక వంక జరిగింది.

ఈ చర్యల ఫలితంగా భూసారం దొంగిలించబడి పర్యావరణ విధ్వంసానికి, తద్వారా తిండి గింజల కొరత, తద్వారా సామాజిక సంక్షోభానికి దారి తీసింది. ఉపాధి లేక భూమిని కోల్పోయిన రైతాంగం, తీవ్రమైన, నీచమైన శ్రమ చేస్తూ, పశువులుగా చూడబడుతూ, క్రూరమైన అణచివేతకు గురవుతూ వ్యవసాయంలో వినియోగించబడుతున్న బానిసల ఒత్తిడి కారణంగా వ్యవసాయక ఉత్పత్తి సంబంధాల మార్పునకు దోహదం చేశాయి.

ఈ సామాజిక సంక్షోభం (భూసారం కోల్పోయి ఉత్పాదకత పడిపోవడం, ఉపాధి కోల్పోయిన రైతాంగం) విశాలమైన జనాభా చేతుల్లోకి భూమి వికేంద్రీకరింపబడటంతో మాత్రమే పరిష్కార మయ్యే పరిస్థితిని సృష్టించింది. బానిస యజమానుల చేతుల్లో కేంద్రీకరింపబడి పెద్ద కమతాల ద్వారా జరిగే స్థానంలో చిన్న చిన్న కమతాల ద్వారా సేద్యం చేస్తున్న ప్రజానీకం భూమిపై విశాలంగా విస్తృతంగా వెదజల్లబడి నివసించడం ద్వారా భూసారం తిరిగి భూమికి చెందుతూ, ప్రకృతి-సమాజాల మధ్య ఆదాన-ప్రదాన చర్యల సమతుల్యత సాధించేందుకు భూవికేంద్రీకరణ జరగాల్సిన పరిస్థితి అనివార్యంగా తలెత్తింది.

సమాజంలోని ఆర్థిక కార్యకలాపాలలో ఉత్పత్తి కొరకు సంపద నిరంతరం కేంద్రీకరింపబడుతూ, పునరుత్పత్తి కొరకు నిరంతరం వికేంద్రీకరింపబడుతూ వుంటుంది. ఒక సామాజిక వ్యవస్థ వికాస దశలో అదనపు విలువ ప్రోగుపడి సంపదలు వృద్ధి చెందుతాయి. సంక్షోభ దశలో సంపద పునర్విభజన దశగా వికేంద్రీకరింపబడే దిశగా సమాజ ప్రయాణం సాగి, నూతన సామాజిక శక్తుల పునాదిగా సంపద కేంద్రీకరింపబడుతుంది.

నూనత సామాజిక వ్యవస్థ యొక్క వికాసం నూతన సామాజిక శక్తుల పునాదిగా సంపద కేంద్రీకరణపై ఆధారపడి ఉంటుంది. నూతన సామాజిక శక్తుల పునాదిగా సంపద కేంద్రీకరణ సాగాలంటే పాత ప్రతిఘాతుక శక్తుల చేతిలోని సంపద వికేంద్రీకరింపబడాలి. ఇలా ఏదేని ఒక సామాజిక వ్యవస్థ యొక్క ఆవిర్భావం నుండి ఉచ్ఛ స్థాయికి వికాసం పొందేందుకు సంపద కేంద్రీకరణ ప్రధానాంశంగా సాగుతుంది. అలా చేరిన తరువాత వికాసం మాంద్యంగా పరిణమించి సంక్షోభం వైపుకు జరిగే ప్రయాణం సంపద కేంద్రీకరణకు అవరోధాల్ని ఏర్పరుస్తుంది. నూతన శక్తులు పాత తరహా సంపద కేంద్రీకరణకు స్వస్తి పలుకుతూ సంపద పునః పంపకాన్ని, వికేంద్రీకరణను చేపడుతాయి.

సంక్షోభ సమయాల్లో సంపద పునఃపంపకం లేక వికేంద్రీకరణ ధోరణి ప్రబలంగా కొనసాగి నూతన శక్తుల పునాదిగా నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. ఈ ఆవిర్భవించిన నూతన సమాజంలో నూతన శక్తుల పునాదిగా సంపద తిరిగి కేంద్రీకరింపబడడం ద్వారా నూతన సమాజం వికాసం పొందుతుంది.

సామాజిక ఆర్థిక వ్యవస్థ యొక్క శ్వాసక్రియగా సంపద కేంద్రీకరణ, వికేంద్రీకరణ కార్యకలాప క్రమం నిరంతరాయంగా సాగుతుంది. సమాజం యొక్క ఆవిర్భావం ఆర్థిక వికాసం, ఆర్థిక సంక్షోభాల సందర్భాలలో కేంద్రీకరణ, వికేంద్రీకరణ విధానాలు వస్తుగతంగా అనివార్యంగా అమలులోకి వస్తాయి.

సామాజిక సంక్షోభాలు 1. ఆస్తి సంబంధాలు పునాదిగా గల పంపిణీ సంబంధాల రీత్యా జరిగే ఆర్థిక కార్యకలాపాల పర్యవసానంగా సంభవిస్తాయి. 2. అదే సమయంలో మానవులు పెద్ద ఎత్తున లాభం సంపాదించాలనే ఆశతో సహజ ప్రకృతి క్రమంలో జోక్యం చేసుకోవడంతో ప్రాంతీయంగా పర్యావరణంలోని మార్పుల ఫలితంగా ఒడిదుడుకులు సంభవిస్తాయి. పునరుత్పత్తికి వీలులేని పరిమిత వనరులు అంతిమ స్థాయికి చేరుకున్నప్పుడు ఈ విధమైన ఉత్పాతాలు సంభవిస్తాయి. ఈ ఉత్పాతాలు సామాజిక సంక్షోభానికి దారితీస్తాయి. సింధూలోయ, సుమేరియన్, గ్రీకు, ఫొనీషియన్, రోమన్, మయా నాగరికతలు పతనం కావడంలో పర్యావరణ పరమైన కారణాలు కూడా వున్నాయని చారిత్రక పురావస్తు ఆధారాలు రుజువు చేస్తాయి.

ప్రకృతికి, పర్యావరణానికి మధ్యగల ఆదాన - ప్రదాన విధానం సమతుల్యతను కోల్పోవడంతో సామాజిక సంక్షోభాలు వచ్చాయి. మార్క్సిస్టు రాజకీయార్థ శాస్త్రంలోని మారకపు విలువ ఆధారిత విశ్లేషణ పార్శ్వం ఆర్థిక కార్యకలాపాల పునాదిగా సామాజిక సంక్షోభాల్ని వివరిస్తే; ఉపయోగపు విలువ ఆధారిత విశ్లేషణా పార్శ్వం ప్రకృతి - సమాజాల మధ్యగల ఆదాన ప్రదాన క్రమానికి గండి ప్రాతిపదికగా పర్యావరణం కోణం నుండి సామాజిక సంక్షోభాల్ని వివరిస్తుంది. ఈ రెండు కోణాలలో దేన్ని వదలి వేసినా చారిత్రక అర్థరాహిత్యానికి గురవుతాము. ఆ రెండు కోణాలు

పరస్పర పూరకాలుగా, పరస్పరాధారితాలుగా, పరస్పరచ్ఛేదకాలుగా వుంటాయి. సామాజిక సంక్షోభాల పరిష్కారం మారకపు విలువల కోణం నుండి ఆస్తి, పంపిణీ సంబంధాల కేంద్రీకరణ, ప్రజాస్వామికీకరణల రూపంలో సాగితే, ఉపయోగపు విలువ కోణం నుండి శ్రమ సంబంధాల కేంద్రీకరణ, ప్రజాస్వామీకరణ రూపంలో సాగుతుంది.

బానిస యాజమాన్య సామాజిక వ్యవస్థ వికాసం చెందాలంటే వ్యవసాయక ఉత్పత్తి సంబంధాలలోని వ్యవసాయక ఆస్తి సంబంధాలు వ్యక్తిగత రూపాన్ని; శ్రమ సంబంధాలు మరింత సామాజిక రూపాన్ని పొందాల్సి వుంటుంది. అంటే సంపదలు వ్యక్తిగత ఆస్తి రూపంలో కేంద్రీకరింపబడి, వేలాది మంది బానిసల శ్రమ సంఘటితం చేయడంలోనే ఆ వ్యవస్థ వికాసం వుంది. బానిస యజమానులు పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలలో వందలాది మంది బానిసలచే వ్యవసాయం చేపట్టి సంపదలు పోగేసుకునే క్రమంలో, ఇటలీ, రోమ్ నగరాలలోకి ప్రవాహంలా తేబడుతున్న బానిసల ద్వారా నగరేతర ప్రాంతాల్ని దోపిడీ చేయడంలో బానిన యజమానులు ధనికులైతే రైతాంగం చితికిపోయింది. బానిసల శ్రమతో జరిగే వ్యవసాయం చౌకగా వుండి, ధాన్యాన్ని చౌకగా నగరాలకు తరలించడంతో ధాన్యంధరలు పడిపోయాయి. చిన్న కమతాలలో ధాన్యం పండించే రైతాంగం దివాళా తీయడంతో వారు తమ పొలాల్ని బానిస యజమానులకు అమ్ముకోవాల్సి వచ్చింది. రైతాంగం వ్యవసాయం చేసిన భూములు, నివాసమున్న ప్రాంతాలలోనే బానిసలచే వ్యవసాయం, పశు పెంపకం సాగింది. చిన్న కమతాల స్థానే చౌక శ్రమ శక్తితో పెద్ద పెద్ద కమతాలలో సేద్యం విస్తరించింది.

దివాళా తీసిన రైతాంగం బతుకు దెరువుకై రోమ్ తదితర నగరాలకు వలసపోయారు. అనేక వేలమంది ప్రజలు నగరాలలో పోగుపడ్డారు. పనంతా బానిసల ద్వారా జరుగుతుండడంతో వీళ్ళంతా ఉపాధి కోల్పోయారు. దీంతో సామాజిక సంక్షోభం బద్దలైంది. పెద్ద కమతాల ద్వారా, చౌక శ్రమశక్తి ద్వారా సమాజ సంపద, సంస్కృతి వికసించాయి. ఇక్కడ సంపద కేంద్రీకరణ, శ్రమ సంబంధాల సామాజికీకరణ (వేలాది మంది బానిసల శ్రమ భూమి అనే ఉత్పత్తి సాధనం ద్వారా సమీకరింపబడటం) లేక కేంద్రీకరణ సామాజికాభివృద్ధికి దోహదం చేశాయి. చరిత్రగతిలో సవ్యమైన ప్రభావాన్ని నెరపాయి. అయితే, వికాసం అత్యున్నత స్థితికి చేరుకున్నాక ఈ రెండు కేంద్రీకరణలు సమాజానికి గుదిబండలుగా తయారైనాయి.

వ్యవసాయ ఆస్తి సంబంధాలు, వ్యవసాయక శ్రమ సంబంధాలు వికేంద్రీకరింపబడకుండా సంక్షోభం పరిష్కరించబడని అనివార్య పరిస్థితి తలెత్తింది. దీని నేపథ్యం నుండి క్రీ.పూ. 6వ శతాబ్దిలో ఏథెన్స్‌కు చెందిన రాజనీతిజ్ఞుడు సొలోన్ సంపన్నుల చేతిలో భూకేంద్రీకరణను నియంత్రించేందుకు ప్రయత్నించాడు. అంతకంటె మరింత స్పష్టతతో క్రీ.పూ. 133లో టైబేరియస్ గ్రాఖి ఒక్కొక్క కుటుంబానికి 625 ఎకరాలకు మించిన భూమి ఉమ్మడి క్షేత్రంగా ఉండరాదని, అంతకు మించిన భూమిని ప్రభుత్వం సేకరించి దాన్ని అమ్మే హక్కులేని విధంగా పేదలకు పంచాలని భూ సంస్కరణల చట్టాన్ని తెచ్చాడు. అదే విధంగా క్రీ.పూ. 7వ శతాబ్దిలోని చైనా రాచరికం భూసంస్కరణలకు ప్రయత్నించింది. బానిస తిరుగుబాట్లు, జర్మన్-స్లావోనిక్ బర్బర జాతుల దాడులు, భూములు కోల్పోయిన రైతాంగపు తిరుగుబాట్లు వెరసి బానిస యజమాన్య సమాజాలు శిథిలమైనాయి. ఈ సామాజిక కలచివేత వ్యవసాయ ఆస్తి సంబంధాల, వ్యవసాయ శ్రమ సంబంధాల వికేంద్రీకరణ పునాదిగాను, నగరాలలో కేంద్రీకరించబడిన ఆస్తి సంబంధాల, వ్యవసాయక శ్రమ సంబంధాల వికేంద్రీకరణ పునాదిగాను, నగరాలలో కేంద్రీకరించబడిన జనాభా విస్తారమైన జనావాసాలలోకి వికేంద్రీకరింపబడాల్సిన ఆవశ్యకత పునాదిగాను సంభవించింది.

అసంఘటితమైన, విస్తారమైన జనావాసాలు అవతరించాయి. ఉపాధి కోల్పోయిన నగరాలలో కేంద్రీకరింపబడ్డ జనాభా వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల వికేంద్రీకరణతో ఉపాధిని పొందారు. అదే సమయంలో పెద్ద కమతాల వ్యవసాయం స్థానంలో చిన్న కమతాల వ్యవసాయం రావడం, జనాభా విస్తృతంగా జనావాసాలలో వికేంద్రీకరింపబడడంతో భూసారం పునః సమీకరింపబడి ఉత్పాదకత పెరగడంతో సామాజిక ఉపశమనం కలిగింది. ఈ చారిత్రక సందర్భంలో వికేంద్రీకరణ లేక భూ పంపిణీ రూపంలోని సంస్కరణలు చారిత్రకంగా సవ్యమైన ప్రభావాన్ని కలిగించాయి.

ఈ వికేంద్రీకృత, అసంఘటిత జనావాసాల నుండి అంటే బానిస యాజమాన్య వ్యవస్థ శిథిలాలనుండి నూతన శక్తులైన ఫ్యూడల్ వర్గాల పునాదిగా వ్యవసాయక ఆస్తి సంబంధాలు కేంద్రీకరింపబడటంతో, ఫ్యూడలిజం వ్యవస్థీకరింపబడి అభివృద్ధి చెందింది. సామాజిక సంపద సొంత ఆస్తిగా ఒక వైపు కేంద్రీకరింపబడుతుంటే, ఇంకొకవైపు ఫ్యూడల్ భూస్వాముల కింది విశేష జనసామాన్యం కౌలుదార్లుగా విడివిడి మడిచెక్కలలో చిన్న కమతాలలో వ్యవసాయోత్పత్తి సాగిస్తున్నారు. ఇక్కడ వ్యవసాయక శ్రమ సంబంధాలు వికేంద్రీకరణ రూపంలో ఉనికిలో ఉన్నాయి. ఫ్యూడల్ వ్యవస్థ వికాసంలో విస్తారమైన జనావాసాలలోని స్వకీయ అణువులుగా, లేక ఇసుక రేణువుల సమూహంగా, లేక వేటికవిగా విడిగా వుండే పూర్ణ విషయాలుగా లేక గ్రామ జీవితపు సంకుచిత స్వభావాలుగా వుండే అశేష కౌలు రైతాంగం నుండి బలవంతంగా

రెండు రెళ్ళు ఆరు

- 1998లో సామ్యూల్ బ్లిక్సన్ అనే జర్నలిస్టు ఒక చక్కని పోలిక చేశాడు. ఉర్సుగ్వేలోని పెద్ద క్రిమినల్ గ్యాంగ్‌లు చేసిన యాభై అతి పెద్ద దోపిడీల్లో 5 మిలియన్ డాలర్లు దోచుకున్నారు. అదే దేశంలో ఓ బ్యాంకు, ఓ ఫైనాన్సు కంపెనీ ఓనరూ కలిసి దోచుకున్న ప్రజాధనం విలువ 70 మిలియన్ డాలర్లు.
- 1999లో అమెరికన్ జైళ్ళలో 1.8 మిలియన్ ఖైదీలు ఉన్నారు. పదేళ్ళనాటి సంఖ్యకిది రెట్టింపు కన్నా ఎక్కువ బెయిల్‌పై బయట ఉన్నవారినీ, పేరూల్‌పై / హౌజ్ అరెస్ట్ అయిన వారినీ కలుపుకుంటే ఆ సంఖ్య మూడు రెట్లవుతుంది. ఇది దాదాపు డెన్మార్క్ దేశపు జనాభాతో సమానం.
- అమెరికాలో ప్రజా రవాణా వ్యవస్థను కేవలం 5 శాతం ప్రజలు మాత్రమే వాడతారు. యూరప్‌లో దాదాపు 15 శాతం ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను వాడతారు.
- ప్రపంచంలోని ఇరవై శాతం ప్రజలు ఎనభైశాతం కార్లకు యజమానులు
- ప్రపంచంలోని పది మంది అత్యంత ధనవంతుల ఆస్థులు యాభై దేశాల ఉత్పత్తితో సమానం.
- గత యాభై ఏళ్ళలో ధనవంతులు రెట్టింపు అయితే పేదవారి సంఖ్య మూడు రెట్లు అయింది.
- ఐక్యరాజ్యసమితి శాంతిని నెలకొల్పడానికి ఖర్చుచేసే ప్రతి డాలర్‌కు, యుద్ధం చేయడానికి రెండు డాలర్లు ఖర్చు చేస్తు న్నాయి ప్రపంచదేశాలు.

కౌలు రూపంలో సమీకరింపబడే అదనపు విలువ కీలకమైనదిగా ఉండింది. ఉత్పత్తి దారుల నుండి విడిపోతున్న ఈ అదనపు విలువ ఫ్యూడల్ ప్రభువుల సంపదలను ఒకవైపు పెంచుతుంది. ఇంకొకవైపు ప్రత్యక్ష ఉత్పత్తిదారులకు పునరుత్పత్తిని పెంపొందించుకోగల అవకాశాన్ని హరించి వేస్తుంది. ఫ్యూడల్ సంపద సమీకరణ ఒక దశకు చేరినాక, జనావాసాలు క్రమంగా మార్కెట్‌తో అనుబంధింపబడే క్రమం కొనసాగే కొద్దీ, వాణిజ్యం అభివృద్ధి కావడంతోను, సమాజం తిరిగి వ్యవస్థీకరింపబడే క్రమం మొదలవుతుంది. నూతన శ్రమ విభజనలు జరిగి, నూతన అవసరాలు సమాజాన్ని ఆవరిస్తాయి. ఈ క్రమంలో వ్యవసాయ ఆస్తి సంబంధాలే కాకుండా, వ్యవసాయ శ్రమ సంబంధాలు కూడా సంఘటితం చేపడతాయి. లేక కేంద్రీకరించబడతాయి. వాణిజ్యానికి అనుగుణంగా విశాలమైన వ్యవసాయ క్షేత్రాలు ఉనికిలోకి వస్తాయి. ఉన్ని, ప్రత్తి, చెరకు వగైరా సేద్యాలు వ్యవసాయరంగాన్ని ఆక్రమిస్తాయి. దానితో పెద్ద పెద్ద క్షేత్రాలు ఉనికిలోకి వచ్చి రైతాంగాన్ని తిరిగి భూమి నుండి వెళ్ళగొడతాయి. ఈ జనమంతా తిరిగి ఫ్యూడల్ నగరాలలో కేంద్రీకరింపబడే క్రమం సాగుతుంది. నాగరికతా వికాస కేంద్రం జీవనాధారాల రూపంలో ప్రకృతి సంపద వున్న ప్రాంతాలైన దక్షిణార్ధ గోళ జనావాసాల నుండి శ్రమ సాధనాల రూపంలో ప్రకృతి సంపద వున్న ప్రాంతాలైన ఉత్తరార్ధ గోళ జనావాసాల వైపుకు క్రమంగా మళ్లుతుంది. దాంతో యూరప్‌లోని ఫ్యూడలిజంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్రీకరణ ప్రక్రియ యూరప్ సామాజిక వికాసాన్ని అత్యున్నత స్థితికి కొనిపోయింది. ఆ స్థాయికి చేరుకున్నాక సంభవించే మారక విలువల కోణంలోని అధికోత్పత్తి సంక్షోభం ఉపయోగ విలువ కోణంలోని పర్యావరణ సంక్షోభం వెరసి సామాజిక సంక్షోభం యూరప్‌ను తలక్రిందులు చేసింది. నూతన అమెరికా ఖండం కనుగొనడం, ఆసియా ఖండానికి సముద్ర మార్గం కనుగొనడం వగైరా నూతన ఆవిష్కరణలు సంక్షోభ పరిష్కారానికి కొత్త దారులు వేశాయి. యూరప్‌లోని అదనపు జనాభాకు ఉపాధి కొరకు అమెరికా వ్యవసాయ క్షేత్రాలు పరిష్కారంగా నిలిచాయి. అదనపు జనాభా అమెరికాకు వలస పోవడంతో సంక్షోభం ఉపశమించింది. ఉత్పాదకత కోల్పోతున్న యూరప్ భూములకు ప్రత్యామ్నాయంగా అమెరికాలోని సారవంతమైన భూముల్ని యూరప్ వాసులు ఆక్రమించుకోవడంతో తిండి కొరత పరిష్కరించబడింది. యూరప్ సమాజంలో ఉన్ని, ప్రత్తి, చెఱకులాంటి వ్యవసాయాధారిత వాణిజ్య పంటల పునాదిగా సంపదలు పొగై, వాణిజ్య పునాదిగా కొత్త సామాజిక శక్తులు (వ్యాపార వర్గం) ఉనికిలోకి వచ్చాయి. ఈ నూతన సామాజిక శక్తుల వద్ద కేంద్రీకరింపబడే సంపదకు కూడా వ్యవసాయమే పునాది. ఏ నూతన ఆవిర్భావానికైనా వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల చలన క్రమమే ప్రాథమికమైనదిగా వుంటుంది. యూరప్‌లోని ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాల కేంద్రీకరణ ఫలితంగా ఏర్పడ్డ సామాజిక సంక్షోభానికి అమెరికా ఖండాన్ని కనుగొనడం ఒక ఉపశమనంగా ఉపయోగపడింది. సంపద వ్యక్తిగత కేంద్రీకరణ, శ్రమ సంబంధాలు వ్యక్తిగత స్వభావంతో ఉండడం లేక వికేంద్రీకరింపబడి ఉండడం ఫ్యూడల్ సమాజ మౌలిక స్వభావం.

(మిగతా వచ్చే సంచికలో)

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సి.ఎస్.ఇ.

- సిడిఆర్‌సి రీసెర్చి విభాగం

అది 1974. హిమాలయ పర్వత సానువుల్లో ఉన్న రెని అనే పల్లెటూరి మహిళలు తమ ఊరి దరిదాపుల్లోని చెట్లను ప్రభుత్వం నరకకుండా ఆ చెట్లనే కావలించుకుని రక్షించుకున్న మహోన్నత ఉద్యమం పుట్టిందక్కడ. అదే ఆ తరువాత చిప్‌కో ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది.

సరిగ్గా అదే సమయంలో హిందూస్తాన్ టైమ్స్ పత్రికలో విలేకరిగా ఉండిన అనిల్ కుమార్ అగర్వాల్ అనే యువ ఇంజనీరు ఈ ఉద్యమ వార్తలని తన పత్రిక కోసం సేకరించేవాడు. ఆ ఉత్తేజకరమైన వార్తలని రాసే క్రమంలో అనిల్‌కు పల్లె ప్రజల జీవన స్థితిగతులు అర్థమైనాయి. వారు తమ నిత్యావసరాలైన నీరు, వంటచెరకు, పశుగ్రాసం, ఎరువులు, నిర్మాణ సామాగ్రి, ఔషధాల కొరకు చుట్టూ ఉన్న ప్రకృతిసిద్ధమైన వనరుల పైనే ఆధారపడతారనీ, పల్లెల ఆర్థిక పరిపుష్టికి వాటికి స్వంత వనరులు ఉండటం అవసరమనీ ఆయనకు అవగతం అయింది.



ఆ అవగాహనే అనిల్‌ను పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేసేలా పురిగొల్పింది. పల్లె పేదలు తమ మనుగడ కోసం పర్యావరణంపై ఎంతగా ఆధారపడ్డారో తెలుసుకున్న అనిల్ అగర్వాల్ 1980లో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సి.ఎస్.ఇ.)ని నెలకొల్పారు.

పాతికేళ్ళ క్రితం ఢిల్లీలో ఒక చిన్న అద్దె భవనంలో పన్నెండు మంది ఉద్యోగులతో ప్రారంభించబడ్డ సి.ఎస్.ఇ. నేడు అత్యాధునికంగా తీర్చిదిద్దిన బహు అంతస్తుల భవంతిలో 125 మంది ఉద్యోగులతో నడిచే అంతర్జాతీయ సంస్థగా ఎదిగింది.

ఇరవయ్యేళ్ళపాటు నిర్విరామంగా పర్యావరణ పరిరక్షణ కోసం శ్లాఘనీయమైన కృషి సల్పిన అనిల్ అగర్వాల్ జనవరి 2002లో క్యాన్సర్ వ్యాధితో మరణించారు. కానీ ఆయన మరణం సి.ఎస్.ఇ.ని నిలువరించలేదు. అనిల్ శిష్యురాలు సునీతా నారాయణ్ సి.ఎస్.ఇ.ని తన గురువు, పథ నిర్దేశకుడైన అనిల్ ఆలోచనలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు నడిపిస్తున్నారు.

కోక్, పెప్సీ వంటి శీతల పానీయాలలో హానికరమైన పురుగు మందుల అవశేషాలు ఉన్నాయని సునీత నేతృత్వంలో సి.ఎస్.ఇ. నివేదిక వెలువరించినప్పుడు కలిగిన సంచలనం అంతా ఇంతా కాదు. సమాజాన్ని ఒక కుదుపు కుదిపిన ఆ నివేదిక ప్రభావం పార్లమెంటుపై కూడా పడింది. ప్రభుత్వం ఈ విషయంపై ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని కూడా నియమించింది. సి.ఎస్.ఇ. నివేదిక ప్రభావంతో శీతల పానీయాల మార్కెట్ కుప్పకూలింది. నెలలు గడుస్తున్నా ప్రజలు ఇంకా శీతల పానీయాలంటే విముఖత చూపిస్తున్నారంటే సునీత బృందం చేసిన మంచి పని ప్రభావం తెలుస్తుంది.

సునీత కృషిని గుర్తించి భారత ప్రభుత్వం ఈ యేడు ఆమెకు పద్మశ్రీ ఇచ్చి సత్కరించింది. మొన్న మార్చిలో మీడియా వ్యక్తులకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక ఛమేలీ దేవి అవార్డు కూడా సునీతకు లభించింది. అంతేకాదు నీటి పరిరక్షణ కోసం, వాటర్‌షెడ్‌ల అభివృద్ధి కోసం సి.ఎస్.ఇ. చేస్తున్న కృషికి ప్రతిఫలంగా 2005 స్టాక్‌హోమ్ వాటర్ ప్రైజు లభించింది.

ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరితమైన నగరాలలో ఒకటైన ఢిల్లీ నగరంలో సి.ఎస్.ఇ. నడిపిన కాలుష్య వ్యతిరేక ఉద్యమం పుణ్యమా అని అక్కడి పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఢిల్లీ రోడ్లపై ఇప్పుడు సహజ వాయువుతో నడిచే బస్సులు, ఆటోలు తిరుగుతున్నాయంటే దాని వెనుక ఉన్నది సి.ఎస్.ఇ. కృషే.

పరిశ్రమలకు గ్రీన్ రేటింగ్ ఇచ్చే పనిని కూడా సి.ఎస్.ఇ. చేపట్టింది. కాగితం, ఆటోమొబైల్, క్లోర్ ఆల్కలీ పరిశ్రమల్లో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశ్యం పరిశ్రమల కాలుష్య నివారణ చర్యల పనితీరునూ, పరిశ్రమల పర్యావరణ స్పృహనూ కొలిచి రేటింగ్ ఇవ్వడం. మన రాష్ట్రంలో ఐటీసీ భద్రాచలం పేపర్‌బోర్డ్స్‌లోనూ, ఎపి పేపర్ మిల్స్, రాజమండ్రిలోనూ సి.ఎస్.ఇ. ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసింది.

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న నీటి కొరతకు కారణం నీటిని సరిగా వినియోగించుకోకపోవడం, దానిని సరిగా నిల్వ చేయకపోవడం అని సి.ఎస్.ఇ. భారీ ఎత్తున ప్రచారం చేస్తోంది. ఇందుకోసం www.rainwaterharvesting.com అనే వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించింది. దేశంలోనే అగ్రశ్రేణి పర్యావరణ పత్రిక 'డౌన్ టు ఎర్త్'ను సి.ఎస్.ఇ. ప్రచురిస్తుంది. సునీతా నారాయణ్ పత్రికకు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

ఎన్‌జివోలు అంటేనే విముఖత ఏర్పడే ఈ రోజుల్లో నిబద్ధతతో ప్రజలకోసం పనిచేస్తున్న సెంటర్‌ఫర్ సైన్స్ ఎండ్ ఎన్విరాన్‌మెంట్‌ను అభినందించాలి.

❑

(13వ పేజీ తరువాయి)

స్పష్టం అవుతుంది. మామూలుగా అంచనాలు ఎక్కువ వేస్తారు. దీనికి తోడు ప్రి క్వాలిఫికేషన్ ప్యాకేజీలు, ఎల్ మాయల ఫలితంగా ఈ 46 వేల కోట్ల రూపాయలలో కనీసం రాష్ట్రం పోగొట్టుకొనేది, అస్మదీయలకు అధికంగా చేరేది వేలకోట్లల్లో ఉంటుందనేది వాస్తవం. దీన్ని నిలదీసి న్యాయం కోసం చర్చల్లో వెలుగులోకి తేవటం యిరువర్గాల బాధ్యత.

గత ప్రభుత్వం (నేటి ప్రతిపక్షం) దేవాదుల ప్రాజెక్టు టెండర్ల విషయంలో కేవలం రెండు కంపెనీలకు మాత్రమే అవకాశం యివ్వటం జరిగింది. అలానే గత ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ బోర్డును చిత్రవధ చేయకముందు ఒక మెగావాట్ విద్యుదుత్పత్తిని రూ.రెండుకోట్ల 50 లక్షలకు చేస్తామని బోర్డు ఉద్యోగ సంఘాలు మొత్తుకున్నా వినకుండా ఏకంగా నిర్భయంగా రూ. 4 1/2 కోట్లకు ప్రైవేటు కంపెనీలకు నజరానాలను బహూకరించటం జరిగింది గదా. అనగా యిరువర్గాలకు అస్మదీయులకు పంచటమే పరమావధి అని అర్థమవుతుంది.

కాబట్టి ప్రతి ఆదివారం సాగుతున్న చర్చలో జరుగుతుంది ప్రజల సొమ్ము వృధా కాకుండా చేసే యత్నంగాదు, కేవలం మాకు రాలేదే అనే స్వాహాయనమఃలో భాగమే.

కాబట్టి జరగవలసింది యిప్పటికైనా నిష్ణాతులు, నిజాయితీ పరులైన యింజనీర్లతో ఒక కమిటీని వేసి ఎస్టిమేట్ల తయారీ టెండర్ల కేటాయింపు. ప్రాజెక్టుల నిర్మాణ నిర్వహణ పర్యావరణ ముఖ్యంగా, ప్రాజెక్టు నిర్వాసితుడు ప్రథమ లబ్ధిదారుడుగా ఒక విధానాన్ని రూపొందించి ఆ కమిటీ ఆధ్వర్యంలో పనులకుపక్రమించాలి. కమిటీలో రాజకీయనాయకులు, ప్రభుత్వ ఉద్యోగులుండకూడదు. కమిటీ సిఫారసులు, సూచనల ప్రకారం డిపార్ట్‌మెంటు యింజనీర్లు, సంబంధిత అధికార్ల సూపర్ విజన్‌తో ప్రాజెక్టులను బహుళార్థ సాధక ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలి. అయితే యిప్పటికే జరిగిన, పూర్తి అయిన సంబంధిత ఎస్టిమేట్లను, టెండర్లను పారదర్శకంగా అనుమతించి యింజనీర్ల కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం కొనసాగాలి. అదే తగిన పరిష్కారం. ఆ కమిటీకి స్వతంత్ర ప్రతిపత్తిని కలుగజేస్తూ ప్రభుత్వం చట్టబద్ధత కలగచేయాలి. అప్పుడు ఐదేళ్ళలో 26 ప్రాజెక్టులకు భద్రత, పరిపూర్ణత ఏర్పడుతుంది.

'భారతదేశ సంపద అంతా ఆ దేశంలో వున్న జలమే దాని వినియోగం పైనే దేశ బంగారు భవిష్యత్తు ఆధారపడి వుంది. ఈజిప్ట్ దేశంలో జలం ఆ దేశానికి ఎలా సంపదను సమకూరుస్తుందో, భారత్‌లో గూడా జలమే సంపదగా సమకూరుతుంది. లార్డ్ థఫ్రిక్ ఏ విధంగా ఈజిప్ట్‌ను నునంపన్నం చేశారో, అటువంటి రాజనీతిజ్ఞుడు ఇండియాకు అవసరం. ఇతర సమస్యలకంటె జల సంపద వినియోగమే భారత దేశంలో ప్రధాన అంశం' అని 1898లో భారతదేశానికి రాసిన లేఖలో సర్ ఆర్థర్ కాటన్ అన్నారు.

❑

(14వ పేజీ తరువాయి)

ప్రభుత్వ విభాగాలను సక్రమంగా పని చేయిస్తే వృధా వ్యయం ఆదా అవుతుంది.

ఈనాడు ప్రాజెక్టు నిర్మాణంలో పారదర్శకత పేరుతో అనుసరిస్తున్న విధానాలు అనేక అవకతవకలకు దారి తీస్తున్నాయి. టెండర్లలో 30, 40 శాతం తక్కువకు వేసి అనంతరం డీవియేషన్ పేరుతో ఈ లోటుని భర్తీ చేస్తున్నారు. కొన్ని ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయి (అన్నమయ్య). ప్రాజెక్టుల నిర్మాణం సరిగా జరగకపోతే దీనివల్ల జరిగే నష్టం ఆ ప్రాజెక్టు కింది మునిగిపోయిన గ్రామాల జనాభా,పంటలు,ఆస్తినష్టం అపారంగా వుంటుంది. సునామీ, వరదలు, భూకంపాల ఉపద్రవాలకు తోడు ఇవి కూడా తోడవుతాయి. ప్రభుత్వ రంగంలో నిర్మించిన ప్రాజెక్టులలో ఇంతవరకు ఇటువంటి పరిస్థితి ఏర్పడలేదు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రభుత్వం నిర్వహించినప్పుడు ప్రభుత్వ సిబ్బంది జవాబుదారీతనం ఉంటుంది.

ఇప్పటివరకు ప్రభుత్వ రంగంలో సక్రమంగా పనులు జరగకపోవడానికి కారణం సరిపడా నిధులు విడుదల చేయకపోవడం,నిర్వహణా నిధులు కేటాయించకపోవడం.. ప్రపంచ బ్యాంక్ అధ్యయనంలో ప్రాజెక్టుకు అవసరమయ్యే నిర్వహణా నిధులు తగినంత కేటాయించకపోవడం వలన అస్తవ్యస్తంగా ఉన్నాయని సూచించింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల సామర్థ్యం మన దేశంలో 35-40 శాతం కాగా అభివృద్ధి చెందిన దేశాలు 55-60 శాతం మధ్య ఉంది. ఇజ్రాయిల్ దేశం 70 శాతం సామర్థ్యం సాధించింది.

ఇ.పి.సి. విధానం వలన అంచనాలు కంట్రాక్టర్ల చిత్తం వచ్చినట్లు పెరిగిపోయాయి. రాజకీయనాయకులు, బ్యూరోక్రాట్ల వత్తిడితో కొద్ది మంది ఉన్నతాధికారులు ఇష్టమొచ్చినట్లు అంచనాలు పెంచివేసి కోట్లాది రూపాయల ప్రజాధనం లూటీ చేస్తున్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది గత్యంతరం లేని స్థితిలో వీటిని ఆమోదించవలసి వస్తోంది.

కాబట్టి కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించే ఈ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనం వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ 50 వేల కోట్ల రూపాయల అప్పుల భారం వహించాల్సింది ప్రజలే. అలాగే ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, వాస్తవాలను ప్రజలకు తెలియచేస్తూ ప్రజా సంక్షేమానికి చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత విద్యావంతులు, మేధావంతులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల మీద ఉంది.

❑

కొత్త పుస్తకాలు

'వీక్షణం' లో ఇకనుంచి ప్రతి సంచికలోనూ పుస్తక సమీక్ష, పుస్తక పరిచయం, పుస్తక స్వీకారం ఉంటాయి. అయితే సామాజిక, ఆర్థిక పత్రికగా 'వీక్షణం' ఈ శీర్షికల కింద సృజనాత్మక సాహిత్య ప్రక్రియల (కవిత్వం, కథ, నవల, నాటకం, సాహిత్య, విమర్శ, దృశ్య కళారూపాలు) పుస్తకాలను పరిచయం చేయాలనుకోవడం లేదు. ఇవాళ తెలుగులో సామాజిక, ఆర్థిక, రాజకీయ, తాత్విక, చారిత్రక అంశాలకు సంబంధించిన ఎన్నో విశ్లేషణాత్మక పుస్తకాలు వెలువడుతున్నాయి. వ్యాసం, వాదం, విశ్లేషణ, చర్చ రూపంలో ఉంటున్న ఈ పుస్తకాల సమీక్ష, పరిచయం, స్వీకారంలకు ఈ శీర్షిక పరిమితమవుతుంది. ప్రచురణకర్తలు తమ పుస్తకాలను రెండు కాపీల చొప్పున వీక్షణం కార్యాలయానికి పంపాలి.



కోళ్ళ మంగారం - మరికొందరు, సామాన్యుల పరిచయ వ్యాసాలు - కందుకూరి రమేష్‌బాబు, 154 పేజీలు, 1/8 క్రౌన్, వెల: వ్యక్తులకు రు.10, సంస్థలకు రు.60, ప్రతులకు: కందుకూరి రమేష్‌బాబు, బి 61, ప్లాట్ నం.205, డెఫోడిల్స్ అపార్ట్‌మెంట్స్, శివం రోడ్, డి.డి. కాలనీ, హైదరాబాద్ 500 007.



గణిత గమనం - హిస్టరీ, షార్ట్‌కట్స్ అండ్ వండర్స్ - వీరా, 106 పేజీలు, 1/8 డెమీ, వెల: రు.55, ప్రతులకు: ఉమా భూమికా పబ్లికేషన్స్, 6-2-7/26, జ్యోతినగర్, హైదరాబాద్ రోడ్, జనగాం, వరంగల్ జిల్లా - 506 167.



స్వాతంత్ర్యానంతర భారతదేశం - స్త్రీల స్థితీ గతీ - తోట జ్యోతీరాణి, కాత్యాయనీ విద్మహే, బుర్ర రాములు, హజారి గిరిజారాణి - 158 పేజీలు, 1/8 డెమీ, వెల: రు.60.



ప్రాచీన భారత రాజకీయార్థిక నిర్మాణాలను ప్రతిబింబించిన రచనలు - మహిళల జీవితం - కాత్యాయనీ విద్మహే, తోట జ్యోతీరాణి, బుర్ర రాములు, 84 పేజీలు, 1/8 డెమీ, వెల: రు.40. ఈ రెండు స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణలు ప్రతులకు: ప్రొ.టి.జ్యోతీరాణి, మయూఖ, 5-11-176, నయీంనగర్, వరంగల్ - 506 009.




కన్యాశుల్కం - సామాజిక సంబంధాలు - కాత్యాయనీ విద్మహే, 128 పేజీలు, 1/8 డెమీ, వెల: రు.50. ప్రచురణ: జిజ్ఞాస ప్రచురణలు. ప్రతులకు: కాత్యాయనీ విద్మహే, 5-11-667, పశ్యంతి. కాకతీయ విశ్వవిద్యాలయం రోడ్, విద్యారణ్యపురి, వరంగల్ - 506 009.



నీటిగోస - ఆర్ సత్యనారాయణ, రీజినల్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రచురణ, 166 పేజీలు, 1/8 డెమీ, రు.25. ప్రతులకు: రీజినల్ డెవలప్‌మెంట్ ఫోరం, జి-16, పల్లవి అపార్ట్‌మెంట్స్, వినాయకనగర్, బాలానగర్, హైదరాబాద్ - 500 042.



ఫ్లోరోసిస్ - నీరిచ్చిన శాపం - నిరుపేదల పైనే ప్రతాపం - డాక్టర్ డి.రాజారెడ్డి, డాక్టర్ పానుగోటి కృష్ణారెడ్డి - విరాట్ ప్రచురణలు, 132 పేజీలు, 1/8 డెమీ, రు.30. ప్రతులకు: నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 3-3-859/1/బి, ఫస్ట్‌ఫ్లోర్, ఆర్య సమాజ్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్ - 500 027.



Retrospect and Prospect of State Finances - Editors: Y.V. Krishna Rao, Prof. M.L. Kantha Rao. Neelam Rajasekhar Reddy Research Centre publication, 220 pp. 1/8 demy, Rs. 75. For copies : Visalandhra Book House, Vignan Bhavan, 4-1-435, Bank Street, Hyderabad-500 001.

మీ ఆరోగ్య సౌభాగ్యాల సంరక్షణలపై శ్రద్ధ వహిస్తూ

ఆంధ్రాబ్యాంక్ అందిస్తోంది

వైవిధ్య భరితమైన జంట పథకాలు



ఎబి జీవన్ ప్రకాష్

ఎబి జీవన్ ప్రకాష్ ప్లస్

వయోజనులకు / సీనియర్ సిటిజెన్‌లకు ఎలాంటి వైద్య పరీక్షలూ లేకుండానే
జీవితబీమా మరియు ఆరోగ్య బీమా కల్పించే వినూత్న కాల పరిమితి ఖాతా!

ప్రధానాంశాలు

వివరాలు	ఎబి జీవన్ ప్రకాష్	ఎబి జీవన్ ప్రకాష్ ప్లస్
వయోపరిమితి	55 ఏళ్ళు పైబడి 60 ఏళ్ళ వరకు	60 ఏళ్ళ పైబడి 65 ఏళ్ళవరకు
బీమా సౌకర్యం	జీవిత మరియు ఆరోగ్యబీమా	ఉచిత జీవిత మరియు ఆరోగ్య బీమా
డిపాజిట్ మొత్తం	కనీస మొత్తం రు.20,000 లు	రెండు విధాలుగా లభ్యం 1) రు.1,00,000 లేక 2) రు.2,00,000
కాల పరిమితి	కనీసం 1 సం॥ నుండి గరిష్ఠంగా 5 సం॥ల వరకు	కనీసం 1 సం॥ నుండి గరిష్ఠంగా 5 సం॥ల వరకు
వడ్డీ రేటు	దేశీయ కాలపరిమితి ఖాతాలకు కాలానుగుణంగా వర్తించే రేట్లు	దేశీయ కాలపరిమితి ఖాతాలకు కాలానుగుణంగా వర్తించే రేట్లు
ప్రీమియం ఛార్జీలు	చెల్లింపు బాధ్యత ఖాతాదారునిది	బ్యాంక్ చెల్లిస్తుంది
ఖాతాను ముందుగా రద్దు చేసుకునే సౌకర్యం	ఉంది	లేదు
డిపాజిట్‌పై రుణ సౌకర్యం	ఉంది	లేదు
జీవిత బీమా	రెండు ఆప్షన్‌లలో లభ్యం 1) రు.25,000 లు లేదా 2) రు.50,000 లు	డిపాజిట్ సొమ్ము ఆధారంగా లభ్యం 1) రు.లక్ష డిపాజిట్ పై రు.25,000 లు 2) రు.రెండు లక్షల డిపాజిట్‌పై రు.50,000 లు
ప్రమాద బీమా	జీవిత బీమా మొత్తానికి రెండు రెట్లు	జీవిత బీమా మొత్తానికి రెండు రెట్లు
ఆసుపత్రి ఖర్చులకై బీమా సౌకర్యం	రు.25,000 ల నుండి రు.50,000 ల వరకు	డిపాజిట్ సొమ్ము ఆధారంగా 1) రు.లక్ష డిపాజిట్‌పై రు.25,000 లు 2) రు.రెండు లక్షల డిపాజిట్‌పై రు.50,000 లు

భారతీయ జీవిత బీమా సంస్థ మరియు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కం.లి. వారి భాగస్వామ్యంతో వివరాలు జారీ చేయబడుచున్నవి.

ఆంధ్రాబ్యాంక్


(భారత ప్రభుత్వ సంస్థ)

ప్రధాన కార్యాలయం: పట్టాభి భవన్, సైఫాబాద్, హైదరాబాద్ - 500 004. www.andhrabank-india.com

సేవలలో ప్రథమం - బ్యాంకింగ్‌లో ఉత్తమం

Lr. No.666/24/105/96

AKSHARA AB 02 05



R.O. No.70/Sou/Advt./2005

Owned, Printed and Published by V. Hanumantha Rao at G1 Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad-500 029 Ph : 55843495 DTP at Samata Graphics, Hyderabad, Printed at Charita Impressions, Azamabad, Hyderabad. Editor: N. Venugopal

VEEKSHANAM
G1, MYTHRI RESIDENCY,
3-6-394, Road No. 3, Himayatnagar, Hyderabad-500029.